V3 NEWS

www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

ప్రజా విశ్వంభర

అక్షరం సాక్షిగా..

గురువారం
08-01-2026

సంపుటి : 01 | సంచిక : 178 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్



డా॥ కాచం సత్యనారాయణ
CMD



## తెలంగాణలో కొత్త పార్టీ అవసరం లేదు

- రాష్ట్రంలో కొత్త పార్టీ వచ్చినా.. మనుగడ చాలా కష్టం
- చిరంజీవి, దేవేందర్ గౌడ్ పార్టీలు ఏమయ్యాయి..?
- కవిత కొత్త పార్టీ అంశంపై గుత్తా సుఖేందర్ హాట్ కామెంట్స్

2

## మున్సిపల్ ఎన్నికలపై ఈసీ కసరత్తు

- ఈనెల 16 నాటికి ఓటర్ల తుది జాబితా
- ఈ నెల 20వ తేదీలోగా నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం

2







## 2027 జనాభా లెక్కలకు కీలక ముందడుగు

**ఇళ్ల జాబితా సేకరణకు షెడ్యూల్ విడుదల**

**ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు గృహాల లిస్టింగ్**

- ప్రతి రాష్ట్రానికి 30 రోజుల వ్యవధి
- ఈ ప్రక్రియ ప్రారంభానికి ముందు 15 రోజుల పాటు స్వీయ గణనకు ఆప్షన్
- ఆన్‌లైన్ ద్వారా కుటుంబ వివరాలను ముందే నమోదు చేసుకునేలా ఈ మార్పులు
- డిజిటల్ విధానంలో ఈ దఫా జనాభా లెక్కింపు
- కేంద్ర హోం శాఖ ప్రకటన
- జనగణనతోపాటే కుల గణనను కూడా చేపట్టే అవకాశం

**విశ్వంభర, నేషనల్ బ్యూరో :** దేశ వ్యాప్తంగా జనాభా లెక్కలు నిర్వహించేందుకు గత పార్లమెంట్‌లో కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన 2027 జనాభా లెక్కలకు సంబంధించి కీలక ముందడుగు వేసింది. ఇందులో భాగంగా ఇళ్ల జాబితా సేకరణ ప్రక్రియను చేపట్టనున్నట్లు కేంద్ర హోం శాఖ ప్రకటించింది. జనగణన తొలి విడతలో భాగంగా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు గృహాల లిస్టింగ్ జరుగుతుందని వెల్లడించింది. ప్రతి రాష్ట్రానికి 30 రోజుల వ్యవధి ఉంటుందని తెలిపింది. ఈ మేరకు బుధవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు ఈ ఆరు నెలల కాలపరిమితిలో తమకు అనుకూలమైన ఏదైనా 30 రోజుల పాటు ఈ గణనను నిర్వహించుకోవచ్చని నోటిఫికేషన్‌లో పేర్కొంది.స్వయంగా వివరాలు నమోదు చేసుకునే అవకాశం ఈసారి జనాభా లెక్కల్లో ప్రజలకు 'సెల్ఫ్ ఎన్యూమరేషన్' , స్వయంగా వివరాలు నమోదు చేసుకునే వెసులుబాటును కల్పించారు. అధికారులు ఇంటింటికి వచ్చి వివరాలు సేకరించే 30 రోజుల ప్రక్రియ ప్రారంభమవడానికి సరిగ్గా 15 రోజుల ముందే ఈ ఆప్షన్ అందుబాటులోకి వస్తుంది. ప్రజలు ఆన్‌లైన్ ద్వారా తమ కుటుంబ వివరాలను ముందే నమోదు చేసుకునేలా ఈ మార్పులు చేసినట్లు కేంద్రం వెల్లడించింది.

పదేళ్లకోసారి దేశవ్యాప్తంగా నిర్వహించే జన గణన 2021లో చేపట్టాల్సి ఉండగా.. కొవిడ్ కారణంగా వాయిదా పడింది. తాజాగా దీనిని చేపట్టాలని నిర్ణయించిన కేంద్రం.. రెండు దశల్లో నిర్వహించేందుకు సన్నద్ధమవుతోంది. తొలిదశలో గృహాల లిస్టింగ్, గణన (2026 ఏప్రిల్ సెప్టెంబరు), రెండో దశలో జనాభా లెక్కల సేకరణ (2027 ఫిబ్రవరి మార్చి 1)ను నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేస్తోంది. మిగతా2లో...

## జాగృతి 'రూట్ మ్యాప్' సిద్ధం



- ఎజెండా కమిటీతో కవిత జూమ్ కాన్ఫరెన్స్
- 32 అంశాలపై అధ్యయనానికి ప్రత్యేక కమిటీలు
- బీఆర్ఎస్, కాంగ్రెస్ వైఫల్యాలు, అన్ని పార్టీల రాజ్యాంగాల అధ్యయనం చేయాలని సూచన

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** తెలంగాణ సమగ్రాభివృద్ధి కోసం తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఎజెండా కమిటీ సభ్యులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. నీళ్లు, నిధులు, నియామకాలతో పాటు 32 అంశాలపై అధ్యయనానికి ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత పరిపాలించిన బీఆర్ఎస్, కాంగ్రెస్ వైఫల్యాలు, అన్ని పార్టీల రాజ్యాంగాల అధ్యయనం చేయాలని కమిటీలకు సూచించారు. క్షేత్ర స్థాయిలో కమిటీ సభ్యులు అధ్యయనం చేసి ఈ నెల 17వ తేదీ వరకు నివేదిక ఇవ్వాలన్నారు. స్టీరింగ్ కమిటీ ఇచ్చే నివేదిక ప్రకారం జాగృతి రాష్ట్ర విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం నిర్వహించి తదుపరి నిర్ణయం తీసుకుంటామని కమిటీలకు తెలిపారు. ఇదిలా ఉంటే తెలంగాణ జాగృతిని రాజకీయ పార్టీగా విస్తరిస్తామని ఇప్పటికే కవిత ప్రకటించిన సంగతి తెలిసిందే. తన ఎమ్మెల్సీ పదవికి సైతం ఆమె రాజీనామా చేశారు. దీంతో కవిత పూర్తిగా తెలంగాణ జాగృతిపై దృష్టి పెట్టినట్టు కనిపిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే జాగృతి నేతలతో వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు.

## తెలంగాణ వైభవం చాటేలా పతంగుల పండగ

- జనవరి 13 నుండి 15 వరకు పరేడ్ గ్రౌండ్స్‌లో ఇంటర్నేషనల్ కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్
- 16 నుండి 17 తేదీల్లో గచ్చిబౌలి స్టేడియంలో మెగా డ్రోన్ షో
- 16 నుండి 18 వరకు హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్
- హైడ్రా పునరుజ్జీవింపజేసిన చెరువుల వద్ద కూడా పతంగుల పండుగ
- పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

2



## తెలంగాణలో 20 మంది ఐపీఎస్‌లు బదిలీ

- 4 కమిషనరేట్లలో నూతన జోన్లకు డీసీపీల నియామకం
- బదిలీ చేస్తూ సీఎస్ ఉత్తర్వులు జారీ




2

## ఏసీబీ వలలో చిక్కిన అవినీతి చేపలు

- రూ.లక్ష లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ఎంపీడీవో, ఏపీవో, కార్యదర్శి
- రూ.50వేలు లంచం తీసుకుంటూ చిక్కిన దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్




2

## రోగి రాగానే అడ్మిషన్ తప్పనిసరి

- తిప్పి పంపితే కుదరదు
- చేతులు దులుపుకునే వ్యవహారానికి తావు లేకుండా కఠిన నిబంధన
- 'రిఫరల్ సిస్టమ్'ను అమల్లోకి తెచ్చేందుకు వైద్య ఆరోగ్య శాఖ కసరత్తు

2



## యూనివర్శిటీ భూములను కాజేసేందుకు కుట్రలు

- విద్యావ్యవస్థను ధ్వంసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- వర్శిటీల పురోగతిని అంధకారంలోకి నెట్టేస్తోంది
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

2



## దేశ పురోగతిలో అంబేద్కర్ కృషి అనిర్వచనీయం

- ఆర్టికల్ 70 కుల వివక్షతను రద్దు చేయడం ఒక పెద్ద సంస్కరణ
- విద్య, ఆర్థిక శాస్త్రం, పరిపాలన విధానంలో ప్రభావవంతమైన కృషి చేశారు
- ఆయన దూర దృష్టితో తీసుకున్న నిర్ణయాల గురించి విస్తృతంగా చర్చించాలి
- జస్టిస్ సుదర్శన్ రెడ్డి

2



# తెలంగాణ వైభవం చాటేలా పతంగుల పండగ



**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా, టూరిజాన్ని ప్రమోట్ చేయడానికి అంతర్జాతీయ కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్, హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్, డ్రోన్ షోలను ఘనంగా నిర్వహిస్తామని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బుధవారం డా.బీ.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో పర్యాటక అభివృద్ధి సంస్థ మెనేజింగ్ డైరెక్టర్ క్రాంతి వల్లూరి, నిథమ్ డైరెక్టర్ వెంకటరమణ, క్లిక్ ప్రతినిధులతో కలిసి ఈ కార్యక్రమాల వివరాలను మంత్రి జూపల్లి వివరించారు. రాష్ట్ర టూరిజాన్ని ప్రమోట్ చేయడానికి ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇంటర్నేషనల్ కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్ ను సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ లో జనవరి 13 నుంచి 15 వరకు అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని మంత్రి జూపల్లి చెప్పారు. సెలబ్రేట్ ది స్కై పేరుతో సంక్రాంతి సెలబ్రేషన్స్ జరుగుతాయని తెలిపారు. ఈ ఫెస్టివల్‌లో 19 దేశాల నుంచి 40 మంది అంతర్జాతీయ కైట్ ఫ్లయర్స్, అదేవిధంగా మన దేశంలోని 15 రాష్ట్రాలకు చెందిన 55 నేషనల్ కైట్ ఫ్లయర్స్ పాల్గొంటున్నారని తెలిపారు. అదే విధంగా కల్చర్ లాంగ్వేజ్ ఇండియన్ కనెక్షన్స్ (క్లిక్ ) సహకారంతో జరిగే మిఠాయిల ఉత్సవంలో ఇతర రాష్ట్రాలు, దేశాల నుండి వచ్చి హైదరాబాద్‌లో స్థిరపడిన వారు తమ ఇళ్లలో తయారు చేసిన 1200 రకాల రకాల మిఠాయిలను, తెలంగాణ పిండి వంటలను 60 స్టాళ్లలో అందుబాటులో ఉంచుతామని పేర్కొన్నారు. 100 చేనేత, హస్తకళల స్టాల్స్ ను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. తెలంగాణ సాంస్కృతిక కార్యక్రమాలను కూడా ప్రదర్శిస్తారని అన్నారు. వీక్షకులకు ఉచిత ప్రవేశం ఉంటుందని, అందరూ ఆహ్వానితులే అని ఇంటర్నేషనల్ కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్ కు మంత్రి ప్రకటించారు.

**హాట్ బెలూన్ ఫెస్టివల్..**

జనవరి 16 నుండి 18 వరకు హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నామని, ఐరోపా దేశాలకు చెందిన ప్రతినిధులతో అంతర్జాతీయ స్థాయి బెలూన్లతో ప్రదర్శన ఉంటుందని. ఉదయం పూట హైదరాబాద్ శివార్లలో, సాయంత్రం వేళ పరేడ్ గ్రౌండ్స్‌లో "నైట్ గ్లో బెలూన్ షో ఉంటుందని వివరించారు. ఈ బెలూన్ లో విహరించే ఔత్సాహికులు బుక్ మై షో లాంటి ఆన్ లైన్ ప్లాట్ ఫాంలో బుకింగ్ చేసుకోవాలని సూచించారు.

**జనవరి 16 నుంచి డ్రోన్లతో మెగా షో..**

జనవరి 16 , 17 తేదీల్లో గచ్చిబౌలి స్టేడియంలో అత్యాధునిక డ్రోన్లతో మెగా షో సాగనుందని, ఇది భారతీయ సాంస్కృతిక వారసత్వం నుండి ఆధునిక ఆవిష్కరణల వరకు సాగిన ప్రయాణాన్ని ప్రతిబింబిస్తుందని తెలిపారు. ఎల్ఈడీ లైట్లతో కూడిన రేస్‌కోర్స్, భారీ స్క్రీన్‌లపై పస్ట్ పర్సన్ వ్యూ వీడియో ఫీడ్స్, డ్రోన్లతో గగనతలంలో సాకర్ (పుట్ బాల్) ఆట, తెలంగాణ పర్యాటక ప్రాంతాల ప్రదర్శన ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఇవన్ని సందర్శకులకు గొప్ప అనుభూతిని పంచనున్నాయని అన్నారు.

**హైడ్రా చెరువుల వద్ద పతంగుల పండుగ..**

చెరువుల పరిరక్షణే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం హైడ్రా ఆధ్వర్యంలో పునరుజ్జీవింపజేసిన బాగ్ అంబర్ పేటలోని బతుకమ్మ కుంట, కూకట్ పల్లిలోని నల్ల చెరువు, మాదాపూర్ లోని తమ్మిడికుంట, రాజేంద్రనగర్ లోని నేషనల్ పోలీస్ అకాడమీ సమీపంలోని బమ్ రుకున్ ఉద్ దౌలా చెరువుల వద్ద పతంగుల పండగ నిర్వహిస్తామని చెప్పారు. గతంలో తెలంగాణ పర్యాటక రంగం నిర్లక్ష్యానికి గురైందని, పర్యాటక అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో నూతన పర్యాటక విధానాన్ని తీసుకువచ్చి, పర్యాటక రంగాన్ని బలోపేతం చేస్తున్నామని అన్నారు. పర్యాటక అభివద్ధి సంస్థ మెనేజింగ్ డెరెక్టర్ క్రాంతి వల్లూరి మాట్లాడుతూ, ఈ ఉత్సవాలకు పరేడ్ గ్రౌండ్ కు వచ్చే సందర్శకులు ప్రజా రవాణాకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. ఊబర్, ర్యాపిడో సేవలను వినియోగించుకునే ప్రయాణికులకు ప్రత్యేక రాయితీలు కల్పిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో క్లిక్ కన్వీనర్ లిబి బెంజిమన్, వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికలపై ఈసీ కసరత్తు

**విశ్వంభర, హైదరాబాద్ :** రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలకు రంగం సిద్ధమవుతోంది. ఈ నెల 20వ తేదీలోగా నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉంది. అందుకు తగ్గట్టుగా ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల కమిషన్ కసరత్తు మొదలు పెట్టాయి. ఇందులో భాగంగా మున్సిపల్ ఎన్నికలపై ఉన్నతాధికారులతో ఎస్ఈసీ రాణికుముదిని బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఓటర్ల జాబితా సవరణ గడువును రాష్ట్ర ఎన్నికల సంఘం పొడిగించింది. ఈ నెల 13 నాటికి పోలింగ్‌స్టేషన్ల వివరాల ముసాయిదా ప్రచురించాలని ఎస్ఈసీ ఆదేశించారు. ఈ నెల 16 నాటికి ఓటర్ల తుది జాబితా ప్రచురించాలని స్పష్టం చేశారు. బ్యాలెట్ బాక్సులు, సిబ్బంది నియామకంపై చర్చించారు. ఇప్పటికే జిల్లా, మండల స్థాయిలో రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించిన ఈసీ.. గురువారం రాజకీయ పార్టీల రాష్ట్ర స్థాయి ప్రతినిధులతో సమావేశం కానుంది. తెలంగాణలో గడువు ముగిసిన 117 మున్సిపాల్టీ పాలకవర్గాలకు ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే.

# తెలంగాణలో కొత్త పార్టీ అవసరం లేదు

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** తెలంగాణలో కొత్త పార్టీ పెట్టాల్సినంత అవసరం లేదని శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ వ్యాఖ్యానించారు. కవిత కొత్త పార్టీ పెట్టనున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో ఆయన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. 2028 ఎన్నికల్లో తాను పోటీ చేస్తానని కవిత.. శాసనమండలి సాక్షిగా వెల్లడించారు. ఈ క్రమంలోనే కొత్త పార్టీ అంశంపై గుత్తా సుఖేందర్ స్పందించారు. రాష్ట్రంలో కొత్త పార్టీ వచ్చినా మనుగడ చాలా కష్టమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగానే కవిత రాజీనామా ఆమోదంపై కూడా ఆయన స్పష్టతనిచ్చారు. ఏ సభ్యులైనా భావోద్వేగంతో రాజీనామా చేస్తే.. దానిని ఆమోదించడానికి కొంత సమయం తీసుకుంటామని, అదే విధంగా కవిత విషయంలో కూడా ఆగామని అన్నారు.''కవిత విజ్ఞప్తి చేయడంతోనే ఆమె రాజీనామాను ఆమోదించడం జరిగింది. భావోద్వేగంతో ఎవరు రాజీనామా చేసినా అదే విధంగా స్పందిస్తాం. కవిత విషయంలో స్పెషల్ ట్రీట్‌మెంట్ ఏమీ లేదు'' అని తెలిపారు. ''రాజీనామా ఎవరైనా వ్యక్తిగతం వచ్చి అందిస్తే ఆమోదిస్తాం. కవిత ముందుగా తన రాజీనామాను పీఏ ద్వారా అందించారు. ఆ తర్వాత ఆమె కలిసి తన రాజీనామా ఆమోదించాలని, అదే విధంగా తనకు మండలిలో మాట్లాడే అవకాశం ఇవ్వాలని కోరారు. రాజీనామా చేసే వారు ఎవరైనా వారికి ఆ అవకాశం కల్పిస్తాం. కవిత విషయంలో కూడా అదే పాటించాం'' అని తెలిపారు. అనంతరం కవిత కొత్త పార్టీ అంశంపై మాట్లాడారు. ''రాష్ట్రంలో కొత్త పార్టీ అవసరం లేదు. పెట్టినా మనుగడ కష్టం. గతంలో వచ్చిన పలు రాజకీయ పార్టీలు కనుమరుగయ్యాయి. పార్టీ పెట్టి దానిని నిలబెట్టుకోవడం అనుకున్నంత సులువు కాదు'' అని వివరించారు. ''గతంలో చిరంజీవి తన సొంత పార్టీని స్థాపించారు. అదే విధంగా దేవేందర్ గౌడ్‌లు కూడా పార్టీ పెట్టారు. అవి ఏమయ్యాయో అందరికీ తెలుసు'' అని తెలిపారు.

# యూనివర్శిటీ భూములను కాజేసేందుకు కుట్రలు

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** బడ్జెట్ కేటాయింపులు లేకుండా విద్యావ్యవస్థను ధ్వంసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం తాజాగా యూనివర్సిటీల భూములను కాజేయడంపై మిషన్ మోడ్'లో పనిచేస్తోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం ఎక్స్‌వేదికగా స్పందిస్తూ.. ఇటీవల హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను ప్రైవేటు పరం చేసేందుకు అటవీ సంపదను, జీవవైవిధ్యాన్ని లెక్కచేయకుండా ఆ భూమిని చదును చేసేందుకు ప్రయత్నించిందన్నారు. సుప్రీం కోర్టు జోక్యం చేసుకుని మొట్టికాయలు వేస్తే వెనక్కు తగ్గిందని పేర్కొన్నారు. తాజాగా గచ్చిబౌలిలోని ప్రఖ్యాత మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ భూములపై కన్నేసిందన్నారు. యూనివర్సిటీలోని 50 ఎకరాలను వెనక్కు తీసుకుని మళ్లీ ప్రైవేటుకు కట్టబెట్టేందుకు రంగం సిద్ధం చేసిందన్నారు. యూనివర్సిటీల వద్ద భూమి ఉంటే భవిష్యత్ అవసరాలకోసం, విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించేందుకు ఉపయోగపడుతుందని, ప్రభుత్వ ఖజానాను నింపేందుకు వాడుకోవాల్సిన అవసరం లేదన్నారు. ల్యాండ్ బ్యాంక్ పెంచుకోవడం యూనివర్సిటీ భూములను ఆర్థిక దోపిడీకి వాడుకోవడంపైనే రేవంత్ రెడ్డి సర్కారు ఆసక్తి చూపిస్తోంది. రాష్ట్రంలో విద్యావ్యవస్థ, వర్సిటీల పురోగతిని మాత్రం అంధకారంలోకి నెట్టేస్తోందని మండిపడ్డారు.

# సంక్రాంతికి 6,431 ప్రత్యేక బస్సులు

**50శాతం అదనపు ఛార్జీలు**

**తెలంగాణ ఆర్టీసీ ప్రకటన**



**విశ్వంభర, హైదరాబాద్:** సంక్రాంతి రద్దీ నేపథ్యంలో 6,431 ప్రత్యేక బస్సులు నడపనున్నట్టు తెలంగాణరాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. ఈ నెల 9, 10, 12, 13, 18, 19 తేదీల్లో ప్రత్యేక బస్సులు నడుస్తాయని పేర్కొంది. ప్రత్యేక బస్సుల్లో 50శాతం అదనపు ఛార్జీలు వసూలు చేయనున్నట్టు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఎంజీబీఎస్, జేబీఎస్, ఉప్పల్ క్రాస్ రోడ్, ఆరాంఘర్, ఎల్బీనగర్, కేపీహెచ్‌బీ, బోయిన్‌పల్లి, గచ్చిబౌలి నుంచి ప్రత్యేక బస్సులు నడుస్తాయని చెప్పారు.

# 30న తెలంగాణ బార్‌కు తొలి ఎన్నికలు

**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ ఏర్పడిన పన్నెండేళ్ల తరువాత బార్ అసోసియేషన్ కు తొలి సారిగా ఈ నెల 30 న ఎన్నికలు జరగనున్నాయి. 2014 లో రాష్ట్రం ఏర్పడినప్పటికీ హైకోర్టు విభజన జరగలేదు. 2018 వరకు రెండు రాష్ట్రాలకు ఒకే హై కోర్టు పని చేసింది. 2019 లో రెండు హై కోర్టులు ఏర్పడ్డాయి. అప్పటికే ఎన్నికైన ఉమ్మడి హై కోర్టు బార్ అసోసియేషన్ కమిటీ మాత్రమే ఇప్పటికీ కొనసాగుతున్నది. ఆ లెక్కన తెలంగాణ హై కోర్టు కు ఎన్నిక కాబోయే తొలి కమిటీ అవుతుంది. 30 జరగనున్న ఎన్నికల్లో బార్ సభ్యులు అందరూ పాల్గొన వలసిన సిందిగా ప్రస్తుత బార్ అధ్యక్షులు ప్రతాప్ రెడ్డి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. పదిన్నర నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పోలింగ్ జరుగుతుందని ఆయన వివరించారు.

## 2027 జనాభా లెక్కలకు కీలక ముందడుగు

(మొదటి పేజీ తరువాయి)

ఈ దఫా జనాభా లెక్కింపు డిజిటల్ విధానంలో నిర్వహించనున్నట్లు కేంద్రం ఇదివరకే స్పష్టం చేసింది. మొబైల్ యాప్‌ల ద్వారా జనాభా లెక్కల సమాచారాన్ని సేకరిస్తామని, స్వీయ గణనకు ఇదెంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొంది. మరోవైపు, జనగణనతోపాటే కుల గణనను కూడా చేపట్టనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ఇటీవల వెల్లడించిన విషయం తెలిసిందే.

# ఏసీబీ వలలో చిక్కిన అవినీతి చేపలు

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** తెలంగాణలోని వివిధ చోట్ల పలువురు అధికారులు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. ఎంపీడీవో కార్యాలయంలో రూ.లక్ష లంచం తీసుకుంటుండగా రంగారెడ్డి జిల్లా నందిగామ ఎంపీడీవో సుమతి, ఏపీవో తేజ్ సింగ్, ఈదులపల్లి కార్యదర్శి చెన్నయ్యను ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కుమార్ అరెస్ట్ చేశారు. నందిగామ మండల పరిధిలోని ఈదులపల్లి గ్రామంలో బొబ్బిలి ప్రవీణ్ చేపట్టిన భవన నిర్మాణానికి రూ.3.5లక్షలు లంచం ఇవ్వాలని అధికారులు డిమాండ్ చేశారు. గతంలో రూ.లక్ష ఇచ్చిన ప్రవీణ్.. ఈ వ్యవహారంపై ఏసీబీ అధికారులకు సమాచారం అందించారు. బుధవారం మరో రూ.లక్ష లంచం తీసుకుంటుండగా ముగ్గురినీ ఏసీబీ డీఎస్పీ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

రూ.50వేలు తీసుకుంటూ చిక్కిన దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్

హైదరాబాద్‌లోని బాగ్ అంబర్‌పేటలోని దేవాదాయ శాఖకు చెందిన భూమి సర్వే రిపోర్టు ఇచ్చేందుకు ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ అక్కవరపు కిరణ్ కుమార్ రూ. 1.50లక్షలు లంచం డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయంలో రూ.50వేలు లంచం తీసుకుంటుండగా కిరణ్ కుమార్‌ను ఏసీబీ అధికారులు కస్టడీలోకి తీసుకున్నారు.

# రోగి రాగానే అడ్మిషన్ తప్పనిసరి

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** తెలంగాణలోని ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరులో విప్లవాత్మక మార్పులు తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. పేద రోగుల పాలిట శాపంగా మారిన 'రిఫరల్' విధానానికి చెక్ పెడుతూ, బాధ్యతాయుతమైన వైద్య సేవలను అందించడమే లక్ష్యంగా పకడ్బందీ ప్రణాళికను రచిస్తోంది. ఇకపై ప్రభుత్వ దవాఖానకు వచ్చిన ఏ రోగినీ.. 'మా వల్ల కాదు', 'ఇక్కడ సౌకర్యాలు లేవు', 'కేసు సీరియస్‌గా ఉంది' అనే సాకులు చెప్పి తిప్పి పంపేందుకు వీల్లేదు. రోగి పరిస్థితి ఏదైనా సరే.. ఆసుపత్రి గడప తొక్కిన వెంటనే అడ్మిషన్ చేసుకోవాల్సిందే. ఒకవేళ మెరుగైన వైద్యం కోసం మరో ఆసుపత్రికి పంపాల్సి వచ్చినా.. చేతులు దులుపుకునే వ్యవహారానికి తావు లేకుండా కఠిన నిబంధనలతో కూడిన 'రిఫరల్ సిస్టమ్'ను అమల్లోకి తెచ్చేందుకు వైద్య ఆరోగ్య శాఖ కసరత్తు చేస్తోంది.

**అడ్మిషన్ తర్వాతే ఏదైనా..**

ప్రస్తుతం అనేక ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగి పరిస్థితి విషమంగా ఉందనో, వెంటిలేటర్లు ఖాళీ లేవనో చెప్పి అడ్మిషన్ చేసుకోకుండానే వెనక్కి పంపుతున్న ఘటనలు కోకొల్లలు. దీనివల్ల సమయానికి వైద్యం అందక ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. ఈ దుస్థితిని మార్చేందుకు ప్రభుత్వం నడుం బిగించింది. ఇకపై రోగి ఏ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చినా ముందుగా అడ్మిషన్ నమోదు చేసుకోవడం తప్పనిసరి చేయనున్నారు. ప్రాథమిక చికిత్స అందించి, రోగిని స్థిరీకరించిన తర్వాతే తదుపరి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ సంబంధిత ఆసుపత్రిలో స్పెషలిస్ట్ డాక్టర్లు లేకపోయినా, ఎక్విప్‌మెంట్ అందుబాటులో లేకపోయినా రోగిని పెద్ద ఆసుపత్రికి (టెర్షరీ కేర్) రిఫర్ చేయవచ్చు. కేవలం మౌఖికంగా చెప్పి పంపడం కుదరదు. పేషెంట్‌ను ఎందుకు రిఫర్ చేస్తున్నారో రికార్డుల్లో స్పష్టమైన కారణం రాయాలి. ఏ ఆసుపత్రికి రిఫర్ చేస్తున్నారో, అక్కడ ఆ సౌకర్యం ఉందో లేదో నిర్ధారించుకోవాలి. ముఖ్యంగా రిఫర్ చేసే ముందే సంబంధిత పెద్ద ఆసుపత్రికి సమాచారం ఇవ్వాలి. దీనివల్ల రోగి అక్కడికి వెళ్లగానే బెడ్, వైద్యులు సిద్ధంగా ఉండే వెసులుబాటు కలుగుతుంది.

**అధ్యయనానికి కమిటీ...**

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ బుధవారం ఉన్నతాధికారులతో ఈ అంశంపై అంతర్గతంగా సమీక్ష నిర్వహించినట్లు తెలిసింది. ప్రభుత్వాసుపత్రుల్లో రిఫరల్ వ్యవస్థను గాడిలో పెట్టేందుకు, ఇతర రాష్ట్రాల్లోని విధానాలను పరిశీలించేందుకు ఒక ప్రత్యేక కమిటీని వేయాలని సర్కారు నిర్ణయించినట్లు సమాచారం. ఈ కొత్త విధానం అమల్లోకి వస్తే పేద రోగులకు అగచాట్లు తప్పి, సకాలంలో మెరుగైన వైద్యం అందుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఫలితంగా రిఫరల్‌కు 'పక్కా' నిబంధనలు అమలై కిందిస్థాయి హాస్పిటల్స్ వైద్యుల ఇష్టారాజ్యానికి చెక్ పడనుంది.



# దేశ పురోగతిలో అంబేద్కర్ కృషి అనిర్వచనీయం

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** దేశ పురోగతిలో అంబేద్కర్ కృషి అనిర్వచనీయమని సుప్రీమ్ కోర్టు రిటైర్డ్ జడ్జ్ జస్టిస్ సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం డా. బి ఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ప్రాంగణంలో బి. ఆర్. అంబేద్కర్ ఇంటర్నేషనల్ ఇన్స్టిట్యూట్ ఫర్ డైలాగ్ ఆన్ గవర్నెన్స్ అండ్ ఈక్విటీ (బ్రిడ్జ్) పరిశోధన కేంద్రాన్ని ప్రారంభించారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ లోతైన ఆలోచనలు, భావజాలాన్ని ఈ సంస్థ ప్రతిధ్వనిస్తుందనే ఆశాభావాన్ని వ్యక్త పర్చారు. విద్య, ఆర్థిక శాస్త్రం, పరిపాలన విధానంలో ప్రభావవంతమైన కృషి చేసారని వెల్లడించారు. ఆర్టికల్ 70 కుల వివక్షతను రద్దు చేయడం ఒక పెద్ద సంస్కరణ అని పేర్కొన్నారు. డాక్టర్ అంబేద్కర్ బౌద్ధమత పరివర్తనలను విస్తృతంగా చర్చించడానికి ఈ కేంద్రం ఉపయోగపడాలని ఆకాంక్షించారు. బిఆర్ అంబేద్కర్ ఇతర ఆలోచనల గురించి, ఆయన దూర దృష్టితో తీసుకున్న నిర్ణయాల గురించి విస్తృతంగా చర్చించాల్సిన అవసరం ఉందని వెల్లడించారు. విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొ. ఘంటా చక్రపాణి కార్యక్రమానికి అధ్యక్షత వహించి మాట్లాడుతూ సామాజిక న్యాయం, స్వేచ్ఛ, కులం, భాష, విద్య, సాధికారత వంటివి సమానత్వంలో అంతర్భాగమని పేర్కొన్నారు. అవగాహన, విద్యలో అంతరాలను తగ్గించడమే లక్ష్యంగా, సమాజాన్ని విభజించే అదృశ్య గోడలను కూల్చివేసేందుకు బ్రిడ్జ్ ఒక వేదికగా పనిచేస్తుందని వెల్లడించారు. అందరికీ సమాన అవకాశాలను అందించడం, సమ్మిళిత సమాజాన్ని పెంపొందించడమే ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఎస్సీ సబ్ ప్లాన్ కింద ఈ కేంద్రాన్ని, కార్యక్రమాన్ని కొనసాగించడానికి, విస్తరించడానికి రాబోయే ఐదు సంవత్సరాల పాటు ఏటా రూ. 10 కోట్లు నిధులు కేటాయించేలా తెలంగాణ ప్రభుత్వాన్ని కోరామన్నారు. రానున్న రోజుల్లో ఈ అంతర్జాతీయ పరిశోధనా కేంద్రం అన్ని దేశాల పరిశోధకులకు మార్గదర్శిగా నిలువనుందని, ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన సామాజిక పరిశోధకులతో పలు కమిటీలను ఏర్పాటు చేసి బ్రిడ్జ్ సేవలు ప్రపంచ వ్యాప్తంగా విస్తరించేలా చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఓయూ వీసీ ప్రొ. మొలుగురం కుమార్ మాట్లాడుతూ విద్య, సామాజిక అభివృద్ధి, సమానత్వం మధ్య అంతరాలను తగ్గించడం ప్రాముఖ్యతను, ముఖ్యంగా విస్తృత సమగ్ర దృక్పథాలను పెంచేందుకు కృషి చేయాలన్నారు. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ చేపట్టే వివిధ విద్యా పరిశోధన కార్యక్రమాలు, ఫెలోషిప్లు, కార్యకలాపాలకు ఉస్మానియా విశ్వవిద్యాలయం సంపూర్ణ మద్దతు ఇస్తుందని వెల్లడించారు.

# తెలంగాణలో 20 మంది ఐపీఎస్‌లు బదిలీ




**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలో 20 మంది ఐపీఎస్‌లు బదిలీ అయ్యారు. నాలుగు కమిషనరేట్లలో కొత్తగా ఏర్పడిన జోన్లకు డీసీపీలను ప్రభుత్వం కేటాయించింది. ఈ మేరకు ఐపీఎస్‌లను బదిలీ చేస్తూ సీఎస్ ఉత్తర్వులు జారీ చేశారు.

**బదిలీ అయిన ఐపీఎస్‌లు వీరే..**

దక్షిణ రేంజ్ అదనపు సీపీగా తఫ్సీర్ ఇక్బాల్
ఉత్తర రేంజ్ జాయింట్ సీపీగా శ్వేత
స్పెషల్ బ్రాంచ్ జాయింట్ సీపీగా విజయ్ కుమార్
కూకట్‌పల్లి డీసీపీగా రితిరాజ్
చేవెళ్ల యోగేశ్ గౌతమ్
మహేశ్వరం జోన్ (ఫ్యూచర్ సిటీ కమిషనరేట్) కె. నారాయణ రెడ్డి
ఎల్బీనగర్ అనురాధ
ఉప్పల్ జోన్ సురేశ్ కుమార్
సికింద్రాబాద్ కె. రక్షిత
కుత్బుల్లాపూర్ ఎన్. కోటిరెడ్డి
చార్మినార్ జోన్ కిరణ్ ప్రభాకర్
శేరిలింగంపల్లి సీహెచ్ శ్రీనివాస్
మల్కాజిగిరి జోన్ శ్రీధర్
ఖైరతాబాద్ జోన్ శిల్పవల్లి
రాజేంద్ర నగర్ శ్రీనివాస్
గోల్కొండ జోన్ చంద్ర మోహన్
జూబ్లీ హిల్స్ జోన్ రమణా రెడ్డి
శంషాబాద్ జోన్ రాజేశ్
షాద్‌నగర్ (ఫ్యూచర్ సిటీ కమిషనరేట్) శిరీష
సిద్దిపేట సీపీగా సాధనా రష్మీ పెరుమాళ్

# ఏఐసీసీ పరిశీలకుడిగా ఉత్తమ్

## తమిళనాడు, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల కోసం నియామకం



**విశ్వంభర, హైదరాబాద్ :** తమిళనాడు, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికలకు ఏఐసీసీ పరిశీలకుడిగా తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి నియమితులయ్యారు. నాలుగు రాష్ట్రాల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల పర్యవేక్షణకు ఏఐసీసీ సీనియర్ పరిశీలకులను నియమించింది. అస్సాం, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో అస్సాం ఎన్నికల పరిశీలకులుగా భూపేష్ భగేల్, డీకే శివకుమార్, బంధు టిర్కి, కేరళకు సచిన్ పైలెట్, కేజె జార్జ్, ఇమ్రాన్, కన్హయ్య కుమార్, తమిళనాడు, పుదుచ్చేరికి పరిశీలకులుగా ముఖుల్ వాస్నిక్, ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఖాజి మహ్మద్ నిజాముద్దీన్.. పశ్చిమ బెంగాల్‌కు సుదీప్ రాయ్ భర్మన్, షకీల్ అహ్మద్ ఖాన్, ప్రకాష్ జోషిని నియమించినట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఓ ప్రకటనలో తెలిపారు.

# టెట్ మినహాయింపు కోసం ఫిబ్రవరి 5న ఢిల్లీలో పార్లమెంట్ మార్చ్

- జనవరి 9న నల్లబ్యాడ్జీలతో రాష్ట్రవ్యాప్త నిరసనలు

**విశ్వంభర, హైదరాబాద్ :** సీనియర్ ఉపాధ్యాయులను ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నుంచి మినహాయించాలని, జాతీయ విద్యా విధానం (ఎన్ఈపి)ను రద్దు చేయాలని, పాఠశాలల మూసివేత-విలీనాలను నిలిపివేయాలని, ఎన్పిఎస్, సిపిఎస్‌లను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని తదితర డిమాండ్లతో ఫిబ్రవరి 5న ఢిల్లీలో నిర్వహించే పార్లమెంట్ మార్చ్‌ను విజయవంతం చేయాలని అఖిల భారత ఉపాధ్యాయ సంఘాల సంయుక్త కార్యాచరణ కమిటీ (ఎఐ జాక్టో) పిలుపునిచ్చింది.ఈ మేరకు బుధవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం, హైదరాబాదులో ఎఐ జాక్టో స్టీరింగ్ కమిటీ సభ్యుడు, ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు జి సదానందం గౌడ్ అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొని నిర్ణయాలు తీసుకున్నారు. సుప్రీంకోర్టు తీర్పు వచ్చి నాలుగు నెలలు గడిచినా కేంద్ర ప్రభుత్వం, జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి (ఎన్సీటిఈ) స్పందించకపోవడాన్ని సమావేశం తీవ్రంగా ఖండించింది. 2010 ఆగస్టు 23కు ముందు నియమితులైన ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు ఉన్న విషయాన్ని సుప్రీంకోర్టుకు ఎన్సీటిఈ తెలియజేయకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. తీర్పు అమలైతే రెండేళ్లలో టెట్ పాస్ కాకపోతే లక్షలాది ఉపాధ్యాయులు ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఉందని, వేలాది పాఠశాలలు మూతపడి పేద పిల్లలకు విద్య దూరమయ్యే పరిస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ నెల 9న రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన తెలపాలని, అన్ని జిల్లాల నుంచి రాష్ట్రపతి, ప్రధాన మంత్రికి మెమోరాండంలు పంపించాలని నిర్ణయించారు. ఫిబ్రవరి 5న పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు ఢిల్లీకి వెళ్లి పార్లమెంట్ మార్చ్‌లో పాల్గొనాలని పిలుపునిచ్చారు.ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం జాతీయ స్థాయిలో ఐక్యంగా పోరాడాలని ఎస్టిఎఫ్ఐ, ఎఐఎస్టిఎఫ్, ఎఐపిటిఎఫ్, ఎఐఎఫ్ఇటిఒ తదితర జాతీయ ఉపాధ్యాయ సంఘాలు నిర్ణయించాయని, ఇతర జాతీయ ఫెడరేషన్లు కూడా ఈ ఉద్యమానికి మద్దతు ఇస్తున్నాయని ఎఐ జాక్టో స్టీరింగ్ కమిటీ సభ్యుడు, టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి తెలిపారు. టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ వెంకట్, ఎస్టియు ప్రధాన కార్యదర్శి జుట్టు గజేందర్, పిటిఐ టిజి అధ్యక్షుడు మల్లికార్జున్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె శారద, ఎఐఎఫ్ఇటిఒ జాతీయ కార్యదర్శి పోల్ రెడ్డి, టిఆర్ టిఎఫ్




రాష్ట్ర అధ్యక్షుడు కటకం రమేశ్, టిపిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్ తిరుపతి, టిఎస్టియు అధ్యక్షుడు మొహమ్మద్ అబ్దుల్లా, డిటిఎఫ్ నాయకులు రామకృష్ణ, సుటా అధ్యక్షుడు ఎంఎ నయీమ్ , ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ ఖాన్, ఎంటియు అధ్యక్షుడు మోయిన్, ప్రధాన కార్యదర్శి ఎం ఎ అలీమ్, టిడబ్ల్యు టియు ప్రధాన కార్యదర్శి అశోక్ కుమార్, టిజిటిఎ ప్రధాన కార్యదర్శి గీతాంజలి, ఎం ఎస్ టి యు అధ్యక్షులు విఠల్, సయ్యద్ అజ్గర్, మీర్ ముంతాజ్ అలీ, పర్వతి సత్యనారాయణ, ఎస్ వై కొండలరావు, కరుణాకర్ రెడ్డి, ఇఫ్తేకారుద్దీన్, రామసుబ్బారావు, నరసింహారెడ్డి, మస్తాన్ రావు, ఎం దేవదాసు, జి వెంకటేశ్వర్లు, సిహెచ్ ప్రభాకర్, సందీప్, వరలక్ష్మీ తదితర నాయకులు పాల్గొన్నారు.

# కేటీఆర్ నియోజకవర్గంపై రేవంత్ రెడ్డి కన్ను

- వచ్చే ఎన్నికల్లో గులాబీ కంచుకోటను బద్దలు కొట్టేలా వ్యూహం
- ఇప్పటికే తన ప్లాన్‌ను ఆచరణలో పెట్టిన సీఎం
- పసిగట్టిన కేటీఆర్.. ఎత్తుకు పైఎత్తు వేసే పనిలో నిమగ్నం
- బీఆర్ఎస్ నాయకుల కోసం మూడు లీగల్ సెల్స్
- అయినా చేజారుతున్న స్థానిక కేడర్



**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** బీఆర్ఎస్ పార్టీకి కంచు కోటగా ఉన్న సిరిసిల్లపై సీఎం రేవంత్ రెడ్డి కన్నేసినట్టు తెలుస్తోంది. వరుసగా ఐదు సార్లు ఆ నియోజకవర్గం నుంచి విజయం సాధించిన కేటీఆర్‌కు చెక్ పెట్టేందుకు సీఎం వ్యూహం రచించినట్టు సమాచారం. ఇందులో భాగంగానే ఆ నియోజకవర్గం బీఆర్ఎస్ నేతలను హస్తం గూటికి చేరుస్తున్నట్టు జోరుగా ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకురావడంతోపాటు వచ్చే ఎన్నికల్లో ఇదే స్థానం నుంచి గెలిచి డబుల్ హ్యాట్రిక్ కొట్టాలనే కేటీఆర్ కోరిక నెరవేరడం సాధ్యమేనా? పార్టీకి అధికారం సంగతి అటుంచి సిరిసిల్ల నుంచి తాను గ్యారంటీగా గెలుస్తారా? అనేది సిరిసిల్లలో కొంతకాలంగా జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే కలుగుతున్న అనుమానాలివి. ఒక పక్క బీఆర్ఎస్ స్థానిక నాయకులు చేజారుతుండడం, మరోపక్క కేటీఆర్ తీసుకుంటున్న నిర్ణయాలు వీటికి బలం చేకూరుస్తున్నాయి.

కేటీఆర్ 2009లో తొలిసారి సిరిసిల్ల నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థి కేకే మహేందర్ రెడ్డిపై విజయం సాధించారు. తరువాత 2010 ఉప ఎన్నికలతో పాటు 2014, 2018, 2023 ఎన్నికల్లోనూ ఇదే స్థానం నుంచి కేటీఆర్ గెలుపొందాడు. ఇక్కడి నుంచి వరుసగా ఐదుసార్లు గెలిచిన కేటీఆర్‌కు వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా బ్రేక్ వేయాలని కాంగ్రెస్ అధిష్టానంతో పాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పక్కా ప్లాన్ వేసినట్లు తెలుస్తోంది. ఇది పసిగట్టిన కేటీఆర్.. కాంగ్రెస్ ఎత్తుకు పైఎత్తు వ్యూహంతో ముందుకు సాగుతున్నట్లు సిరిసిల్లలో ప్రచారం జరుగుతోంది. నియోజకవర్గంలో చీమ చిటుక్కుమన్నా తనకు సమాచారం వచ్చేలా కేటీఆర్ నెట్ వర్క్ ఏర్పాటుచేసుకోవడం చూస్తే ఇదే నిజమనిపిస్తోంది.

### మూడు లీగల్ సెల్స్.. ?

రాబోయే ఎన్నికల్లో గెలవాలంటే స్థానిక నాయకులు చేజారకుండా చూసుకోవడం ముఖ్యం. అధికార పార్టీ ప్రలోభాలకు, బెదిరింపులకు, కేసులకు లొంగి పార్టీ మారకుండా కార్యకర్తలను, నాయకులను కాపాడుకోవాలి. ఇందులో భాగంగానే కేటీఆర్ మూడు లీగల్స్ ఏర్పాటుచేయనున్నట్లు సమాచారం. ఇటీవల పంచాయతీ ఎన్నికల్లో పార్టీ మద్దతుతో గెలిచిన సర్పంచుల ఆత్మీయ సమ్మేళనంలో కేటీఆర్ ఇదే విషయాన్ని ప్రస్తావించారు. అధికార పార్టీ బెదిరింపులకు భయపడి తమ సర్పంచ్‌లు చేజారిపోకుండా లీగల్ సెల్ ఏర్పాటుచేస్తున్నట్లు ప్రకటించారు. గ్రామాల్లో సర్పంచులు చేజారితే వచ్చే ఎన్నికల్లో విజయం కష్టమని భావించి ఈ లీగల్ సెల్ ఏర్పాటు చేశారు. అలాగే కార్యకర్తలు పార్టీ వీడకుండా ఒకటి, అధికార పార్టీ అక్రమాలను బయటపెట్టే మీడియా ప్రతినిధులకు అండగా మరొక లీగల్ సెల్ ఏర్పాటుచేసేందుకు కేటీఆర్ నిర్ణయించినట్లు తెలుస్తోంది.

చేజారుతున్న నేతలు..

ఒకవైపు సిరిసిల్లలో మరో మారు జెండా ఎగరవేయాలని కేటీఆర్ ప్రణాళిక సిద్ధం చేసుకుంటుండగా.. మరోవైపు బీఆర్ఎస్ స్థానిక నేతలు పార్టీ మారడం మాత్రం ఆగడం లేదు. ఇటీవలే రాజన్న సిరిసిల్ల జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు తోట ఆగయ్య సొంత మండలంలోని ఎల్లారెడ్డిపేట నుంచి పలువురు ఉప సర్పంచులు, వార్డు సభ్యులు కాంగ్రెస్, బీజేపీలో చేరారు. మరి కొందరు తెలంగాణ జాగృతిలోకి వెళ్లారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా మూడేళ్ల ముందుగానే కేటీఆర్ సిరిసిల్లపై ఫోకస్ చేస్తుండగా, మరొక వైపు స్థానిక నేతలు చేజారుతుండడం ప్రస్తుతం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది.



## ఓటరుగా నమోదు చేసుకోవాలి

**విశ్వంభర, మన్సూరాబాద్ :** 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు తప్పకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఇప్పటివరకు ఓటరు జాబితాలో పేరు నమోదు చేయించుకోని వారు తప్పనిసరిగా ఓటరు నమోదు చేసుకోవాలని కోరుతూ మనసురాబాద్ టీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు కొసనం ధనలక్ష్మి - వెంకట్ రెడ్డి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె తన నివాస ప్రాంతమైన లెక్చరర్స్ కాలనీలో ఇంటింటా తిరుగుతూ అర్హులైన యువతకు ఓటు ప్రాముఖ్యతను వివరించారు. ఓటరు జాబితాలో పేరు లేని వారితో ఫారం-6 దరఖాస్తులను స్వయంగా ఫిల్ అప్ చేయించి నమోదు ప్రక్రియను సులభతరం చేశారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ఓటు అనేది ప్రతి పౌరుని విలువైన హక్కు అని, ప్రతి ఒక్కరు బాధ్యతగా ఓటు నమోదు చేసుకుని రాబోయే ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజల నుంచి ఈ కార్యక్రమానికి మంచి స్పందన లభించిందని తెలిపారు.

## ఏబీవీపీ దిల్సుఖ్నగర్ జిల్లా కన్వీనర్‌గా చవ్వ విశ్వ తేజ



**విశ్వంభర, ఎల్బీనగర్ :** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఈ నెల 3,4,5 తేదీలలో నిర్వహించిన రాష్ట్ర మహాసభలలో దిల్సుఖ్నగర్ జిల్లా కన్వీనర్ గా చవ్వ విశ్వతేజ ఎన్నికయ్యారు. తన పై నమ్మకంతో బాధ్యతను కట్టబెట్టినందుకు రాష్ట్ర శాఖకు వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.విద్యారంగ సమస్యల పై నిరంతరం ప్రశ్నిస్తూ,విద్యార్థుల శ్రేయస్సే ధ్యేయంగా,ఉచిత విద్య అమలు కోసం,పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థుల శ్రేయస్సు కోసం నిరంతరం కృషి చేస్తామన్నారు.

## శ్రీత్రివేణి పాఠశాలలో ఖేల్ మహోత్సవం



**విశ్వంభర, సరూర్ నగర్ :** సరూర్ నగర్ బ్రాంచ్ లో ప్రీప్రైమరీ , ప్రైమరీ విద్యార్థుల కోసం ఖేల్ మహోత్సవాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా త్రివేణి పాఠశాలల చైర్మన్ గోవర్ధన్ రెడ్డి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ క్రీడలు శారీరక , మానసిక అభివృద్ధికి ఎంతో అవసరమని వారు తెలిపారు. చదువు తో పాటు క్రీడలు కూడా ఎంతో ముఖ్యమని తెలిపారు.విద్యార్థులు వివిధ ఆటల్లో చురుకుగా పాల్గొని పాఠశాల ప్రాంగణాన్ని ఆనందోత్సాహాలతో నింపారు. తల్లిదండ్రులు కూడా ప్రత్యేకంగా నిర్వహించిన ఆటల్లో పాల్గొని కార్యక్రమాన్ని మరింత ఉత్సాహభరితంగా చేశారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ సునిల్ , ప్రిన్సిపాల్ యోగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## చేనేత ఐక్య వేదిక చీఫ్ అడ్వైజర్‌గా పసుల భాగ్యలక్ష్మి నియామకం



**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ చేనేత ఐక్యవేదిక మహిళా విభాగం చీఫ్ అడ్వైజర్ గా పసుల భాగ్యలక్ష్మి నియమితులయ్యారు. తెలంగాణ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు రాపోలు వీరమోహన్ చేతుల మీదుగా ఆమె తుర్క యంజాల్ లోని రాష్ట్ర కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చేనేత ఐక్య వేదిక మహిళా విభాగం ద్వారా నాకు చీఫ్ అడ్వైజర్ గా పదవి బాధ్యతలు చేపట్టడం చాలా సంతోషముగా ఉందని అన్నారు. ఇంతటి భాధ్యతను నాపై నమ్మకం ఉంచి అప్పజెప్పిన రాష్ట్ర అధ్యక్షులు రాపోలు వీర మోహన్ కు ధన్యవాదాలు తెలిపారు. చేనేత ఐక్య వేదిక మహిళా విభాగం ద్వారా మహిళల అభున్నతికై కృషి చేస్తానని అన్నారు. అన్ని రంగాల్లో మహిళలు ప్రాధాన్యత సంతరించుకునేలా ప్రయత్నం చేస్తానని అన్నారు. ఆర్థిక , రాజకీయ , సామజిక రంగాల్లో మహిళలు ముందుండేలా కృషి చేస్తానని అన్నారు. నా నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

## బీసీఎస్సీఎస్టీ చైతన్య వేదిక జిల్లా అధ్యక్షురాలిగా శశికళ



**విశ్వంభర, నల్గొండ :** బీసీ ఎస్సీ ఎస్టీ చైతన్య వేదిక నల్గొండ జిల్లా అధ్యక్షురాలుగా కట్రవత్ శశికళ నియామకం అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు కె. హరినాథ్ చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు . ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు ,ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర జనరల్ సెక్రెటరీ డి. మాలతి , గ్రేటర్ మహిళ ప్రెసిడెంట్ ప్రియాంక , నల్గొండ జిల్లా వైస్ ప్రెసిడెంట్ అమానురి భరత్, మాధవ్ , రాధకృష్ణ ,బిక్షపతి ప్రసాద్ , శశికళ తదితరులు పాల్గొన్నారు.



## పేద ప్రజల హక్కుల కోసం పోరాటం చేసేది సిపిఐ పార్టీ

**- పాలమాకుల జంగయ్య**

**విశ్వంభర, సరూర్ నగర్ :** పేద ప్రజలు, వారి హక్కుల కోసం పోరాట చేసే పార్టీ సిపిఐ పార్టీ అని సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి జాతీయ సమితి సభ్యులు పాలమాకుల జంగయ్య అన్నారు. బుధవారం సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, సరూర్నగర్ మండల కార్యదర్శి బాతరాజు నరసింహ ఆధ్వర్యంలో సరూర్ నగర్ మండల కేంద్రం భగత్ సింగ్ నగర్ లో ప్రచార జీపు జాత ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా పాలమాకుల జంగయ్య జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం జంగయ్య మాట్లాడుతూ వంద సంవత్సరాల కాలంలో అధికారంలో ఉన్నా లేకున్నా ఎంతోమంది పేద ప్రజల కోసం ఇంటి స్థలాలను పోరాటాల ద్వారా పేదలకు పంచిన చరిత్ర కమ్యూనిస్టుల దని అలాంటి పార్టీ వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా 5 లక్షల మందితో ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభ కు మండలం నుండి భారీ ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు రామస్వామి, మాజీ సర్పంచ్ ఆర్ గోపాల్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గ్యార క్రాంతి కుమార్, జిల్లాల కృష్ణ, సక్రు నాయక్ ,కమలమ్మ, మహబూబ్ , ఎండి ఇస్మాయిల్ , వినోద్ , ఎల్లమ్మ విజయ ,హిక్రీచ్, జాహెద్ స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## ఓసి సింహ గర్జన మహాసభకు వేలాదిగా తరలివెళ్దాం

**- తాడిశెట్టి పశుపతి గుప్త**



**విశ్వంభర, ఎల్బీనగర్ :** ఓసీ సింహ గర్జన మహాసభకు వేలాదిగా తరలివెళ్దాం అని ఓసి జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తాడిశెట్టి పశుపతి గుప్త అన్నారు. బుధవారం ఓసి జెసి ఆధ్వర్యంలో హైదరాబాద్ కొత్తపేట్ లో గోల్డెన్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలో వరంగల్ ఓసి సింహ గర్జన మహాసభకు సన్నాహక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఓసి జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తాడిశెట్టి పశుపతి గుప్త పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో , దేశవ్యాప్తంగా అగ్రకుల సామాజిక వర్గాల పేద ప్రజల హక్కుల సాధన కొరకు అగ్రకుల సామాజిక వర్గాల అన్ని సంఘాలు ఓసి జేఏసీగా ఏర్పాటు చేసి జనవరి 11 ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో లక్ష మందితో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు ప్రతి ఒక్క ఓసి బిడ్డ పెద్ద ఎత్తున తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన గోల్డెన్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు చోలేటి ఆనంద్ గుప్త , వారి సభ్యులు జూలూరి రాజేష్, తాడిశెట్టి దయాకర్ గుప్త, ఏవి రావు ,సాంబమూర్తి, కూర శ్రీనివాస్, నాంపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పిఆర్టియు టి ఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ

**విశ్వంబర , మలక్ పేట్ :** పీఆర్టీయూటీఎస్ బహదూర్ పురా మండల శాఖ క్యాలెండర్ ఆవిష్కరణ ను హైదరాబాద్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.తిరుపతి రెడ్డి, బి.మధుసూదన్ రెడ్డి పాల్గొని ఆవిష్కరించారు. పి ఆర్ టి యు నాయకుల చే నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డిప్యూటీ ఐఏఎస్ కుల్దీప్ కౌర్ ని శాలువా పుష్ప గుచ్చం తో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మేరాజ్ సుల్తానా , సైరా భాను, జిల్లా బాధ్యులు మందడి వెంకట్ రెడ్డి , నాగేశ్వర్ రావు, బలవంత రెడ్డి , సురేష్ , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## సీఎం కప్ 2వ ఎడిషన్ -2025 పోస్టర్ ఆవిష్కరణ



**విశ్వంభర, హైదరాబాద్ :** గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఈ నెలలో జరగనున్న క్రీడా పోటీలకు సంబంధించి సీఎం కప్ 2వ ఎడిషన్ 2025 పోస్టర్ ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ క్రీడాపోటీలకు సంబంధించి అవగాహన కల్పించడానికి ఈ నెల 8 వ తేదీ నుంచి 17 వ తేదీ వరకు పది రోజుల వరకు టార్చ్ ర్యాలీ కొనసాగనుంది.ఆ తర్వాత ఈ నెల 17 వ తేదీ నుంచి 22 వరకు గ్రామ స్థాయిలో, 28 నుంచి 31 వ తేదీ వరకు వరకు మండల స్థాయి, ఫిబ్రవరి 3 నుంచి 7 తేదీ వరకు నియోజకవర్గ స్థాయిలో, ఫిబ్రవరి 10 నుంచి 14 వరకు జిల్లా స్థాయిలో, ఫిబ్రవరి 19 నుంచి 26 వ తేదీ వరకు రాష్ట్ర స్థాయిలో పోటీలు జరగనున్నాయి. డిసెంబర్ నెలలో జరగాల్సిన ఈ క్రీడలు వివిధ కారణాలతో వాయిదా పడ్డాయి.గ్రామం నుంచి రాష్ట్ర స్థాయి వరకు వివిధ స్థాయిల్లో మొత్తం 44 రకాల క్రీడల్లో శాట్స్ పోటీలను నిర్వహించనుంది. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి , శాట్స్ చైర్మన్ శివసేనా రెడ్డి , స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్ గారు, సిఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీనివాసరాజు , సాట్గ్ ఎండీ సోనీబాల పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగులకు ఎలక్ట్రిక్ వాహనాలపై 20 శాతం రాయితీ ప్రకటించడం హర్షనీయం

- టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్



**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణ, ఇంధన ఆదా , స్థిరమైన రవాణా విధానాల దిశగా తీసుకున్న నిర్ణయాలు అభినందనీయం అని ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలుపై 20 శాతం రాయితీ ప్రకటించడం హర్షణీయమని టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఎలక్ట్రిక్ వాహనాలపై 20 శాతం రాయితీ కల్పించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి , రాష్ట్ర మంత్రివర్గానికి కృతజ్ఞతలు తెలుపుతూ ఈ విషయం పై నిర్ణయం తీసుకున్నందుకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కలిసి కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ మాట్లాడుతూ.. దూరదృష్టి గల ప్రజాహిత నిర్ణయంగా ప్రభుత్వ ఉద్యోగుల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి అని ,ఈ నిర్ణయం ద్వారా ప్రభుత్వ ఉద్యోగులు ఎలక్ట్రిక్ వాహనాల వినియోగానికి మరింత ప్రోత్సాహం పొందడమే కాకుండా, వాయు కాలుష్య నియంత్రణ, కార్బన్ ఉద్గారాల తగ్గింపు పర్యావరణ పరిరక్షణకు గణనీయమైన తోడ్పాటు అందనుంది. రాష్ట్రంలో ఎలక్ట్రిక్ మొబిలిటీ విధానాల విస్తరణకు ఈ నిర్ణయం కీలకంగా నిలుస్తుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ముజీబ్ హుస్సేని , సహ అధక్షులు క స్తూరి వెంకట్, కోశాధికారి ముత్యాల సత్యనారాయణ గౌడ్ , ఉపాధ్యక్షులు చిలక నరసింహారెడ్డి, సిద్దిపేట జిల్లా అధ్యక్షులు గ్యాదరి పరమేశ్వర్ లు పాల్గొన్నారు.

## ఇస్కఫ్ రంగారెడ్డి జిల్లా నూతన కమిటీ ఎన్నిక



**విశ్వంభర, సరూర్ నగర్ :** ఇస్కఫ్ రంగారెడ్డి జిల్లా మొదటి మహాసభ సరూర్ నగర్ మండలం శంకర్ నగర్ కాలనీ కమిటీ హాల్ లో నిర్వహించడం జరిగింది. ఈ యొక్క సమావేశానికి ముఖ్యఅతిథిగా ఇస్కఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ గోపాల్ హాజరు కావడం జరిగింది . అనంతరం వారు మాట్లాడుతూ ప్రపంచ శాంతిని కోరుతూ సంఘం ముందుకెళ్తుందని అనేక సాంస్కృతి కార్యక్రమాలు చేస్తూ నిరంతరం శాంతి కోసం పనిచేస్తుందని ఈనెల 11వ తేదీన బేగంపేట టూరిజం ప్లాజా లో రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం రంగారెడ్డి జిల్లా నూతన కమిటీ ఎన్నిక గౌరవాధ్యక్షులుగా జిల్లాల కృష్ణ , అధ్యక్షులుగా మహబూబ్, ప్రధాన కార్యదర్శిగా సక్రు నాయక్ కోశాధికారి వెంకట్రాంరెడ్డి ఉపాధ్యక్షుడిగా కరీం, ఎల్ నరసింహ, సంపత్,అసిస్టెంట్ సెక్రెటరీగా కమలమ్మ, సిహెచ్ శంకర్, శ్రావణ్ కుమార్ ,మహమ్మద్ ఇస్మాయిల్ , కే భాగ్య, రాములమ్మ, రమణమ్మ, బాలకృష్ణ ,ఏకగ్రీవంగా ఎన్నుకోవడం, జరిగింది. ఈ కార్యక్రమంలో కోశాధికారి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## బీసీల ఏబీసీడీ వర్గీకరణ అమలు చేయాలి

- గంగపుత్రులకు దామాషా ప్రకారం సీట్లు కేటాయించాలి



**విశ్వంభర, బాగ్ లింగంపల్లి :** రాబోయే ఎన్నికల్లో బీసీలకు ఏబీసీడీ వర్గీకరణ అమలు చేసి గంగపుత్రుల జనాభా దామాషా ప్రకారం సీట్లు కేటాయించాలని గంగపుత్ర చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు మంగిళిపల్లి శంకర్ గంగపుత్ర డిమాండ్ చేశారు. బుధవారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గంగపుత్ర చైతన్య సమితి ఏడవ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు మెంబర్ల ఆత్మీయ సన్మాన సభలో ఆయన మాట్లాడారు. బీసీల్లో రిజర్వేషన్ విభజన లేకపోవడం వల్ల పెద్ద కులాల చేతుల్లో గంగపుత్రులు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో తప్పనిసరిగా వర్గీకరణ అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమానికి ముందు ప్రారంభోపన్యాసం చేసిన స్టీరింగ్ కమిటీ చైర్మన్ పూస సత్యనారాయణ గంగపుత్ర విచ్చేసిన బంధువులకు శుభాకాంక్షలు తెలిపి అతిథులను,మండల, జిల్లా, రాష్ట్ర గంగపుత్ర నాయకులను ఆహ్వానించారు.గంగపుత్ర కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ, వెంటనే చైర్మన్ నియామకం, వెయ్యి కోట్ల నిధుల కేటాయింపు, గంగపుత్ర ఆత్మగౌరవ భవన నిర్మాణానికి పది కోట్ల రూపాయలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాదు ఎమ్మెల్యే ముఠా గోపాల్ గంగపుత్ర, తెలంగాణ ఫిషరీస్ చైర్మన్ మెట్టు సాయికుమార్ తదితరులు పాల్గొని గంగపుత్రుల రాజకీయ చైతన్యాన్ని అభినందించారు. బీసీ ఏ రిజర్వేషన్ పరిరక్షణకు కట్టుబడి ఉంటానని, గంగపుత్రుల అభివృద్ధికి నిధులు కేటాయింప జేయడానికి కృషి చేస్తానని మెట్టు సాయికుమార్ తెలిపారు.

# బోడిగుండుకు బంగారు దువ్వెన!




వానలు,వరదలు వెళ్లిపోయిన తరువాత నిర్మించే ఆనకట్ట(గత జల సేతు బంధనం)తో ఉపయోగం ఏమిటి?ఆకలి చచ్చిపోయిన తరువాత విందు భోజనం పెడితే ఎలా ఉంటుంది?విసిగి,వేసారి,ఇక న్యాయం జరగదేమోనన్న నిరాశ నిస్పృహల్లో ఉన్న మనిషికి సుదీర్ఘ జాప్యం, తర్వాత ఆయన యవ్వనం అంతా కరిగిపోయి వృద్ధాప్య భారం, అనేక జబ్బులతో అవసాన దశకు చేరుకున్న పౌరుడికి న్యాయం పేరిట ఇచ్చే తీర్పులతో ఒరిగేదేమిటి? భారత న్యాయ పరిభాషలో దానిని న్యాయమే అని పిలుస్తున్నారు.

కానీ అది ఏమి న్యాయమో? ఎలాంటి న్యాయమో? తెలియడం లేదు. ఈ దేశ న్యాయవ్యవస్థ అలాంటి తీర్పులను అనేకం వెలువరించింది. అలాంటి ఒక తీర్పు సంగతిని చూద్దాం. ఐదేళ్ల (2020) కిందట దేశ అత్యున్నత న్యాయస్థానం ఒక తీర్పును వెలువరించింది. కిరాయిదారు నుంచి తన ఇంటిని తనకు అప్పగించమని కోరుతూ కోర్టును వెళ్లారు ఒక ఇంటి యజమాని. విచారణ, వాయిదాల పేరిట 36 యేళ్ళు గడిచి పోయాయి. 36 యేళ్ల సుదీర్ఘ విచారణ తరువాత ఎట్టకేలకు ఒక తీర్పును ఇచ్చింది కోర్టు. ఆయన తన యవ్వన కాలంలో కేసు నమోదు చేశారు. తీర్పు వచ్చే నాటికి ఆయన వృద్ధుడైపోయారు. ఈ దేశ జ్యూడీషియరీ ఇలాంటి ఎన్నో తీర్పులను గతంలో ఇచ్చింది. వాటిలో ఇదీ ఒకటి. వలస పాలన కాలం (1945 లో )లో ఇలాంటిదే ఒక ఇంటి యాజమాన్య వివాదానికి సంబంధించిన తీర్పు 2024 లో వెలువడింది.

ట్రయల్ కోర్టు నుంచి దేశ అత్యున్నత కోర్టు వరకు విచారణ నడిచింది. చివరికి 2024 లో సుప్రీంకోర్టు తీర్పు నిచ్చింది. బొంబాయి నగరంలో ఒక మిలిటరీ అధికారి ఒకాయన 1945 లో ఒకరి నుంచి రెండు ఫ్లాట్లను అద్దెకు తీసుకున్నారు. రెండేళ్ల తరువాత 1947 లో బ్రిటిష్ పాలన అంతమై పోయింది. ఇండియా స్వతంత్ర దేశంగా మారిపోయింది. అద్దెకు తీసుకున్న మిలిటరీ అధికారి ఖాళీ చేయడానికి నిరాకరించారు. దీనిపై ఇంటి యజమాని కోర్టుకు వెళ్లారు. ఈ కేసు వాయిదాల మీద వాయిదాలు పడుతూ తీర్పులు వస్తూ అప్పీళ్లకు కోసం పై కోర్టులకు వెళుతూ వివాదం సుప్రీంకోర్టు వరకు వెళ్లింది. చివరకు 2024 లో ఇల్లు ఖాళీ చేయవలసిందిగా అద్దె దారుడి ని ఆదేశిస్తూ అత్యున్నత కోర్టు ఒక తీర్పు నిచ్చింది.

ఆ తీర్పు వచ్చే నాటికి చెప్పుకోవలసిన ప్రత్యేకత విషయం ఏమిటంటే కేసు వేసిన వ్యక్తి పూర్తిగా వృద్ధుడై పోయాడు. అతడి మనవడు నడి వయసుకు చేరుకున్నాడు. అంటే 80 యేళ్ల తరువాత తీర్పు వచ్చింది. ఇంటి యజమానితో సహా సదరు బ్రిటిష్ మిలిటరీ అధికారి కూడా వృద్ధుడై పోయాడు.

ఈ రెండు కుటుంబాలకు చెందిన మూడవ తరం వాళ్లు నడి వయసుకు చేరుకున్నారు. ఆ ఇంటి యజమాని పూర్తిగా వృద్ధాప్యానికి చేరుకొని దాదాపు అవసాన దశకు చేరుకున్నారు. వృద్ధాప్యం వల్ల పలు అనారోగ్య సమస్యలతో ఆయన మంచానికే పరిమితమయ్యారు. ఆయనకు ఆ తీర్పు విషయం చెప్పినా అర్థం చేసుకోగల మానసిక స్థిమితం లేని పరిస్థితిలో ఉన్నారు. సదరు ఇల్లు కూడా శిథిలావస్థకు చేరుకుంది. సుప్రీం తీర్పు ద్వారా 80 యేళ్ల తరువాత యాజమాన్య హక్కు లభించినందుకు కేసు వేసిన వ్యక్తి మనవడు ఏమి చేయాలి? కేసు గెలిచినందుకు నవ్వాలా ? సంబరాలు చేసుకోవాలా? ఏడవాలా?

ఏమిటాయన మానసిక స్థితి? జీవిత చివరి దశలో వచ్చిన తీర్పుతో ఆయనకు, ఆయన మనవడికి కలిగిన ప్రయోజనం ఏమిటి? ఏమీ అర్థం కాని విచిత్రమైన మానసిక స్థితి వారిద్దరిదీ.భారతీయ ఆయు ప్రమాణాల ప్రకారం ఓ మనిషి జీవితంలో 80 యేళ్ళు అంటే దాదాపుగా జీవితపు అంత్య దశ అన్నట్లే లెక్క. ఇప్పుడొచ్చిన ఆ "తీర్పు"తో ఆ మనిషికి న్యాయం జరిగినట్లు భావించవచ్చా? మరి దాన్ని ఏమని పిలవాలి? తలపైన ఉన్న వెంట్రుకలన్నీ ఊడిపోయాక బంగారంతో తయారు చేసిన అందమైన దువ్వెన ఒకటి బహుమతిగా ఇచ్చిన చందంగా ఉన్నది ఈ తీర్పు. వెంట్రుకలే లేని అతడి తలకు ఆ బంగారు దువ్వెనతో పనేమిటి? ఉపయోగం ఏమిటి ? అక్కరకు రాని చుట్టం లాగా,మొక్కిన వరమీయని వేల్పు లాగా, ఎక్కిన పారని గుర్రం మాదిరిగా 80 యేళ్ల తరువాత వచ్చిన ఆ తీర్పు[బంగారు దువ్వెన]పై ఎవరిని నిందించాలి? న్యాయ ప్రక్రియలో జరుగుతున్న అంతులేని జాప్యాన్నా?దానిలోని లొసుగులనా?

లొసుగులను అడ్డుపెట్టుకొని ప్రయోజనం పొందుతున్న కక్షి దారులనా?వ్యవస్థలోని లొసుగులను సవరించే దిశలో కనీస మాత్ర ప్రయత్నం కూడా చేయని దేశ రాజకీయ వ్యవస్థనా ?అదీకాక తాము అందరికంటే ఉన్నతులం,అన్నింటికీ అతీతులం అని భావించే న్యాయవ్యవస్థలోని పెద్దల ఆధిపత్య ,మానసిక దౌర్బల్యాన్నా? వ్యవస్థలో కార్యనిర్వాహక వర్గాని [ఎగ్జిక్యూటివ్]ది మాత్రమే అధికారం అని భావిస్తూ, విర్రవీగే అహంకార పూరిత వైఖరినా? న్యాయ వ్యవస్థతో సహా అన్ని ఇతర వ్యవస్థలూ తమ ఆదేశాలను శిరసావహించి తీరాలని, తమ అడుగులకు మడుగులు వత్తాలి అనే అహంకార పూరిత ధోరణితో అన్ని వ్యవస్థలను ధ్వంసం చేస్తున్న దేశ పాలక రాజకీయ నాయకత్వాన్నా ? వ్యవస్థలోని ఈ రంధ్రాలను పూడ్చకుండా,మారిన ప్రపంచ స్థితిగతులకు అనుగుణంగా చట్టాలను సవరించకుండా, న్యాయం చేస్తామని కబుర్లు చెబితే ఈ న్యాయ వ్యవస్థ ప్రజల విశ్వాసాన్ని ఎలా పొందగలుగుతుంది ? నమోదైన కేసుల్లో యేళ్ల తరబడి ఎలాంటి విచారణలు లేకుండానే నేరారోపితులు జైళ్లలోనే

మగ్గిపోతూ ఉంటే దానికి అర్థం ఏమిటి? కేసు ట్రయల్ కూడా మొదలవకుండా సదరు చట్టాల్లో విధించగల గరిష్ఠ శిక్షా కాలం కంటే ఎక్కువ కాలమే జైలు నిర్బంధంలో నిందితులు శిక్షను అనుభవించే స్థితిని ఏమని పిలవాలి? నేరం చేశాడో? లేదో? నిర్ధారణ, నిరూపణ లాంటిది ఏమీ జరగకుండానే అన్యాయంగా శిక్షలు అనుభవించే స్థితిని ఎలా చూడాలి? నేరారోపితులు మాత్రమే అయిన నిందితుల బెయిల్ పిటిషన్లను తిరస్కరించడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? "ప్రత్యేక పరిస్థితుల్లో మాత్రమే జైలు, బెయిల్ నిందితులు, నేరస్తులు అందరి రాజ్యాంగ బద్ధమైన హక్కు కదా. ఈ సూత్రం జ్యూడిషియరీ పెద్దలకు తెలియకుండా ఎలా ఉంటుంది?దానిని అమలు చేయవలసిన పెద్దలు దానిని పట్టించుకోకుండా బెయిల్ పిటిషన్లను తిరస్కరించడంలోని ఆంతర్యాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? బెయిల్ హక్కు

పదే పదే ఉల్లంఘించ బడుతున్న స్థితికి అర్థం ఏమిటి ?కరుడు గట్టిన నేరస్తులు, మైనర్ బాలికలపై అత్యాచారాలకు పాల్పడిన రేపిస్టులు, హంతకులు తరచూ బెయిళ్ళు, పెరోళ్లపై జైలు బయట స్వేచ్ఛగా సంచరిస్తున్న స్థితిని ఏమని అర్థం చేసుకోవాలి? జాతీయ బ్యాంకుల నుంచి వేల కోట్ల రుణాలు తీసుకొని వాటిని ఎగవేసిన వైట్ కాలర్ నేరస్తులు విదేశాల్లో విందు, వినోద విలాసాల్లో మునిగి తేలుతున్న స్థితిని ఎలా అర్థం చేసుకోవాలి? పౌరుల అన్ని హక్కులు పదే పదే వెక్కిరించబడుతున్న ఈ దుస్థితి ఏమిటి?

మానవ ముఖం కోల్పోయి చట్టాల్లోని సాంకేతిక అంశాలను మాత్రమే చూపుతూ నిందితుల బెయిల్ పిటిషన్లను కొట్టివేసే వ్యవస్థ నడకను ఏమని పిలవాలి? న్యాయ శాస్త్ర గ్రంథాలతో కుస్తీ పడుతూ ఇంటికి, కోర్టుకే పరిమితమై పోయి కనీస మానవ స్పందనలను కోల్పోయి, యాంత్రికంగా నేర విచారణ సంస్థల ఫిర్యాదులు విని, వాటిని మాత్రమే విశ్వసించి యాంత్రికంగా బండరాళ్ల వలె తీర్పులను రాసి పడేసే వారికి న్యాయమూర్తులు అని పిలిపించుకునే అర్హతలు ఏ మేరకు మిగిలి ఉన్నాయి?

**ఇలాంటి జ్యూడిషియరీకి న్యాయ వ్యవస్థ అని పిలి-పించుకునే కనీస అర్హత ఏమైనా ఉన్నదా?**

ఇలాంటి తీర్పులను తరచూ వెలువరిస్తూ, కేవలం నేరారోపితులు మాత్రమే అయిన వారు ఎలాంటి విచారణలు లేకుండానే జైళ్లలో మగ్గిపోవటం, కరుడు గట్టిన నేరస్తులు బెయిళ్లు, పెరోళ్ల పేరిట జైలు బయటికి వచ్చి గల్లాలు ఎగరేస్తూ, స్వేచ్ఛగా సమాజంలో సంచరిస్తూ ఉండడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి?సామాన్యుల్లో ఇప్పటికే కోర్టులపై ఉన్న అనుమానం, భయం,అవిశ్వాసాలు ఇలాంటి తీరుతో మరింతగా పెరుగుతాయే తప్ప తరిగే అవకాశాలు కనీస మాత్రంగా సైతం కనిపించడం లేదు.

ఇలాంటి పరిస్థితుల్లో సామాన్య జనం రచ్చబండ, దర్బార్,చెట్టు కింద పంచాయితీల్లో గంటల వ్యవధిలో చూపే పరిష్కార మార్గాల వైపునకు మొగ్గు చూపుతారు కదా.ఆధునిక, నాగరిక ప్రజాస్వామిక వ్యవస్థలో పిలుచుకునే "న్యాయం" అనేది ఇలా ఏడిస్తే దానికి అర్థం ఏమిటి?



- గండె గోవర్ధన్,
ఫోన్ : 9347056621

# భారతీయ సంగీత కళానిధి త్యాగరాజు

(త్యాగరాజ స్వామి వారి ఆరాధనోత్సవాల సందర్భంగా)



**త్యాగరాజు కర్ణాటక సంగీత త్రిమూర్తులలో ఒకడు. త్యాగయ్య, త్యాగబ్రహ్మ అనే పేర్లతో కూడా ప్రసిద్ధుడు. నాదోపాసన ద్వారా భగవంతుని తెలుసుకోవచ్చని నిరూపించిన గొప్ప వాగ్గేయకారుడు. ఆయన కీర్తనలు శ్రీరాముని పై ఆయనకుగల విశేష భక్తిని, వేదాలపై, ఉపనిషత్తులపై ఆయనకున్న జ్ఞానాన్ని తెలియపరుస్తాయి. సంగీతం అంటే కొంచెం తెలుసున్న వారెవరైనా, కర్ణాటక శాస్త్రీయ సంగీతాన్నీ, త్యాగరాజునీ వేరు చేసి చూడ లేరు. ఎందుకంటే కర్ణాటక శాస్త్రీయ సంగీతంలో ఆయన చేసిన అసమానమైన కృషి అలాంటిది. కర్ణాటక సంగీతానికీ, త్యాగరాజుకీ విడదీయరాని బంధం ఉంది. లాగుడు పీకుడు రాగాలతో శాస్త్రీయ సంగీతం అంటే ఆమడ దూరం పరిగెత్తే జనాలకి, అందులో ఉండే మాధుర్యం, మత్తూ చూపించీ, సంగీతం అంటే మరింత ఆసక్తిని కలిగించిన వాడు త్యాగరాజు. ప్రస్తుతమున్న కచేరీ పద్ధతికి ప్రాణం పోసిన వాళ్ళల్లో ఆద్యుడు. సరళమైన భాషలో వినసొంపైన శాస్త్రీయ సంగీతాన్ని అజరామరం చేసాడు. రామ భక్తుడిగా తనదైన ప్రత్యేకమైన ముద్రతో సంగీతాన్ని భక్తి వాహకంగా వాడుకొన్న వ్యక్తి.**

### కర్ణాటక సంగీతానికి ప్రాచుర్యం కలిగించిన త్యాగరాజు..

'ఎందరో మహానుభావులు'' అనే పదం తెలుగునాటనే కాక, దక్షిణ ప్రాంతంలో వాడుకలో వినిపించే నానుడియైన చరణం. అలానే 'చక్కని రాజమార్గం ఉండగా, సందుల దూరనేల ఓ మనసా!' 'దొరకునా ఇటువంటి సేవ', 'ఏమని పొగడదురా?' వంటి చరణాలు తెలుగు ప్రజల మదిలో నిలిచిపోయాయి. దాదాపు రెండు వందల ఏళ్లకు పూర్వం త్యాగబ్రహ్మం రచించిన కృతులలోని చరణాలు స్థిరంగా నిలిచిపోవటానికి కారణం.. ఆయన సాహిత్యంలోని నిర్దిష్టత, సంగీతంలో సారస్వత. భారతీయ సంగీతాల్లో ఉత్తర దేశానికి చెందిన హిందుస్థానీ, దక్షిణానికి కర్నాటక సంగీతం ప్రాచుర్యం పొందాయి. త్యాగబ్రహ్మకు పూర్వం కర్నాటక శాస్త్రీయ సంగీతానికి చెందిన సాహిత్యం సంగీత ప్రాచుర్యం గురించి వినికిడిలో లేదు. అప్పటి మద్రాసు రాష్ట్రంలోని తంజావూరు జిల్లా తిరువమారులో 1767 మే 4వ తేదీన కాకర్ల రామబ్రహ్మం, సీతమ్మ దంపతులకు త్యాగబ్రహ్మ జన్మించారు. చిన్ననాటి నుంచే సంగీతంపై మక్కువ కలిగి, రాగాలాపనలో కాలం గడిపారు. శొంఠి వెంకట రమణయ్య శిష్యరికంలో సంగీత స్వరరాజుగా ఎదిగారు. కృతులకు స్వయంగా గురువు తంజావూరులో కచేరీని ఏర్పాటు చేయగా అప్పుడు ఆవిర్భవించిన కృతే' ఎందరో మహానుభావులు' . స్వయంగా కృతిని రచించి, స్వరపరిచి, సంగీత బద్ధంగా గానంచేసే వారినే వాగ్గేయకారులంటారు.

### తమిళుల ఆరాధ్య సంగీత దైవం త్యాగరాజు..

త్యాగబ్రహ్మ వాగ్గేయకారునిగా స్వర రారాజుయై త్యాగరాజుగా నాటినుంచే పిలువబడ్డారు. ఆ సందర్భంలోనే తంజావూరు మహారాజు త్యాగరాజును రాజాస్థానంలో సంగీత కళాకారునిగా నియమించటం కోసం ధన, మణిహారములతో భటులను పంపించాడు. ఆ ఆహ్వానాన్ని త్యాగరాజు తిరస్కరించి 'నిధి చాలా సుఖమా? నా రాముని సన్నిధి చాలా సుఖమా?' అనే కృతిని పాడి స్వేచ్ఛా గానాన్ని కోరుకున్నారు. త్యాగరాజు దాదాపు 24 వేల కీర్తనలు రచించి, స్వర కల్పన చేశారు. అవి అన్నీ అందుబాటులో ఉన్నాయి. వీటిలో అధికభాగం 'రాముని' భక్తితో స్తుతించినవే, కాగా కొన్ని ప్రాపంచిక, సామాజిక చింతనలో కూర్చినవీ ఉన్నాయి.

త్యాగరాజు' కర్నాటక శాస్త్రీయ సంగీతంలో పలు రాగాలు, స్వరాల సృష్టికర్త కావటంతో పాటు స్వయంగా కృతికర్త కూడా. అందువల్ల ఆయన కృతులు పాడేందుకు ఒక నిర్దిష్టత, స్పష్టత ఏర్పడింది. అనుశ్రుతంగా, అదే బాణీలో అదే శైలిలో ఏ సంగీత విద్వాంసుడైనా పాడవలసిందే. కాగా సంపాదన లేక సంగీతమే పరమావధిగా ఉన్న త్యాగరాజుతో సోదరుడు విసిగి ఆయన ఆరాధించే రాముని విగ్రహాన్ని యమునా నదిలో పడవేశాడు. త్యాగరాజు తీర్థ యాత్రలు చేస్తూ దక్షణభారతం పర్యటించారు. భార్య కమలాంబ, కుమార్తె సీతాలక్ష్మిలను కూడా వదలి రామభక్తి సామ్రాజ్యమే ఆనందంగా భవించారు. త్యాగరాజు తెలుగువాడైనా, తెలుగులోనే కీర్తనలు రచించినా, పుట్టినది తమిళనాడులో అయినందున తమిళులు తమ ఆరాధ్య సంగీత దైవంగా భావించే వారు.

### విశ్వవ్యాప్తంగా త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు..

ఆయన చేసిన సంగీత మార్గాన్ని తమిళులు అనుసరిస్తూ కీర్తనల పదవ్యాప్తికి దోహదపడుతున్నారు. త్యాగరాజ కీర్తనలతో పంచరత్న కీర్తనలుగా పేర్కొనబడేవి. 'దుడుకుగల నన్నేదొర కొటకు బ్రోచురా?' సాధించెనే మనసా', కనకన రుచిరా' ఎందరో మహానుభావులు' జగదానందకారక' త్యాగరాజు కీర్తనల్లో సాహిత్యం పాలు తక్కువ కాగా, సంగీతం పాలు ఎక్కువ. అందువల్లనే తమిళనాట సంగీతాభిమానులు ఆయన కీర్తనలను ఆదరించిన కారణాల్లో ఒకటిగా చెప్పొచ్చు. ఎనభై ఏళ్లు నాదమే యోగంగా, సంగీతమే శ్వాసగా జీవించిన నారబ్రహ్మ త్యాగరాజు 1847 జనవరిలో మృతి చెందారు. ఆయన స్మృత్యర్థం నివాళ్లర్పిస్తూ ప్రతిఏటా ఆయన జన్మించిన తిరువాయురులో జనవరి, ఫిబ్రవరి మాసాల్లో త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. ప్రపంచ ప్రఖ్యాత సంగీత విద్వాంసులు అందరూ పాల్గొని కచేరీ చేస్తారు. అదే విధంగా దేశంలోనే కాక విదేశాల్లోనూ పలుచోట్ల ఆరాధనోత్సవాలను నిర్వహిస్తున్నారు.



- చౌడూరి నరసింహారావు
సాహిత్య కళా విభూషణ
నంది పురస్కార గ్రహీత
సాహిత్య, సామాజిక విశ్లేషకులు
: 9705100788

# అసెంబ్లీకి 'గులాబీ' దూరం..

## ఇక మూడేళ్లూ ఇదే తీరా?




చట్టసభ వేదికగా ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన ప్రధాన ప్రతిపక్షం.. వ్యూహాత్మక మౌనాన్ని ఆశ్రయిస్తోందా? రానున్న మూడేళ్ల పాటు అసెంబ్లీ సమావేశాలకు దూరంగా ఉండాలని బీఆర్ఎస్ గట్టి నిర్ణయానికి వచ్చిందా? తాజా పరిణామాలు చూస్తుంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. అధినేత కేసీఆర్ బాటలోనే నడవాలని భావిస్తున్న ఎమ్మెల్యేలు.. కేవలం రిజిస్టర్‌లో సంతకాలు చేసి బయటకు వచ్చేయడమే 'శ్రేయస్కరం' అని భావిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

గొంతు నొక్కుతున్నారనే ఆవేదన

స్పీకర్ వ్యవహారశైలి ఏకపక్షంగా ఉందన్నది బీఆర్ఎస్ నేతల ప్రధాన ఆరోపణ. ప్రతిపక్షం వైపు కన్నెత్తి చూడటం లేదని, మైక్ ఇస్తామని చెప్పి కట్ చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. "మాట్లాడే అవకాశం లేనప్పుడు, అవమానాల మధ్య సభలో కూర్చోవడం కంటే బయట ఉండటమే మేలు" అని ఆ పార్టీ నేతలు బాహాటంగానే వ్యాఖ్యానిస్తున్నారు. ఇదే ఫార్ములాను రాబోయే అన్ని సెషన్లలోనూ కొనసాగించాలని గులాబీ దళం భావిస్తున్నట్లు సమాచారం.

మాటలు కోటలు దాటాయి.. కానీ!

నీళ్ల అంశంపై అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కడిగేస్తామని సమావేశాలకు ముందు బీఆర్ఎస్ నేతలు గంభీర ప్రకటనలు చేశారు. కానీ, క్షేత్రస్థాయిలో సీన్ రివర్స్ అయింది. సమావేశాలు మొదలైన రెండు రోజులకే 'బహిష్కరణ' అస్త్రం ప్రయోగించి బయటకు వచ్చేశారు. ఇది కేవలం ఈ సెషన్‌కే పరిమితం కాదని, రాబోయే మూడేళ్లు ఇదే పంథా ఉంటుందని ఆ పార్టీ నేతలు చిరునవ్వుతో చెబుతుండటం గమనార్హం. అయితే, సభలో ఉండి ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టాల్సింది పోయి.. ప్రెస్ మీట్లకు పరిమితం కావడంపై కేడర్‌లో అసహనం వ్యక్తమవుతోంది.

బడ్జెట్ సమావేశాలపై నీలి నీడలు

తొమ్మిది నెలల విరామం తర్వాత డిసెంబర్ 29న సభకు వచ్చిన కేసీఆర్..కేవలం మూడు నిమిషాలకే పరిమితమయ్యారు. జనవరి 2న నీళ్లపై ఆయన గళం విప్పుతారని లీకులు ఇచ్చినా, చివరి నిమిషంలో ఆయన గైర్హాజరు కావడం, పార్టీ మొత్తం బాయ్‌కాట్ చేయడం రాజకీయంగా పెద్ద చర్చకు దారితీసింది. వచ్చే నెలలో జరగబోయే బడ్జెట్ సమావేశాలకైనా బీఆర్ఎస్ హాజరవుతుందా? అన్నది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. లేదా గవర్నర్ ప్రసంగానికి హాజరై.. ఆ తర్వాత తప్పుకుంటారా? ధన్యవాద తీర్మానంపై చర్చలో పాల్గొంటారా? లేక కేవలం అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకానికే పరిమితమవుతారా? ప్రజాక్షేత్రంలో పోరాడాల్సిన ప్రతిపక్షం.. చట్టసభను వదిలేయడం వల్ల ప్రజల్లోకి వెళ్లే సంకేతాలపై పార్టీ లోలోపల మథనం మొదలైనట్లు తెలుస్తోంది.

## వ్యాసాలు, కవితలకు ఆహ్వానం

విశ్వంభర ఎడిటోరియల్ పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను, కవితలను ఆహ్వానిస్తున్నాం. ఈ కింది చిరునామాకు పోస్టులో లేదా ఈ-మెయిల్ ద్వారా పంపించగలరు. మీ వ్యాసం 1000 పదాలకు మించకుండా ఉండాలి. తెలుగు యునీకోడ్‌లో టైప్ చేసి పంపిన వాటికి ప్రాధాన్యం ఉంటుంది. రచయితలు విశ్వంభరకు మాత్రమే పంపుతున్నామని హామీపత్రం జత చేయాలి.

**చిరునామా:**

V3 న్యూస్, విశ్వంభర తెలుగు దినప్రతిక కార్యాలయం, ప్లాట్ నంబర్ 204, రెండో అంతస్తు, బాదం కాంప్లెక్స్, మెట్రో పిల్లర్ నంబర్ 1560 ఎదురుగా, చైతన్యపురి ఎక్స్ రోడ్డు, హైదరాబాద్500060

editpagevishwambhara@gmail.com

ఇతర వివరాలకు సెల్ నం: 9441222429 సంప్రదించగలరు.

# ఇక చికెన్ ముక్క తినడం కష్టమే!

- పరుగుపెడుతున్న కోడి కూర ధర
- 300 రూపాయల మార్క్‌ను దాటిన చికెన్
- పైపైకి ఎగబాకుతున్న ఎగ్స్ ధర



**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** కార్తీక మాసం ముగియడం, వరుసగా పండుగలు, సెలువులు రావడం, చలి తీవ్రత పెరగడంతో చికెన్ ధరలు భారీగా పెరిగిపోతున్నాయి. కొద్ది రోజుల కిందటి వరకు రూ.200 లోపే పలికిన కిలో చికెన్ ధర.. ఇప్పుడు రూ.310 వరకు పలుకుతుండటం మాంసం ప్రియులను కలవరపెడుతుంది. లైవ్ కోడి రేటు రూ.180 పైకి ఎడబాకింది. చికెన్ తో పాటు గుడ్డు ధర కూడా రిటైల్ మార్కెట్ లో రూ.7 నుంచి రూ.8 పలుకుతోంది. డిసెంబర్ నుంచి క్రమంగా ధరలు పెరుగుతూనే వస్తున్నాయి. కొత్త సంవత్సరంలో సంక్రాంతి పండుగ, ఆ తర్వాత మేడారం జాతర నేపథ్యంలో చికెన్ కు భారీ డిమాండ్ ఉండే అవకాశం వుంది.డిమాండ్‌కు తగ్గట్లుగా పౌల్ట్రీ ఉత్పత్తి లేకపోవడంతో సరఫరా దెబ్బతిని ధరలు పెరిగినట్లు చికెన్ సెంటర్ల యజమానులు చెబుతున్నారు. అయితే చికెన్ ధరలు పెరగడానికి ప్రధాన కారణం గడిచిన వేసవిలో పౌల్ట్రీ రైతులు ఘోరంగా నష్టపోవడమే అంటున్నారు. ఎండ వేడికి వేల సంఖ్యలో కోళ్లు చనిపోయాయని, మరో వైపు కోళ్ళకు వేసే దాణా ధర విపరీతంగా పెరిగిందని చెబుతున్నారు. కిలో 18 రూపాయలున్న మొక్కజొన్న ధర 27 రూపాయలు అయింది. 25 రూపాయలున్న సోయా ధర 45 రూపాయలకు పెరగడంతో ఉత్పత్తి ఖర్చు 100 రూపాయల నుంచి 110 రూపాయలకు పెరిగిందని పేర్కొంటున్నారు. ఇదే సమయంలో "కోడి గుడ్డ ధరలు పెరిగాయి. కోడిగుడ్డు ఉత్పత్తి ధర 4.85 రూపాయలు. హోల్‌సేల్ మార్కెట్‌లో 5.50 రూపాయలకు అమ్ముతున్నారు. రిటైల్ గా రూ.8లకు విక్రయిస్తున్నారు.

### కొత్త ఫౌల్ట్రీ ఫామ్స్ ఏవి..?

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఫౌల్ట్రీ రంగంలో దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో ఉండేది. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణా నాల్గవ స్థానానికి పడిపోయింది. మరోవైపు కొత్తగా కోళ్ళ ఫాం పెట్టుకోవాలంటే ప్రభుత్వం నిబంధనలు కఠినంగా మారాయి. పట్టణం నుంచి గ్రామాలకు వెళ్ళడానికి 40 ఫీట్‌ల రోడు వుండదు కానీ, ఆయా గ్రామాల్లో పెట్టే కోళ్ళ ఫాంలకు వెళ్ళడానికి 40 ఫీట్ల రోడు వుండాలనే నిబంధన పెట్టారు. దీంతో కొత్తగా ఫాంలు నెలకొల్పడం కష్టతరంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేశంలో ఒక మిలియన్ బ్రాయిలర్ రైతులున్నారు. "ఏటా 5 మిలియన్ టన్నుల బ్రాయిలర్ మాంసం, 118 బిలియన్ల గుడ్లను దేశం ఉత్పత్తి చేస్తోంది. భారత్ గుడ్ల ఉత్పత్తిలో ప్రపంచంలో మూడోస్థానంలోనూ, బ్రాయిలర్ కోళ్ల మాంసం ఉత్పత్తిలో నాలుగో స్థానంలోనూ నిలిచింది. ఈ రంగం 18 మిలియన్ టన్నుల మొక్కజొన్న, 5.5 మిలియన్ టన్నుల సోయా వినియోగిస్తోంది. తెలంగాణ కోళ్ల పరిశ్రమలో 5 లక్షల మంది ఉపాధి పొందుతున్నారు. రోజుకు 1,397.2 టన్నుల చికెన్ ఉత్పత్తి అవుతుండగా.. సగటున 5.04 కోట్ల గుడ్లు ఉత్పత్తి అవుతున్నాయి.



## రోడ్డు భద్రతా నియమాలు తప్పక పాటించాలి

**- సీనియర్ సివిల్ జడ్జి జి.సబిత**

**విశ్వంభర, రామన్నపేట :** రోడ్డు భద్రతా నియమాలు తప్పక పాటించాలని యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల కేంద్రంలోని సీనియర్ సివిల్ కోర్టు జడ్జి, మండల న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్ జి.సబిత అన్నారు. రోడ్డు రవాణా భద్రత మాసోత్సవ సందర్భంగా బుధవారం నాడు యాదాద్రి భువనగిరి జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ అదేశాలనుసారం, రామన్నపేట మండల న్యాయ సేవా అధికార సంస్థ అధ్వర్యంలో మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీనియర్ సివిల్ జడ్జి జి.సబిత, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.శిరీష, సెకెండ్ క్లాస్ మేజిస్ట్రేట్ డి.సత్తయ్య హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ, ట్రాఫిక్ నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటిస్తూ డ్రైవింగ్ లేదా కాలినడకన వెళ్ళేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని అన్నారు. ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ చేసేటప్పుడు సీట్ బెల్టు, హెల్మెట్లు తప్పనిసరిగా ధరించాలన్నారు. ప్రతి ఒక్కరూ నిబంధన ఉల్లంఘించిన ఎడల మోటార్ వాహన చట్టం ప్రకారం శిక్షకు అర్హులవుతారని, వాటిపట్ల అందరూ అవగాహనతో ఉండాలని అన్నారు. 18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరు లైసెన్సులు పొందాలని, డ్రైవింగ్ లైసెన్స్ లేని యెడల దొరికితే వారి తల్లిదండ్రులు శిక్షకు అర్హులు అవుతారని అన్నారు. ట్రాఫిక్ సిగ్నల్ అనుగుణంగా రోడ్డు క్రాస్ చేసి వెళ్లాలని, సిగ్నల్స్ చూసుకుంటూ బండి డ్రైవింగ్ చేస్తూ వెళ్లాలని తెలియజేశారు. అనంతరం ఈ కార్యక్రమానికి హాజరైన వారందరి చేత ఈ మాతోత్సవాల సంబంధించిన ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమానికి జిల్లా రవాణా శాఖ నుండి అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ లు హర్షవర్ధన్ రెడ్డి, ప్రణీత్ రెడ్డి, రామన్నపేట తహశీల్దార్ లాల్ బహదూర్, రామన్నపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎన్.వెంకటేశ్వర్లు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.ఎ.మసీద్, కమిటీ సభ్యులు, ఏజీపి సుక్క శ్రావణ్ కుమార్, సీనియర్ అడ్వకేట్ జినుకల ప్రభాకర్, ప్యానల్ అడ్వకేట్ లు బి.డేవిడ్, మామిడి వెంకట్ రెడ్డి, అడ్వకేట్ లు ఎన్.మోగిలయ్య, దినేష్, యాదాసు యాదయ్య, కునూరు శ్రీనివాస్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్.జగదీష్, మండల విద్యాధికారిణి గవ్వ జ్యోతి, సబ్ ఇన్స్పెక్టర్ డి.నాగరాజు, ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల అధ్యాపకులు, ప్రైవేటు స్కూళ్ళ కరస్పాండెంట్లు చిట్టిబాబు, మల్లిఖార్జున్, నరేందర్ రెడ్డి, మాటిన్, లీగల్ సర్వీసెస్ టీమ్ సభ్యులు బత్తుల గణేష్, కోక సబిత, పోలీస్ సిబ్బంది, కోర్టు సిబ్బంది, జూనియర్ కళాశాల విద్యార్థులు, వివిధ పాఠశాలల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ శ్రేణుల సమిష్టి కృషితోనే అభ్యర్థుల విజయం

**- నీలం మధు ముదిరాజ్**



**విశ్వంభర, సంగారెడ్డి :** మాజీ ముఖ్యమంత్రి ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ హవా కొనసాగిస్తూ మెజార్టీ స్థానాలలో జయకేతనం ఎగురవేయడం సంతోషకారమని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ నీలం మధు ముదిరాజ్ అన్నారు.బుధవారం మెదక్ పార్లమెంటు పరిధిలోని సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గ పరిధిలో కాంగ్రెస్ పార్టీ మద్దతుతో విజయం సాధించిన సర్పంచ్ లు, జిల్లా సర్పంచ్ ఫోరమ్ అధ్యక్షుడిగా ఎన్నికైన మన్నె కళ్యాణ లు గజ్వేల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి తో కలిసి నీలం మధు ను చిట్కుల్ ఎన్ఎంఆర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా విజయకేతనం ఎగురవేసిన సర్పంచ్ లను, ఉపసర్పంచ్లు, వార్డ్ సభ్యులను ఆయన అభినందించి ఘనంగా సత్కరించారు.గజ్వేల్ లో కాంగ్రెస్ తో నే అభివృద్ధి సాధ్యమని నమ్మి ప్రజలు కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులకు పట్టం కట్టారని తెలిపారు. కాంగ్రెస్ అభ్యర్థుల విజయంలో మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి తో పాటు కాంగ్రెస్ శ్రేణులు కృషి మరువలేనిదని కొనియాడారు. నమ్మి ఓట్లు వేసి గెలిపించిన ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటు గ్రామాలలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ గ్రామాలను అభివృద్ధి చేయాలని సూచించారు ఈ కార్యక్రమంలో మనోహరబాద్ గ్రామ సర్పంచ్ భాస్కర్ యాదవ్, జీడిపల్లి గ్రామ సర్పంచ్ నర్సన్న గారి కృష్ణ, కొండాపూర్ గ్రామ సర్పంచ్ నూకల రాము, వెంకటాపూర్ అగ్రహారం గ్రామ సర్పంచ్ వెంకటేష్, గౌతజి గూడా గ్రామ సర్పంచ్ నాగరాజు , ఉప సర్పంచ్ ఎర్ర నాగరాజు, సర్పంచులు, ఉపసర్పంచ్లు, వార్డ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం




**విశ్వంభర, రామన్నపేట :** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు బుధవారం రోజు యాదాద్రి భువనగిరి జిల్లా మహిళా, పిల్లల, వికలాంగుల, మరియు వయోవృద్ధుల సంక్షేమ విభాగం సహకారంతో, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఈ, యూనిట్ ఈఈ ల ఆధ్వర్యంలో బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రహత్ ఖానం మాట్లాడుతూ, బాల్యంలో వివాహాలు అనేక అనర్థాలకు దారితీస్తాయని, ఎవరు కూడా బాల్యవివాహాలను ప్రోత్సహించొద్దని, అందరూ ఉన్నత స్థాయికి చేరుకున్న తర్వాత వివాహాలు చేసుకున్నట్లయితే ఎలాంటి ఇబ్బందులు ఎదురు కావన్నారు. ఈ కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వెంకటేశ్వరరావు, జెండర్ స్పెషలిస్టులు నిఖిత, భార్గవి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు ఎం.అనిత, టి.శ్రీనివాసులు, డాక్టర్ డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య, డాక్టర్ కిషన్, డాక్టర్ రాచమల్ల శ్రీను, అమర్, నరేష్, ఆంజనేయులు, రాధిక, రవి తదితర అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



## టెండర్ల డబ్బులను రికవరీ చేస్తాం

**విశ్వంభర, సిద్దిపేట :** పుల్లూరు లక్ష్మీ నరసింహస్వామి ఆలయ జాతరలోని టెండర్ల డబ్బులను రికవరీ చేసుకుని జాతరను ఎండోమెంట్ పరిధిలో నిర్వహిస్తామని దేవదాయశాఖ ఈఓ విజయలక్ష్మి స్పష్టం చేశారు. సిద్దిపేట రూరల్ మండలంలోని పుల్లూరు లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని సంబంధిత శాఖ అధికారులు, గ్రామస్తులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ జాతరను దేవదాయ శాఖ పరిధిలో నిర్వహిస్తామని చెప్పారు. ఆలయానికి సంబంధించిన గల్ల పెట్టెను సీజ్ చేస్తామన్నారు. జాతర అనంతరం గల్ల పెట్టెను గ్రామస్తుల అందరి సమక్షంలో లెక్కిస్తామని చెప్పారు. కొత్త అకౌంట్ ఓపెన్ చేసి టెండర్ల డబ్బులను అందులో వేస్తామన్నారు. ఆ అకౌంట్ ద్వారానే జాతరకు సంబంధించిన లావాదేవీలు జరుపుతామని తెలిపారు.

## గ్రామ అభివృద్ధి నా లక్ష్యం

**- సర్పంచ్ కొంతం సబితా యోగేందర్ రెడ్డి**



**విశ్వంభర. మహేశ్వరం :** కందుకూరు మండలం బాచుపల్లి గ్రామాన్ని ఆదర్శవంతమైన గ్రామంగా తీర్చిదిద్దుతానని బాచుపల్లి గ్రామ సర్పంచ్ కొంతం సబితా యుగేందర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా బాచుపల్లి నూతన సర్పంచిగా పదవి బాధ్యతలు చేపట్టిన తర్వాత గ్రామంలో మైసమ్మ గుడికి రోడ్ వేయించిన. కందుకూరు నుండి బాచుపల్లి రోడ్ కూడా వేయించ అని అన్నారు .అదేవిధంగా గ్రామంలో డ్రైనేజ్, సిసి రోడ్లు, లైట్లు, వాటర్, విద్యుత్ సమస్యలు ఉంటే వెంటనే నేను మా ఉపసర్పంచ్ వార్డ్ మెంబర్ అందరం కలిసి సమస్యను పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. గ్రామ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానన్నారు ప్రజలు ఏ సమస్యతో నా వద్దకు వచ్చిన వెంటనే పరిష్కారం చేసి చూపిస్తానని అన్నారు. గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తానని అన్నారు. గ్రామంలో నిరుపేదలకు ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉంటూ సహకారాన్ని అందిస్తానని అలాగే ఆర్థిక సాయం. అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇల్లు ఇప్పిస్తానని. సమస్యలపై ప్రత్యేక అధికారులతో చర్చిస్తామని గ్రామంలో ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటామని అన్నారు. గ్రామంలో ప్రజా సంక్షేమ అభివృద్ధి చేయడమై నా లక్ష్యం అని సర్పంచ్ కొంతం సబితా యుగేందర్ రెడ్డి అన్నారు.

## ఘనంగా భాష్యం మోడల్ హై స్కూల్ స్పోర్ట్స్ ఉత్సవ్



**విశ్వంభర, అంబర్ పేట :** అంబర్పేట భాష్యం మోడల్ హై స్కూల్ స్పోర్ట్స్ ఉత్సవ్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుధవారం ఉదయం అంబర్పేట మున్సిపల్ మైదానంలో జరిగిన ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాలలో రాణించాలని సూచించారు. ఇలాంటి వేడుకలు విద్యార్థులలో నూతన ఉత్సాహాన్ని కలిగిస్తాయని ఇలాంటి కార్యక్రమాలను మరిన్ని రూపొందించాలని పాఠశాల యాజమాన్యానికి సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపి నరసయ్య , శ్రీనివాస్ రెడ్డి, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జిహెచ్ఎంసి ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలి

**- దేప భాస్కర్ రెడ్డి**



**విశ్వంభర, సరూర్ నగర్ :** రాబోయే జిహెచ్ఎంసి ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలి అని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి అన్నారు. బుధవారం ఎన్టీఆర్ నగర్ డివిజన్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ఎన్నికల్లో పార్టీని బలోపేతం చేయడం విజయమే లక్ష్యంగా పని చేయాలి అని అన్నారు. కొత్త డివిజన్ అధ్యక్షుని నియామకంపై చర్చ రాబోయే ఎన్నికల్లో ఎన్టీఆర్ నగర్ డివిజన్‌లో పార్టీ జెండాను ఎగురవేయడమే మన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.ఈ దిశగా పార్టీ శ్రేణులను సమన్వయం చేస్తూ, చురుగ్గా ముందుకు నడిపించే సమర్థుడైన కొత్త డివిజన్ అధ్యక్షుని నియమించే విషయమై నాయకులతో విస్తృతంగా చర్చించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వంలో ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పూన్న గణేష్ నేత ,చిలుక ఉపేందర్ రెడ్డి, ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం చైర్మన్ రమేష్ , గట్ల రవీంద్ర, ముప్పిడి లింగస్వామి గౌడ్, రామకృష్ణ గౌడ్,దుబ్బాక శేఖర్, డాక్యర్ నాయక్, జ్ఞానేశ్వర్ యాదవ్,అక్బర్, అలేటి కిరణ్, మహమ్మద్, షఫీ, నగేష్ రేణుక, సుజాత రెడ్డి,స్వరూప, మాధవి, కవిత, ప్రమీల, రమాదేవి, లక్ష్మీ బాయి తదితరులు పాల్గొన్నారు.

## ఉర్దూ యూనివర్సిటి భూములపై షోకాజ్ నోటీసు విద్యా హక్కుల పై దాడి




**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** హైదరాబాద్‌లోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ (మనూ)కు కేటాయించిన భూమిలోని 50 ఎకరాలను ఉపయోగించలేదనే నెపంతో తిరిగి స్వాధీనం చేసుకోవాలంటూ తెలంగాణ ప్రభుత్వం షోకాజ్ నోటీసు జారీ చేయడాన్ని భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఖండించింది. 1998లో స్థాపించబడిన మనూ యూనివర్సిటీ విద్యార్థుల అవసరాల దృష్ట్యా సుమారు 200 ఎకరాల భూమి కేటాయించబడిందని, నూతనంగా ఏర్పడిన మనూ యూనివర్సిటీకి మౌలిక సదుపాయాలు ఒకేసారి నిర్మించడం సాధ్యం కాని పరిస్థితుల్లో వినియోగించ లేదు. భూమిని ఉపయోగించలేదనే పేరుతో భూమిని లాక్కోవడం విద్యా హక్కు పై దాడి చేయడమే నని ఎస్ఎఫ్ఐ పేర్కొంది. విశ్వవిద్యాలయాల భూములను కార్పొరేట్లకు, రియల్ ఎస్టేట్ మాఫియాలకు అప్పగించేందుకు కాదని అది విద్యార్థులకు భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా ఉండాలని ఎస్ఎఫ్ఐ స్పష్టం చేసింది. గతంలో హెచ్‌సియు భూములను తీసుకోవాలనే ప్రయత్నం ప్రభుత్వం చేసింది. విద్యార్థుల పోరాటం వల్ల ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. మనూలో ఇప్పటికీ సరిపడా హాస్టళ్లు, అకడమిక్ భవనాలు, పరిశోధనా సదుపాయాల కొరత ఉంది. ఖాళీగా ఉన్న భూమిని యూనివర్సిటీ అభివృద్ధికి ఉపయోగించకుండా కార్పోరేట్ శక్తులకు కేటాయించటం సరైనది కాదని పేర్కొంది. యూనివర్సిటీ భూములపై జారీ చేసిన షోకాజ్ నోటీసును వెంటనే ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని, విశ్వవిద్యాలయ భూమిని ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తీసుకోకూడదని, హాస్టళ్ళు, అకడమిక్ బ్లాకులు, పరిశోధనా కేంద్రాల నిర్మాణానికి తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేసింది. కేంద్ర`రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి మనూ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటి కోరింది.

## విద్యుత్ కాంట్రాక్టర్ల ఇబ్బందులు తొలగిస్తాం



**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** రాష్ట్రంలోని విద్యుత్ కాంట్రాక్టర్ల సమస్యలు పరిష్కరించి అభివృద్ధి పనులు వేగంగా జరిగేలా చూస్తామని టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ హామీ ఇచ్చారు. స్టోర్స్ లో మెటీరియల్ లేక కాంట్రాక్టర్లు పనులు చేసే పరిస్థితి లేదని, నూతన విధానాలు, కొత్త పాలసీలతో కాంట్రాక్టర్లు ఇబ్బందులు పడుతున్నారని ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టర్లు సీఎండీ దృష్టికి తీసుకుపోయారు. బుధవారం తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతన సంవత్సరం డైరీని సీఎండీ ఆవిష్కరించారు. కాంట్రాక్టర్ల సమస్యలను పరిష్కరిస్తామని.. నూతన విధానాలపై వారికి అవగాహన కల్పిస్తామని హామీ ఇచ్చారు. వర్క్ ఆర్డర్లు తొందరలో ముగించి ఎల్ఓసిలు త్వరగా ఇవ్వాలని సీఎండీని కోరగా.. సానుకూలంగా స్పందించారని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివకుమార్ తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ విద్యుత్తు ప్రధాన తనిఖీ అధికారి కే నందకుమార్, ఆర్ అండ్ బి చీఫ్ ఇంజనీర్ వై. లింగారెడ్డి.. అసోసియేషన్ క్యాలెండర్ ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ అసోసియేషన్ ముఖ్య సలహాదారు, రాష్ట్ర ఎలక్ట్రికల్ లైసెన్స్ బోర్డు సభ్యులు నక్క యాదగిరి, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివకుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్కే మాజీద్, రాష్ట్ర ఉపాధ్యక్షులుపి సదానంద గౌడ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుజయ్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎన్. పర్వతాలు, ఆర్గనైజింగ్ సెక్రటరీ బి ఇసాక్, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## పి.ఆర్.టి.యు (టి.ఎస్) క్యాలెండర్ ఆవిష్కరణ



**విశ్వంభర, రామన్నపేట :** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల కేంద్రంలోని రామన్నపేట మండల వనరుల కేంద్రంలో మండల విద్యాధికారిణి గవ్వ జ్యోతి ఆధ్వర్యంలో బుధవారం రోజు పి.ఆర్.టి.యు (టి.ఎస్) రామన్నపేట మండల శాఖ ఆధ్వర్యంలో క్యాలెండర్ ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమానికి పి.ఆర్.టి.యు (టి.ఎస్) యాదాద్రి భువనగిరి జిల్లా సమన్వయ కమిటీ చైర్మన్ భీమిడి ఉపేందర్ జీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వము చిత్తశుద్ధి కోల్పోయిందని ఆరోపించారు. ఇప్పటికైనా ఉపాధ్యాయుల పెండింగ్ డిఏలు వెంటనే విడుదల చేయాలని, అదే విధంగా రిటైర్డ్ ఉద్యోగుల గ్రాట్యూటీ, కమ్యూటేషన్ బకాయిలు, సర్వీస్ ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర సోషల్ మీడియా చైర్మన్ చొక్కారపు విజయ్ కుమార్ మాట్లాడుతూ, ఉపాధ్యాయుల మీద ఒత్తిడి తగ్గించాలని, పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. మండల శాఖ అధ్యక్షులు కైరోజు లింగాచారి, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ రహీం మాట్లాడుతూ, ప్రభుత్వం మేనిఫెస్టోలో చేర్చిన మాదిరిగా సిపిఎస్ ను వెంటనే రద్దు చేయాలని ఉపాధ్యాయులకు హెల్త్ కార్డుల విషయంలో ఆమోద యోగ్యమైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బాధ్యులు శ్రీనివాస్ రెడ్డి, భాస్కరాచారి, శ్రీనివాసరావు, మండల బాధ్యులు అబ్దుల్ ఖయ్యూం, లింగస్వామి, మణి, సీనియర్ సభ్యులు వెంకటేశం, ఆనంద్, మహేష్, అజీజ్ హుస్సేన్ పాల్గొన్నారు.

## వర్షా కాలం ఇసుక కోసం ముందస్తు బల్క్ బుకింగ్‌లు ప్రారంభం

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** వినియోగదారులకు చౌక ధరలకు నాణ్యమైన ఇసుక లభించేలా రాబోయే వర్షాకాలం జూన్ నుంచి అక్టోబర్ వరకు ముందస్తు బల్క్ ఇసుక బుకింగ్‌లను ప్రారంభించినట్లు తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీజీఎండీసీ) ప్రకటించింది. బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంటూ బల్క్‌బుకింగ్‌కోసం దరఖాస్తులు ఈనెల 8వ తేదీ నుంచి 18 వరకు స్వీకరిస్తున్నట్లు పేర్కొంది. దరఖాస్తుదారులు 32 మెట్రిక్ టన్నుల నుండి 5 వేల మెట్రిక్ టన్నుల వరకు సామర్థ్యం వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. గతేడాదిలో మెట్రిక్‌టన్ను రూ. 1600 ఉండగా, ఈఏడాది నుంచి రూ. 1400 లకు తగ్గించింది. దరఖాస్తుల ఆమోదం మొదట వచ్చిన వారికి మొదటి ప్రాధాన్యత ప్రాతిపదికన ఉంటుంది. ఆమోదించబడిన దరఖాస్తులు చెల్లింపు పూర్తి చేయడానికి ఆమోదం పొందిన తేదీ నుండి 10 రోజుల పాటు చెల్లుబాటులో ఉంటాయి. సరఫరా వ్యవధి జూన్ 2026 నుండి అక్టోబర్ 2026 వరకు ఆమోదించబడిన ఇసుక బజార్లు అదనపు స్టాక్‌యార్డుల నుండి సరఫరా చేయబడుతుంది. జూన్ నుండి సంబంధిత బల్క్ లాగిన్‌ల ద్వారా చెల్లించిన పరిమాణానికి అనుగుణంగా రవాణా కోసం వాహనాలను సిద్ధం చేసుకోవాలి. వర్షాకాలంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, నిర్మాణ కార్యకలాపాల అవసరాలను తీర్చడానికి నిరంతరాయంగా ఇసుక సరఫరా టీజీఎండీసీ చేయనుంది. హెచ్ఎండీ ఏ పరిధిలోని ఇసుక బజార్ల నుండి ముతక ఇసుక నిరంతర సరఫరా కోసం ముందస్తు బుకింగ్‌లు ఇప్పుడు అందుబాటులో ఉన్నట్లు తెలిపింది. భౌరంపేట, వట్టినాగులపల్లి, ఆదిభట్ల, అబ్దులాపూర్‌మెట్ ఇసుక బజార్ల నుండి జూన్ నుండి అక్టోబర్ వరకు రవాణా చేయబడుతుంది. ప్రస్తుతం ఉన్న నాలుగు ఇసుక బజార్లతో పాటు, వర్షాకాలంలో నిరంతరాయంగా తగినంత ఇసుక సరఫరాను గుర్తించడానికి , ప్రస్తుతం ఉన్న వాటి మాదిరిగానే హైదరాబాద్ సమీపంలో అదనపు స్టాక్‌యార్డులను ఏర్పాటు చేస్తుంది.



# ఆత్మాభిమానం పేరుతో కవిత కన్నీళ్లు డ్రామా

## నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. భూపతి రెడ్డి



**విశ్వంభర, నిజామాబాద్ రూరల్:** ఆత్మాభిమానం పేరుతో అసెంబ్లీలో ఎమ్మెల్సీ కవిత కన్నీళ్లు పెట్టుకోవడం పూర్తిగా డ్రామా అని, కేసీఆర్ దోచుకున్న సొమ్ములో తనకు వాటా ఇవ్వలేదన్నదే అసలు కారణమని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. రేకులపల్లి భూపతి రెడ్డి తీవ్రంగా విమర్శించారు. దర్పల్లి మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో అధికారులు ఏర్పాటు చేసిన కళ్యాణలక్ష్మిఉషాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా దర్పల్లి, సిరికొండ, ఇందాలవాయి మండలాలకు చెందిన 200 కుటుంబాలకు రూ.2 కోట్ల విలువైన చెక్కులను పంపిణీ చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ, గత టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ద్రోహులకు ఆసరా ఇచ్చింది కవితే కదా అని ప్రశ్నించారు. ఎందరో ప్రజలు కన్నీళ్లు పెట్టుకున్నప్పుడు ఆమెకు ఆత్మగౌరవం గుర్తుకు రాలేదా అని నిలదీశారు.తెలంగాణపై రూ.9 లక్షల కోట్ల అప్పుల భారం మోపి, ఫామ్ హౌస్‌ల్లో హాయిగా ఉంటూ, దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన రాహుల్ గాంధీ కుటుంబంపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం సిగ్గుచేటని అన్నారు. ఇప్పటికీ స్వంత ఇల్లు లేని కుటుంబాన్ని పట్టుకుని అహంకారంగా మాట్లాడితే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.కే కసీఆర్ మరోసారి ఇలాంటి ప్రవర్తన కొనసాగిస్తే కాంగ్రెస్ కార్యకర్తలు చూస్తూ ఊరుకోరని స్పష్టం చేశారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరు గ్యారంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారని తెలిపారు.మహిళలకు 'స్వశక్తి' పేరుతో వడ్డీ లేని రుణాలు అందించి స్వావలంబన వైపు నడిపిస్తున్నామని, ఇందిరమ్మ ఇండ్లు, సన్నబియ్యం, ఉచిత కరెంటు, ఉచిత బస్సు ప్రయాణం, దేశఉవిదేశాల నుంచి భారీ పెట్టుబడులతో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. దుబ్బాక, ధర్పల్లి, మైలారం, నిరుపేదల అయినటువంటి . రేకులపల్లి, సర్పంచ్ రాజేందర్ ఆధ్వర్యంలో రేకులపల్లి గ్రామస్తులకు కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ.ఈ అభివృద్ధిని చూసి బీఆర్ఎస్ నేతలకు ఓర్వలేక కళ్లు మండుతున్నాయని, బీజేపీ దేశాన్ని అమ్ముకుంటూ కూడా కాంగ్రెస్‌పై విమర్శలు చేయడం విడ్డూరమని అన్నారు. తెలంగాణను రైజింగ్ తెలంగాణగా, గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దుతామని చెప్పారు. రానున్న రోజుల్లో స్థలాలు లేని పేదలకు 75 గజాల స్థలంలో ప్రభుత్వమే ఇండ్లు నిర్మించి ఇస్తుందని హామీ ఇచ్చారు.కార్యక్రమం అనంతరం రామడుగు ప్రాజెక్ట్ ఆయకట్టు కింద వరి పొలాలకు సాగునీటిని విడుదల చేశారు. అలాగే దమ్మన్నపేట గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన రెండు కుటుంబాలను పరామర్శించారు.ఈ కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్ శేఖర్ గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఆర్మూర్ చిన్న బాలరాజ్, ఇమ్మడి గోపి, దర్పల్లి, సర్పంచ్ చెలిమెల శ్రీనివాస్, మాజీ సొసైటీ చైర్మన్ చెలిమెల మల్లికార్జున్, రామడుగు గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ గోవింద్ గారి రాజారెడ్డి. రామడుగు అభివృద్ధి కమిటీ వైస్ చైర్మన్ కల్లెడ, రాజారెడ్డి. గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు దుబ్బాక గంగారెడ్డి, డికంపల్లి శ్రీనివాస్ ,కాంగ్రెస్ సీనియర్ సుద్దులసుదర్శన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్, అజయ్, రాయంగారి మైపాల్ రెడ్డి రామడుగు, గ్రామ శాఖ అధ్యక్షుడు ఆనంద్, ,జనార్ధన్ రెడ్డి, తహసీల్దార్ టి. శాంత, ఎంపీడీఓ లక్ష్మరెడ్డి, వివిధ శాఖల అధికారులు, నూతనంగా ఎన్నికైన సర్పంచులు, వార్డు సభ్యులు, మండల నాయకులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఎస్టీయూ నిరంతర కృషి

### ఎస్‌టియు మెదక్ జిల్లా అధ్యక్షుడు రాజగోపాల్ గౌడ్

విశ్వంభర,పెద్ద శంకరంపేట:



ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నిరంతరం కృషి చేస్తుందని మెదక్ జిల్లా ఎస్టీయూ అధ్యక్షుడు రాజగోపాల్ గౌడ్ అన్నారు. బుధవారం పెద్ద శంకరంపేటలో ఎస్ టి యు టి ఎస్ మండల శాఖ ప్రథమ కార్యవర్గ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఎస్టియు ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు రావలసిన రిటైర్మెంట్ బెనిఫిట్స్.. పెండింగ్లో ఉన్న డీఏలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలన్నారు. జాతీయస్థాయిలో ఫిబ్రవరి 5వ తేదీన ఢిల్లీలో చేపట్టనున్న జాతీయ స్థాయి ధర్నాలు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ టి యు రాష్ట్ర అసోసియేటెడ్ అధ్యక్షులు బి శ్రీనివాస్. ఎస్టీయు జిల్లా మండల శాఖ బాధ్యులు కుమార్ శ్రీనివాస్ అశోక్ రెడ్డి రాధాకృష్ణ వెంకటేష్ కే శ్రీనివాస్ ఆనంద్ సుదీర్ శంకర్ అధిక సంఖ్యలో ఎస్ టి యు సంఘం బాధ్యులు పాల్గొన్నారు.

# ఎన్ హెచ్-67 రోడ్డు విస్తరణ పనులకు అందరు సహకరించాలి

## - సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్

విశ్వంభర, మిర్యాలగూడ



మిర్యాలగూడ పట్టణంలో చీఎఉ167 రోడ్డు విస్తరణ పనులుల లో భాగంగా సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ రోడ్డు విస్తరణ పనులు గురించి ఒక ప్రెస్ మీట్ లో తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు విస్తరణ పనులు అడ్వాన్స్ దశకు చేరుకున్నాయి అని తెలిపారు. మిర్యాలగూడ పట్టణంలో ఒక కిలోమీటర్ వరకు రోడ్డు విస్తరణ పనులు జరగనున్నాయి. గణేష్ మార్కెట్ నుండి రాజీవ్ చౌక్ వరకు 90 అడుగులు., రాజీవ్ చౌక్ నుండి సుధా బ్యాంక్ వరకు 84 అడుగుల వెడల్పుతో ఫోర్ లేన్ బీటీ రోడ్డు, సెంట్రల్ లైటింగ్, ఫుట్‌పాత్‌లు మరియు డ్రైనేజ్ సౌకర్యం వంటివి ఏర్పాటు చేయబడుతున్నాయి.ఈ ప్రాజెక్టుకు సంబంధించి రూ.54 కోట్ల భూసేకరణలో భాగంగా రూ.44 కోట్లు, (205) మంది లబ్ధిదారులకు ఇప్పటికే నష్ట పరిహారం చెల్లించడం జరిగింది. మిగిలిన (55) మంది లబ్ధిదారులు సబ్–కలెక్టర్ కార్యాలయంలో తమ డాక్యుమెంట్లు సమర్పించి పరిహారం పొందవలసిందిగా కోరనైనది.సబ్–కలెక్టర్ కార్యాలయం నుండి రెండవ 3జు నోటీసు జారీ చేయడం జరిగింది. ఇచ్చిన 60 రోజుల గడువు కూడా ముగిసింది. కావున, షాపులు/ఇళ్ల యజవ ూ నులు అందరూ స్వచ్ఛందంగా ఖాళీ చేసి డిస్మాంటిలింగ్‌కు సహకరించవలసిందిగా కోరుతున్నాము.డిస్మాంటిల్ సమయంలో రోడ్డుకు అవసరమైన స్థలాన్ని వదిలి సెట్బ్యాక్ పాటిస్తూ వెనక్కి కట్టుకోవాలి. మున్సిపల్ అనుమతి కూడా సెట్బ్యాక్ ఉన్నప్పుడే ఇవ్వబడుతుంది.కావున, అందరూ కూడా ఎన్ హేచ్ఉ167 రోడ్డు విస్తరణ పనులకు సహకరించవలసిందిగా కోరనైనది.

## ఖాళీచేయని షాపులకు నోటీసులు అందజేత

విశ్వంభర,మిర్యాలగూడ:



మిర్యాలగూడ పట్టణంలో నేషనల్ హైవే -167 రోడ్డు విస్తరణలో భాగంగా మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ బుధవారం రోజున కొన్ని షాపులకు నోటీసులు అందజేయడం జరిగింది. సబ్–కలెక్టర్ కార్యాలయం నుండి రెండవ 3జు నోటీసు జారీ చేసిన తదుపరి, ఇచ్చిన 60 రోజుల గడువు ముగిసిన తర్వాత కూడా ఖాళీ చేయని షాపులు/ఇళ్ల యజమానులకు (గణేష్ మార్కెట్ సమీపంలో) తక్షణమే ఖాళీ చేయుటకు గాన బుధవారం రోజున నోటీసులు జారీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో పలువురు సబ్ కలెక్టర్ ఆఫీస్ సిబ్బంది రోడ్డు విస్తరణ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల నిర్వహణ సన్నద్ధతపై వీడియో కాన్ఫరెన్స్

విశ్వంభర సంగారెడ్డి:



మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి చేపట్టాల్సిన ముందస్తు సన్నద్ధతపై జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లతో రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణీకుమిది బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, తెలంగాణ మున్సిపాలిటీ చట్టంఉ2019లోని సవరించిన సెక్షన్ 195ఉఎ ప్రకారం వార్డువారీ ఓటర్ల తుది జాబితాను ఈ నెల 12 న తప్పనిసరిగా ప్రచురించాలని సూచించారు. ఈ నెల 13వ తేదీన పోలింగ్ స్టేషన్ల వివరాల ముసాయిదా జాబితాను ప్రచురించి, వాటిని 'టిఉపోల్లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు.అదేవిధంగా ఈ నెల 16న పోలింగ్ స్టేషన్ల వివరాలతో పాటు ఫోటోతో కూడిన ఓటర్ల తుది జాబితాను ఆయా వార్డులలోని పోలింగ్ స్టేషన్ల వద్ద స్పష్టంగా ప్రచురించాలనితెలిపారు. పోలింగ్ నిర్వహణలో భాగంగా అవసరమైన రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, జోనల్ అధికారులు, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ బృందాల నియామకాన్ని వెంటనే పూర్తి చేయాలని, ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా అన్ని ఏర్పాట్లను ముందస్తుగా చేపట్టాలని కమిషనర్ సూచించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య పలు అంశాలను కమిషనర్ దృష్టికి తీసుకురాగా, ఆయా విషయాలపై కమిషనర్ తగిన సూచనలు, మార్గదర్శకాలను అందించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా నుండి అదనపు కలెక్టర్ పాండు, మున్సిపల్ కమిషనర్లు, ఎన్నికల విభాగపు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్మ్డ్ డిఎస్పీకి రాష్ట్ర స్థాయి పోలీస్ సేవా పతకం

విశ్వంభర,సూర్యాపేట:



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతన సంవత్సరం సందర్భంగా రాష్ట్రస్థాయి ఉత్తమ ఉద్యోగుల ప్రతిభ అవార్డు ప్రకటించడం జరిగింది. సూర్యాపేట జిల్లా పోలీస్ ఆర్మ్డ్ విభాగం నందు పని చేస్తున్న డిఎస్పీ నరసింహ చారి కి పోలీస్ సేవా పతకం లభించినది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పి నరసింహ మర్యాదపూర్వకంగా కలిశారు, ఎస్పి అభినందించి శుభాకాంక్షలు తెలిపినారు.

# రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

విశ్వంభర , సంగారెడ్డి:



సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గంలో బుధవారం రోజున తాసిల్దార్ కార్యాలయంలో కేంద్ర ఎన్నికల సంఘం, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు నియోజకవర్గ స్థాయి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న బూత్ స్థాయి అధికారులకు రాజకీయ పార్టీలకు చెందిన బూత్ స్థాయి ఏజెంట్లు ఓటరు మ్యాపింగ్ ప్రక్రియలో, అలాగే ఒకే విధమైన జనాభా నమోదులపై జరుగుతున్న విచారణల్లో పూర్తి సహకారం అందించాలని పటాన్‌చెరు నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి విశాలాక్ష కోరారు.ముందస్తు ప్రత్యేక సమగ్ర సవరణకు సంబంధించి నియోజకవర్గంలో ఇప్పటివరకు చేపట్టిన కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి ఒక బూత్ స్థాయి సహాయకుడిని ఇప్పటివరకు నియమించని చోట తప్పనిసరిగా నియమించాలని, వారు బూత్ స్థాయి అధికారులకు అవసరమైన సహాయ సహకారాలు అందించేలా చూడాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు.ఈ కార్యక్రమంలో ఓటరు నమోదు అధికారి విశాలాక్ష, నియోజకవర్గ ఎన్నికల సమాచార సాంకేతిక అధికారి సంతోష్ కుమార్‌తో పాటు రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి పటాన్‌చెరు పట్టణ అధ్యక్షులు కొల్కురి నరసింహారెడ్డి, భారత రాష్ట్ర సమితి పార్టీ నుంచి శ్రీధర్ చారి, భారతీయ జనతా పార్టీ నుంచి తిరుపతి రాజ్, బహుజన సమాజ పార్టీ నుంచి అసెంబ్లీ అధ్యక్షులు ప్రశాంత్ కుమార్, కమ్యూనిస్టు పార్టీ నుంచి నాగేశ్వరరావు, తెలుగుదేశం పార్టీ మైనారిటీ అధ్యక్షులు నజీర్ పాల్గొన్నారు.

## వైకుంఠ సమారాధనకు హాజరైన ఎమ్మెల్యే పరిటాల సునీత

విశ్వంభర, రాప్తాడు:



గత నెలలో అమెరికాలో మరణించిన తన సోదరి భర్త రామాంజినేయులు స్మృ త్యర్థం బెంగళూరులో నిర్వహించిన వైకుంఠ సమారాధన కార్యక్రమానికి కుటుంబ సభ్యులతో కలిసి హాజరై రామాంజనేయులు చిత్రపటానికి నివాళులర్పించడం జరిగింది.

## ఆన్ లైన్ టాస్కులపై ప్రత్యేక దృష్టి సారించాలి



**విశ్వంభరు,నెల్లికుదురు:** ఆన్లైన్ టాస్కులపై ప్రత్యేత దృష్టిసారిస్తు మండలాన్ని ముందంజలో ఉంచాలని నెల్లికుదురు మండల విద్యాశాఖ అధికారి ఏ.రాందాస్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగిన ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రతీరోజు విద్యార్థులు, ఉపాధ్యాయుల ఎస్ఆర్ఎస్ అటెండెన్స్ సకాలంలో ఆన్లైన్ చేయాలని తదుపరి వెంటనే ఎండిఎం ఆన్లైన్ చేయాలని తెలిపారు. పెండింగ్లో ఉన్న ఎఫ్ఎల్ఎన్, ఎల్ఎపీ బేస్లైన్, మిడ్లైన్ ఆన్లైన్ ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలన్నారు. ప్రతీ పాఠశాలలో హెచ్ఎం టేబుల్పై ఎఫ్ఎల్ఎస్ ప్రణాళికను సిద్దంగా ఉండాలని తెలిపారు. ఉన్నత అధికారులు పర్యవేక్షణలో ఆ ప్రనా ళికపై ప్రత్యేక దృష్టిసారిస్తారని తెలిపారు. పదో తరగతి విద్యార్థులు నిర్దేశించి షెడ్యూల్ మేరకు ప్రక్టీస్ టెస్టులు నిర్వహించాలని, వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేకర దృష్టి సారించి వారిలో నైపణ్యాలను పెంపొందించాలని తెలిపారు. అనంతరం పాఠశాలలకు జనవరి మాసం రాగిజావ, బెల్లం ప్యాట్లను, 3, 10వ తరగతి విద్యార్థులకు అభ్యసదిపికలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు గంగు వాణిశ్రీ, స్వప్న, గోజిటెడ్ హెచ్ఎంలు స్వరూప, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ ఉపేందర్ రావు, కేజీబీవీ ఎస్వో సుమలత, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలు బాస్కర్ రావు, బీ, వీరస్వామి, బీ.కవిత, జే. కవిత, డీ.రవి, మెస్సెంజర్ యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నియమాలు పాటించాలి

విశ్వంభర, మహబూబాబాద్:



రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని మహబూబాబాద్ పట్టణంలో ట్రాఫిక్ నియమాలు పాటించవలసిన జాగ్రత్తలపై జిల్లా రవాణా శాఖ అధికారులు వాహన డ్రైవర్లకు ప్రమాదకరమైన డ్రైవింగ్ మరియు అతివేగం వల్ల కలిగే నష్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు

ట్రాఫిక్ నిబంధనలు పక్కగా పాటించడం, జీబ్రా క్రాసింగ్ లను వినియోగించడం, ట్రాఫిక్ సిగ్నల్ అనుసరించడం, వాహనాలను ఓవర్టేక్ చేయడం, రోడ్డు ప్రమాదాల నివారణకు పక్కాగా పాటించవలసిన అంశాలు సీట్ బెల్ట్, హెల్మెట్ ధరించడం, మద్యం సేవించి వాహనాలు నడపడం, అధిక దూరం ప్రయాణించినప్పుడు విశ్రాంతి తీసుకోవడం, శీతాకాలం వర్షాకాలం లలో రోడ్డుపై ప్రయాణించే సమయాలలో తీసుకోవలసిన జాగ్రత్తలు, తదితర అంశాలపై పిల్లలకు అర్థమయ్యే రీతిలో అవగాహన కల్పించారు, జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు, తేదీ జనవరి 1 నుండి 31 వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు...ప్రతీ ఒక్కరు బాధ్యతయూతంగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్స్ సాయి చరణ్ వెంకట్ రెడ్డి అన్నారు.

## తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు

విశ్వంభర,ఇనుగుర్తి:



జన్మనిచ్చిన తండ్రికి కూతురు తలకొరివి పెట్టిన సంఘటన మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలం చిన్ననాగారంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే పోలీసు శాఖలో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తించిన బైరు మురళి గౌడ్(63) అనారోగ్యంతో బుధవారం తెల్లవారుజామున చనిపోయారు.ఈయన భార్య అండమ్మ గతంలో కన్ను మూసింది. వీరికి ఇద్దరు కూతుర్లు లావణ్య, కళ్యాణి ఉన్నారు.తండ్రి సైతం కన్ను మూయడంతో కూతుర్లు,బంధువుల రోదనలు మిన్నంటాయి.మురళి గౌడ్ మహాప్రస్థాన యాత్రలో దహన సంస్కారాల కోసం కూతుర్లు పాడె ముందు నడిచారు. పెద్ద కూతురు లావణ్య రెండు కి తలకు తల కొరివి పెట్టింది. దీంతో గ్రామస్తులు బంధువులు అభిమానులు కంటతడి పెట్టారు.

ప్రజా విశ్వంభర

# వర్షాకాలం ఇసుక కోసం ముందస్తు బల్క్ బుకింగ్‌లు ప్రారంభం

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :**

వినియోగదారులకు చౌక ధరలకు నాణ్యమైన ఇసుక లభించేలా రాబోయే వర్షాకాలం జూన్ నుంచి అక్టోబర్ వరకు ముందస్తు బల్క్ ఇసుక బుకింగ్‌లను ప్రారంభించినట్లు తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీజీఎండీసీ) ప్రకటించింది. బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంటూ బల్క్?బుకింగ్?కోసం దరఖాస్తులు ఈనెల 8వ తేదీ నుంచి 18 వరకు స్వీకరిస్తున్నట్లు పేర్కొంది. దరఖాస్తుదారులు 32 మెట్రిక్ టన్నుల నుండి 5 వేల మెట్రిక్ టన్నుల వరకు సామర్థ్యం వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. గతేడాదిలో మెట్రిక్?టన్ను రూ. 1600 ఉండగా, ఈఏడాది నుంచి రూ. 1400 లకు తగ్గించింది. దరఖాస్తుల ఆమోదం మొదట వచ్చిన వారికి మొదటి ప్రాధాన్యత ప్రాతిపదికన ఉంటుంది. ఆమోదించబడిన దరఖాస్తులు చెల్లింపు పూర్తి చేయడానికి ఆమోదం పొందిన తేదీ నుండి 10 రోజుల పాటు చెల్లుబాటులో ఉంటాయి.సరఫరా వ్యవధి జూన్ 2026 నుండి అక్టోబర్ 2026 వరకు ఆమోదించబడిన ఇసుక బజార్లు అదనపు స్టాక్‌యార్డుల నుండి సరఫరా చేయబడుతుంది. జూన్ నుండి సంబంధిత బల్క్ లాగిన్‌ల ద్వారా చెల్లించిన పరిమాణానికి అనుగుణంగా రవాణా కోసం వాహనాలను సిద్ధం చేసుకోవాలి. వర్షాకాలంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, నిర్మాణ కార్యకలాపాల అవసరాలను తీర్చడానికి నిరంతరాయంగా ఇసుక సరఫరా టీజీఎండీసీ చేయనుంది. హెచ్?ఎండీ ఏ పరిధిలోని ఇసుక బజార్ల నుండి ముతక ఇసుక నిరంతర సరఫరా కోసం ముందస్తు బుకింగ్‌లు ఇప్పుడు అందుబాటులో ఉన్నట్లు తెలిపింది. భౌరంపేట, వట్టినాగులపల్లి, ఆదిభట్ల, అబ్దులాపూర్?మెట్?ఇసుక బజార్ల నుండి జూన్ నుండి అక్టోబర్ వరకు



రవాణా చేయబడుతుంది. ప్రస్తుతం ఉన్న నాలుగు ఇసుక బజార్లతో పాటు, వర్షాకాలంలో నిరంతరాయంగా తగినంత ఇసుక సరఫరాను గుర్తించడానికి , ప్రస్తుతం ఉన్న వాటి మాదిరిగానే హైదరాబాద్ సమీపంలో అదనపు స్టాక్‌యార్డులను ఏర్పాటు చేస్తుంది.

## పవర్ లిఫ్టింగ్ పోటీలో గోల్డ్ మెడల్ సాధించిన సంఘాల కమల్

**విశ్వంభర, హనుమకొండ:**



ఖమ్మం జిల్లా లో జరిగిన రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలలో హన్మకొండ జిల్లా భీమారం కు చెందిన సంఘాల కమల్ గోల్డ్ మెడల్ సాధించడం జరిగింది. ఈ సందర్భంగా ఈనెల 7వ తేదీ నుంచి 11వ తేదీ వరకు ఢిల్లీలో జరిగే జాతీయ నేషనల్ పవర్ లిఫ్టింగ్ గేమ్స్ కి మన తెలంగాణ రాష్ట్రం నుండి కొంతమంది ఎంపికైనారు, హనుమకొండ జిల్లాకు ,మన తెలంగాణ రాష్ట్రం కు మంచి పేరు తేవాలని, ఢిల్లీలో జరిగే నేషనల్ గేమ్స్ లో కూడా పథకం సాధించాలని వీరిని వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, పవర్ లిఫ్టింగ్ వరంగల్ జిల్లా అధ్యక్షులు ,జిల్లా నాయకులు దేవంకొండ అనిల్ కుమార్, మాజీ కూడా డైరెక్టర్, నన్నపోయిన రమేష్ యాదవ్, తదితరులు శాలువాతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పథంలో అంబట్ పల్లి గ్రామం

**విశ్వంభర : మహాదేవపూర్:**



జయశంకర్ జిల్లా మహాదేవపూర్‌మండలం అంబటిపల్లి గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు ఊపందుకుంటున్న నేపథ్యంలో గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో బయో టాయిలెట్స్ నిర్మాణానికి నూతన సర్పంచ్ గుజ్జుల లావణ్య శంకర్ బుధవారం భూమి పూజ కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల పాఠశాలలో అభివృద్ధి కార్యక్రమాలు జరగలేదు అని, ఇకముందు జరిగే అభివృద్ధి కార్యక్రమాలు పార్టీలకు అతీతంగా అభివృద్ధి మాత్రమే ధ్యేయంగా పనిచేస్తామని అన్నారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి రమేష్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పాత ఉపాధి హామీ చట్టం పునరుద్ధరణకు ఉద్యమం

**విశ్వంభర, బాగ్ లింగంపల్లి:**



జి రామ్ జి చట్టాన్ని రద్దు చేసి పాత గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించే వరకు దేశవ్యాప్త ఉద్యమం చేస్తామని అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి వెంకట్ అన్నారు. పేదల పొట్ట కొట్టి గ్రామీణ భూస్వాములు, పెట్టుబడి దారులకు లాభం చేకూర్చేందుకే కొత్త చట్టమని ఆయన విమర్శించారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బాగ్ లింగంపల్లి సుందరయ్య పార్క్ వద్ద జి రామ్ జి చట్టం ప్రతులను దగ్ధం చేశారు. ఉపాధి హామీ పథకానికి కేంద్రం నిధులను 90 శాతం నుంచి 60 శాతానికి తగ్గించడం ద్వారా రాష్ట్రాలపై భారం మోపారని, దీనివల్ల గ్రామీణ ఉపాధి పనులు నిలిచిపోయే ప్రమాదం ఉందన్నారు. పనిదినాలపై తీసుకున్న నిర్ణయాలు పని హక్కును దెబ్బతీస్తున్నాయని, ప్రజల భాగస్వామ్యం, గ్రామపంచాయతీల పాత్రను తగ్గించడం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు జి నాగయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములు, రాష్ట్ర నాయకులు బి ప్రసాద్, పొన్నం వెంకటేశ్వరరావు, నారి అయిలయ్య, కొండమడుగు నరసింహ, సాంబశివ, అన్నవరపు కనకయ్య, బొప్పని పద్మ, ములకలపల్లి రాములు, రాళ్లబండి శశిధర్, కందుకూరి జగన్, ఎం వెంకటయ్య, నరసింహులు, గోపాల్, పెద్ది వెంకట్ రాములు తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ ఈటల రాజేందర్ ను కలిసిన బీజేపీ నాయకులు

**విశ్వంభర, చింతపల్లి:**



మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ ని మర్యాదపూర్వకంగా కలిసిన చింతపల్లి బీజేపీ నాయకులు.. బీజేపీ మండల అధ్యక్షులు సముద్రాల నాగేష్ ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్ లోని వారి నివాసం కలిసారు.. ఈ సందర్భంగా చింతపల్లి ప్రాంతంలోని రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతం, కార్యకర్తల సమస్యలు, రాబోయే కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి బీజేపీ నాయకులు, కార్యకర్తలు మరింత చురుకుగా పనిచేయాలని ఈటల రాజేందర్ సూచించినట్లు వారు తెలిపారు. బీజేపీ పార్టీని గ్రామ స్థాయి వరకు బలోపేతం చేయడంలో ప్రతి కార్యకర్త కీలక పాత్ర పోషించాలని ఆయన అన్నారని వారు ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దావా శ్రీను, శివర్ల రమేష్, వెన్నం శేఖర్, కుకడపు రామకృష్ణ , ఎర్ర వెంకటయ్య, మాసని సైదులు, కుంభం శ్రీనివాసరెడ్డి, నాళ్ళ శివకుమార్, పున్న భీమేష్, గజ్జ అభినవ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సరఫరా నిలిపివేత

**విశ్వంభర, ఘట్కేసర్:**

మేడ్చల్ జిల్లా పోచారం సర్కిల్ నారపల్లి సబ్ స్టేషన్ లో గురువారం మరమ్మత్తుల కారణంగా 11:30 నుండి 12:30వరకు సింగపూర్ టౌన్షిప్ రాజీవ్ గృహకల్ప. ఆర్ ఎన్ ఆర్ హైట్స్ , మయూరి డెవలపర్స్ సాయి నగర్ ఎమరాల్డ్ హైట్స్ సూర్య నగర్ మధ్యాహ్నం రెండుగంటల నుండి మూడు గంటల వరకు ప్రగతి నగర్ కమల నగర్ సాయి నగర్ ఈస్ట్ ధరిని కాలనీ బాపూజీ నగర్ అరుణోదయ కాలనీ ఎస్వి కాలనీ పిటి కాలనీ వెస్ట్ కమలానగర్ విశ్వం విహార్ సుమా రెసిడెన్సి గురు ఎం క్లేవ్ భగత్ సింగ్‌నగర్ అయోధ్య కాలనీ ఎస్సీకాలనీ సాయి నగర్ ఈస్ట్ బాపూజీ నగర్ అరుణోదయ కాలనీలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ ప్రదీప్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

## ప్రెస్ అకాడమీ చైర్మన్ కు సన్మానం

**విశ్వంభర, మహబూబాబాద్**



మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి వచ్చిన ప్రెస్ అకాడమి చైర్మన్, ఐజేయు జాతీయ అధ్యక్షులు, మా..మార్గదర్శి శ్రీనివాస్ రెడ్డి గారిని మర్యాదపూర్వకంగా కలిసి, సత్కరించిన టియుడబ్ల్యూజె (ఐజేయు) మహబూబాబాద్ జిల్లాఅధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్, జిల్లా ప్రధానకార్యదర్శి గాడిపల్లి శ్రీహరి, జిల్లా నాయకులు గాడిపల్లి యాదగిరి, రావూరి ప్రశాంత్, నెల్లం శ్రీనివాస్.

## ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్

**విశ్వంభర, అంబర్ పేట :**



ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ కార్యక్రమం "గ్రీన్ వేస్ట్ రిమూవలు లో భాగంగా బుధవారం సికింద్రాబాదు జోన్, అంబర్‌పేట సర్కిల్ డీసీఉ42 పరిధిలోని సోమసుందర్ నగర్, బాగ్ అంబర్‌పేట ప్రాం తంలో గ్రీన్ వేస్ట్‌ను పూర్తిగా తొలగించారు. ఈ కార్యక్రమాన్ని ఏఈ (ఎస్‌డబ్ల్యూఎం), అంబర్‌పేట సర్కిల్ ఎస్ఎస్ పర్య వేక్షణలో నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా ఈప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

## సర్పంచుల సహకారంతో ఫోరం అధ్యక్ష పదవికి పోటీ

**విశ్వంభర, మహాదేవపూర్:**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షురాలిగా తాను పోటీలో ఉన్నట్లు మద్దులపల్లి గ్రామ సర్పంచ్ ఎల్పుల సరిత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు.రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుదిల్ల శ్రీధర్ బాబు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీనుబాబు ఆశీస్సులతో నిరుపేదలు, బడుగు-బలహీన వర్గాల సంక్షమం కోసం నిత్యం ప్రజాసేవలో కొనసాగుతానని ఆమె పేర్కొన్నారు.మండలంలోని సర్పంచులు తనకు సహకరించి మద్దతు ఇవ్వాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

## బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

**విశ్వంభర,ఇనుగుర్తి:**



ఇనుగుర్తి మండలం అయ్యగారి పల్లి గ్రామానికి చెందిన ఇటీవల కన్నుమూసిన పత్తిపాక సోమయ్య కుటుంబానికి అండగా ఉంటామని భూక్య శోభన్ బాబు ఫౌండేషన్, ఎఐసిసి ఆదివాసి జాతీయ కోఆర్డినేటర్ భూక్య శోభన్ బాబు భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబాన్ని ఆయన బుధవారం పరామర్శించి ధైర్య వచనాలు చెప్పారు.స్వర్గీయ సోమయ్య కుటుంబానికి భూక్య శోభన్ బాబు తన ఫౌండేషన్ నుంచి 50 కిలోల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో మామిడి జనార్ధన్, మెట్టు రాజు, బానోత్ సూర్య, సారయ్య,నరేష్,భూక్య రమేష్,మాడికుంట్ల వెంకన్న, కొంతం శ్రీనివాస్, భూక్య హరిసింగ్, చింతల రమేష్, చింతల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా పేట సాయి

**విశ్వంభర, మహాదేవపూర్:**



జయశంకర్ భూపాలపల్లిజిల్లా మహాదేవపూర్ మండలం కేంద్రంలో. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ 44 వ రాష్ట్ర మహాసభలు జనవరి 3,4,5 తేదీలలో శంషాబాద్ కేంద్రంగా నిర్వహించుకోవడం జరిగింది. ఈ యొక్క సమావేశంలో రాష్ట్రంలో ఉన్నటువంటి అనేక రకాల సమస్యల పైన చర్చించి తీర్మానాలు ప్రవేశ పెట్టడం జరిగింది. అనంతరం ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షుడు రావుల కృష్ణ. నూతన రాష్ట్ర కార్యవర్గాన్నీ ఎన్నుకోవడం జరిగింది. ఈ యొక్క నూతన కార్యవర్గంలో మహాదేవపూర్ పేట సాయి రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా నియమించడం జరిగింది. పేట సాయి గతంలో ఇంటర్ కాలేజ్ వైస్ ప్రెసిడెంట్, టౌన్ హాస్టల్స్ ఇన్చార్జిగా, జిల్లా కో హాస్టల్స్ ఇన్చార్జిగా, మహాదేవపూర్ నగర కార్యదర్శి గా బాధ్యతలు నిర్వర్తించారు. ఈ సందర్భంగా సాయి మాట్లాడుతూ నా పై నమ్మకంతో 44వ రాష్ట్ర మహా సభలలో రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా గా ఎన్నుకున్న రాష్ట్ర శాఖ కి మరియు నా నియామకానికి సహకరించిన వరంగల్ విభాగ్ పెద్దలకు నా తోటి కార్యకర్తలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేసారు. అనునిత్యం విద్యారంగ సమస్యల పైన సమస్యల పరిష్కారానికి కృషి చేశానని తెలిపారు పేట సాయి నియామకం పట్ల భూపాలపల్లి జిల్లా కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

## విద్యార్థులు జీవితాలతో చెలగాటమాడుతున్న ఒకేషనల్ జూనియర్ కళాశాల

**విశ్వంభర, డిండి:**



డిండి మండల కేంద్రంలో విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడు తున్న శ్రీ వెంకటేశ్వర ఒకేషనల్ జూనియర్ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిండి ఎమ్మార్వో ఆఫీస్ లో ఆర్ ఐ వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఏఐఎస్ఎఫ్ అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏ ఐ ఎస్ ఎఫ్ డిండి మండల సమితి ఆధ్వర్యంలో ఎమ్మార్వో ఆఫీస్ ముందు నిరసన తెలియజేయడం ఈ కార్యక్రమానికి దేవరకొండ డివిజన్ అధ్యక్షుడు సురిగి వినయ్ కుమార్ అధ్యక్షత వహించడం జరిగింది ఈ ఒక నిరసన కార్యక్రమానికి అనంతరం ముఖ్య అతిథిగా విచ్చేసిన అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర నాయకులు బల ముల ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ డిండి మండల కేంద్రంలో శ్రీ వెంకటేశ్వ జూనియర్ ఒకేషనల్ కళాశాల విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న గత సంవత్సరం నుంచి ఫస్ట్ ఇయర్ సెకండ్ ఇయర్ సంబంధించిన విద్యార్థులకు ఫీజురీమెన్స్మెంట్, స్కాలర్షిప్ రాలేదని ఒక్కొక్క విద్యార్థితో పదివేలు వసూలు చేయాలని విద్యార్థులకు చెప్పడం జరిగింది విద్యార్థులు డబ్బులు చెల్లించలేదని కళాశాల గేటు బంద్ చేసి విద్యార్థులను కళాశాల లోపలికి వెళ్లకుండా తన ఇష్టం సారంగా విద్యార్థుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్న కళాశాల యాజమాన్యం మహిళా విద్యార్థుల పట్ల తన ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ చర్యలు తీసుకోవాలని అనేకసార్లు ఏఐఎస్ఎఫ్ కళాశాల ఎదుట ధర్నాలు నిర్వహించిన అదే ధోరణిలో కళాశాల యాజమాన్యం వెళ్లడం జరుగుతుందని వెంటనే హ కళాశాల యాజమాన్యం పైన చర్యలు తీసుకోని ఒక నెల రోజుల్లోపు ఇంటర్ బోర్డు ఎగ్జామ్స్ ఉన్నందున ఇదే సరైన సమయమని విద్యార్థుల వద్ద ఫీజుల దోపిడీకి పాల్పడుతూ వారిపై కక్ష సాధింపు చర్యలు చేస్తున్న ఎక్కడ పరీక్షల్లో ఫెయిల్ అయితాము అని విద్యార్థులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని కావున వెంటనే కళాశాల తెరిచి విద్యార్థులకు పాఠాలు బోధించాలని విద్యార్థులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా సౌకర్యాలు కల్పించాలని లేనిపక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు, పార్వతి, అంజలి, సోనీ, పూజ, అనిత, పూజమాని, మానస, సంధ్య, ప్రశాన, షాంపత్, సందీప్, పాల్గొన్నారు,

## అక్రిడిటేషన్ల జీవో సవరించాలి

**విశ్వంభర, మహబూబాబాద్:**



ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియావర్కింగ్ జర్నలిస్ట్ లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం అక్రీడిటేషన్ మంజూరీ చేసేలా తమ ద్వారా నివేదిక అందించాలనిమహబూబాబాద్ జిల్లాలో సెమినార్ కు వచ్చిన సందర్భంగా ప్రెస్ అకాడమీ చైర్మన్ కే.శ్రీనివాస్ రెడ్డికి తెలంగాణా స్టేట్ జర్నలిస్ట్ యూనియన్ జిల్లా అధ్యక్షులు చిర్రగోని ఉదయ్ ధీర్ కార్యదర్శి పోతుగంటి సతీష్ తో కలసి వినతిపత్రం అందించారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వంజారీ చేసిన జీవో వల్ల కొంతమంది వర్కింగ్ జర్నలిస్టులు ప్రభుత్వం అందించే అక్రీడిటేషన్ కార్డ్ కు దూరమయ్యేలా ఉందని కనుక కొన్ని సవరణలు చేసి అందరికీ న్యాయం జరిగేలా వర్కింగ్ జర్నలిస్టులకు ప్రభుత్వం సంక్షమ ఫలాలు అందేలా ప్రభుత్వాన్ని ఒప్పించేలా తమద్వారా నివేదిక అందించాలని మీడియా అకాడమీ చైర్మన్ కే.శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు.

## రేపటి నుంచి క్రీడాపోటీలు

**విశ్వంభర, త్రిపురారం;**



తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు, సీనియర్ పాత్రికేయులు,అధ్యాపకులు చల్లబట్ల వెంకట్రామ్ రెడ్డిజ్ఞాపకార్థం త్రిపురారం గ్రామంలో సంక్రాంతి సందర్భంగా తేదీ 09-01-2026 నుండి 12-01-2026 వరకు జిల్లాస్థాయి గ్రామీణ క్రికెట్ పోటీలు,పాటలపోటీలు ,ముగ్గుల పోటీలు (త్రిపురారం మహిళ లకు మాత్రమే) నిర్వహణ చేపట్టారు ఈ నిర్వహణ నిమిత్తం బుదవారం రోజున కరపత్రం విడుదల చేయడం జరిగింది..ఈ కారిక్రమంలో మాజీ సొసైటీ చైర్మన్ అనుముల నర్సిరెడ్డి, కసిరెడ్డి నరేష్,పోలిశెట్టి యాదగిరి,ఎనమల్లయ్య, డి.శివయ్య, యూత్ కాంగ్రెస్ గుండెబోయిన వేణు,పడిషల శేఖర్,సైది,మీసాల సతీష్,వలసాని శ్రీనివాస్,ఎస్. జాహింగిర్, పొలాగని సైదులు,శంకర్,కిషోర్ సర్పంచ్,రమేష్. పాల్గొన్నారు.

## రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

**విశ్వంభర, చింతపల్లి:**



రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలనిజిల్లా వైద్య ఆరోగ్య అధికారి(డిఎంహెచ్వో)డా.పుట్ల శ్రీనివాస్ మండలం లోని వీ.టీ.నగర్ ప్రా థమిక ఆరోగ్య కేంద్రాన్ని మరియు కుర్మేడు పల్లె దవాఖానాను ఆకస్మిక తనిఖీచేసిరికార్డులను పరిశీలించారు. మందుల నిల్వలను, ల్యాబ్ రికార్డులను ఆయన పరిశీలించారు. అనంతరం సిబ్బంది సమయపాలన పాటించాలని, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా.వంశీకృష్ణ, సూపర్వైజర్లు పద్మ, ఫార్మసిస్ట్ మాస రవి, ఎమ్మెల్హెచ్పి శోభ, ఏఎన్ఎం మార్తమ్మ మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## నూతన సంవత్సర కేలండర్ ఆవిష్కరణ

**విశ్వంభర, హనుమకొండ:**

ములుగు జిల్లా నేషనల్ హ్యూమన్ రైట్స్ కార్యాలయం లో నేషనల్ హ్యూమన్ రైట్స్ చిల్డ్రన్ అండ్ ఉమెన్ ఎంపవర్మెంట్ ఆర్గనైజేషన్ 2026 నూతన సంవత్సర క్యాలండర్ ను ములుగు జిల్లా ఎసిపి ఎ.కిషోర్ కుమార్ అవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిదిగా జాతీయ అధ్యక్ష లు చైర్మన్ ఎండి మొహినుద్దీన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏసిపి కిషోర్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ. ప్రజల కు వారి హక్కులకు భంగం కలగ కుండా చూడాలని, ప్రజలకు అన్యాయం జరగకుండా చూడాలని నేషనల్ హ్యూమన్ రైట్స్ సభ్యులకు తెలియపరచారు. నా వంతు సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కార్యాదర్శి ఆదేర్ల రాదాగోవింద. రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెల్లంకోండ శ్రీనివాసరావు. తెలంగాణ రాష్ట్ర లీగల్ సెల్ అడ్వయిజర్ ఫరాన సుల్తాన.రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బోర్ర కళ్యాణి పాషా తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## పేరుకు మాత్రమే గ్రామ సచివాలయం పనిచేసే ఉద్యోగులు మాత్రం ఎప్పుడూ ఉండరు

**విశ్వంభర,పెనకచేర్ల:**



పేరుకు మాత్రమే గ్రామ సచివాలయం అందులో పనిచేసే ఉద్యోగులు మాత్రం ఎప్పుడూ ఉండరు అంటున్న స్థానికులు అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం పేనకచర్ల గ్రామ సచివాలయం ఎప్పుడు మూసే ఉంటుందంటూ స్థానికులు వాపోతున్నారు. ఆన్లైన్ అప్లై చేసుకోవడానికి రైతు సమస్యల కోసం గ్రామస్తులు గార్లది న్నెకు వెళ్లి అప్లై చేసుకుంటున్నట్లు పోతున్న స్థానికులు సచివాలయం పని వేళలు దాటిపోయిన ఉద్యోగులకు మాత్రం సచివాలయం లో కనబడటం లేదు. సచివాలయంలో దాదాపు పదిమంది ఉద్యోగులు పనిచేస్తుంటారు.కానీ ఈ సచివాలయంలో ఒక్క ఉద్యోగం కూడా లేకుండా సచివాలయం కి గెడి పెట్టి ఎక్కడికి వెళ్లినట్లు సచివాలయం రాకుండా ఉద్యోగస్తులు ఫ్రీగా జీతాలు తీసుకుంటున్నారా?

## బండి సంజయ్‌ని కలిసిన మహాదేవపూర్ మండల బీజేపీ నాయకులు

**విశ్వంభర : మహాదేవపూర్:**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రానికి సంబందించిన పలు సమస్యల గురించి బీజేపీ కేంద్ర హోంశాఖ సహాయక మంత్రి బండి సంజయ్ కుమార్ దృష్టికి తీసుల్లిన మహాదేవ పూర్ మండల బీజేపీ నాయకులు, వారు స్పందించి సమస్యలు పరిష్కరిస్తానని, సంక్రాంతి పండుగ తరువాత మహాదేవపూర్ కు వస్తానని హామీ ఇవ్వడం జరిగింది, ఈ కార్యక్రమంలో బీజేపీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు కర్రె సంజీవ రెడ్డీ మహాదేవపూర్ బీజేపీ మండల అధ్యక్షులు రాంశెట్టి మనోజ్, జిల్లా కౌన్సిల్ నెంబర్ ఆకుల శ్రీధర్, మండల ప్రధానకార్యదర్శులు బల్ల శ్రావణ్ కుమార్, బొల్లం కిషన్, మండల కార్య దర్శి గోరె శ్రీకాంత్, ఒఎ సెల్ మండల అధ్యక్షులు బూడే శేఖర్, ఓబీసీ మోర్చ అధ్యక్షులు చాగర్ల రవీందర్, మండల నాయకులు కొక్కు రాకేష్, బూత్ అధ్యక్షులు గోక లక్ష్మణ్, పిట్టల మహేష్, పాల్గొన్నారు,

# కోళ్లు, మేకలవి ప్రాణాలు కావా: వీధికుక్కల అంశంపై సుప్రీం వ్యాఖ్యలు

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** వీధి కుక్కల వివాదంపై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. వీధి కుక్కల రక్షణపై పెద్ద మొత్తంలో పిటిషన్‌లు దాఖలు అవుతుండడంపై అసహనం వ్యక్తం చేసింది. "అందరూ కుక్కల గురించే ఆలోచిస్తుంటే..ఇతర జంతువుల జీవితాల సంగతేంటి? కోళ్లు, మేకల గురించి ఎందుకు మాట్లాడరు?వాటివి ప్రాణాలు కావా" అని ఈ కేసులో కుక్కల రక్షణపై వాదించిన సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్‌ను ప్రశ్నించింది. కుక్కలు కరవబోతున్నాయా లేదా అనే విషయాన్ని అవి దగ్గరకు వచ్చేంతవరకు తెలుసుకోలేమని వ్యాఖ్యానించింది. ఈ సమస్యకు చికిత్స కంటే నివారణే ముఖ్యమన్న అభిప్రాయం వ్యక్తం చేసింది. రోడ్లు, పాఠశాలల వద్ద కుక్కల వల్ల ప్రమాదాలు జరగడంపై సుప్రీం కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. విద్యాసంస్థలు, ఆస్పత్రులు, రైల్వే స్టేషన్లు తదితర ప్రదేశాల్లో కుక్కలు కరుస్తోన్న ఘటనలు పెరిగిపోతున్న నేపథ్యంలో వీధి కుక్కలకు సంతాన నిరోధక శస్త్రచికిత్సలు చేయాలని అధికారులను ఆదేశించింది. దీనిపై న్యాయవాది కపిల్ సిబల్ స్పందిస్తూ.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అన్ని దేశాల్లో కుక్కలకు టీకాలు వేయడం, స్టెరిలైజ్ చేయడం, షెల్టర్లు నిర్మించడం వంటి పద్ధతులతో వీధి కుక్కల సమస్య తగ్గుతోందని తెలిపారు. అయితే



భారత్‌లో ఈ పద్ధతులను సరైన విధంగా పాటించకపోవడం, వీధుల్లో చెత్త విపరీతంగా పేరుకుపోవడంతో వీటి బెడద తీవ్రమవుతోందన్నారు. జంతు సంక్షమ ఎన్‌జీవోల తరఫున హాజరైన న్యాయవాది కాలిన్ గోన్సాల్వ్స్ వాదిస్తూ.. దేశంలో కుక్కకాట్ల సంఖ్యను ఉన్నదానికంటే ఐదు రెట్లు ఎక్కువగా ప్రభుత్వ నివేదికలు చూపుతున్నాయని ఆరోపించారు. కుక్క కాటు ఇంజెక్షన్‌ల సంఖ్యను కూడా సరైన విధంగా లెక్కించట్లేదన్నారు. 2021 నుంచి 19 రాష్ట్రాల్లో రేబిస్ కేసులు లేవన్నారు.

## నిర్మలాసీతారామన్ పేరిట పెట్టుబడి వీడియోలు.. స్పందించిన ఫ్యాక్ట్ చెక్

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:**



కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ పేరిట కొన్ని పెట్టుబడి వీడియోలు వైరల్ అవుతున్నాయి. ఆమె కొన్ని పెట్టుబడి పథకాలకు ప్రచారం కల్పిస్తున్నట్టుగా వాటిల్లో ఉంది. దీనిపై ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరోకు చెందిన ఫ్యాక్ట్ చెక్ విభాగం స్పందించింది. "సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోన్న ఆ వీడియోలు నకిలీవి. ఎలాంటి పెట్టుబడి పథకాలను కేంద్రం కానీ, ఆర్థిక మంత్రికానీ ప్రోత్సహించడం లేదు. అధికారిక పోర్టళ్లు, ఆర్‌బీఐ, సెబీ వంటి నియంత్రణ సంస్థల ద్వారా ఇలాంటి ప్రచారంలోని నిజానిజాలను ధ్రువీకరించుకోవాలి. అలాంటి ప్రకటనల్లో కనిపించే లింక్స్‌ను క్లిక్ చేసేముందు పరిశీలించుకోవాలి. ఎవరికీ ఓటీపీ, బ్యాంకింగ్‌కు సంబంధించిన వ్యక్తిగత వివరాలను షేర్ చేయొద్దు" అని ప్రజలను హెచ్చరించింది.

# మైనర్లతో పాక్ గూఢచర్య నెట్‌వర్క్.. వెలుగులోకి కీలక విషయాలు

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:**

పాకిస్థాన్‌కు చెందిన నిఘా సంస్థ ఐఎస్ఐ కోసం గూఢచర్యం చేస్తున్న 15 ఏళ్ల బాలుడిని పఠాన్‌కోట్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు పలు కీలక విషయాలు వెల్లడించారు. భారత్‌కు చెందిన మైనర్లతో గూఢచర్యం నెట్‌వర్క్‌ను ఏర్పాటుచేయడానికి ఐఎస్ఐ ఏజెంట్లు కుట్ర పన్నినట్లు గుర్తించామన్నారు. ఇందులోభాగంగా జమ్మూకశ్మీర్, పంజాబ్, హరియాణాకు చెందిన పలువురు మైనర్లను ట్రాప్ చేసి, ఉగ్రవాదం వైపు ఆకర్షితులయ్యేలా వారు ప్రేరేపిస్తున్నారని తెలిపారు.ఇప్పటివరకు హరియాణా, పంజాబ్‌కు చెందిన 12 మంది, జమ్మూకశ్మీర్‌కు చెందిన 25 మంది మైనర్లను ఐఎస్ఐ ఏజెంట్లు ట్రాప్ చేసినట్లు గుర్తించామన్నారు. వారి కదలికలపై దర్యాప్తు బృందాలు నిఘా పెట్టినట్లు తెలిపారు. వీరంతా 14 నుంచి 17 ఏళ్లలోపు వారేనన్నారు. మొదట పాక్ హ్యాండ్లర్లు మైనర్ల ఫోన్‌లకు లింక్‌లు పంపిస్తున్నారని.. వాటిని క్లిక్ చేయగానే వారి ఫోన్‌లను క్లోన్ చేస్తున్నారని పేర్కొన్నారు. ముందుగానే వారి ఫోన్లు క్లోన్ చేసి ఉండడంతో బాలురు తమ ఫోన్‌లలో సేవ్ చేసిన కంటెంట్‌ను హ్యాండ్లర్లు సేకరిస్తున్నారన్నారు. ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్న బాలుడి ఫోన్‌ను స్కాన్ చేయగా అతడు పాక్‌కు చెందిన ఐఎస్ఐ ఆధారిత ఏజెన్సీలు, ఉగ్రవాద గ్రూపుల నిర్వాహకులతో పలుమార్లు సంప్రదింపులు జరిపినట్లు తేలిందన్నారు. వారి సూచనల ఆధారంగా అతడు సైనిక స్థావరాల వీడియోలను చిత్రీకరిస్తున్నట్లు, భద్రతా కాన్వాయ్‌ల కదలికలను లీక్ చేస్తున్నట్లు గుర్తించామన్నారు.



ఐఎస్ఐ ఏజెంట్లతో సంప్రదింపుల కోసం అతడు ఎన్‌క్రిప్టెడ్ యాప్‌లను కూడా వినియోగిస్తున్నట్లు తెలిపారు. ఇటువంటి ప్రమాదకర ముఠాల చేతిలో పడకుండా పిల్లలను రక్షించాలంటే.. తల్లిదండ్రులు తమ పిల్లల ఆన్‌లైన్ కార్యకలాపాలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

## ముసుగుతో వచ్చే కస్టమర్లకు ఆభరణాలు విక్రయించం

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:**



జ్యువెల్లరీ దుకాణాల్లో చోరీలను అరికట్టే ప్రయత్నంలో భాగంగా బిహార్‌లోని ఓ ఆభరణాల వర్తక సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. మాస్కులు, హిజాబ్, హెల్మెట్ వంటి వాటితో ముఖాలను కప్పుకొని షాపుల్లోకి వచ్చే కస్టమర్లకు ఆభరణాలు చూపించడం, విక్రయించకూడదని నిర్ణయించింది. దీనిని రాష్ట్రంలో తక్షణమే అమలు చేస్తున్నట్లు ఆ రాష్ట్ర ఆల్ ఇండియా జ్యువెల్లర్స్ అండ్ గోల్డ్‌స్మిత్ ఫెడరేషన్ విభాగం వెల్లడించింది."ముఖాలకు కప్పుకొని వచ్చే కస్టమర్లకు ఆభరణాలు విక్రయించవద్దని నిర్ణయించాం. హిజాబ్, మాస్కులు, హెల్మెట్ తదితర వాటితో ముఖం కనిపించకుండా షాపుల్లోకి వచ్చే వారికి విలువైన ఆభరణాలు చూపించం. వినియోగదారులు, జ్యువెల్లరీ యజమానుల భద్రతను దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నాం" అని ఏఐజేజీఎఫ్ రాష్ట్ర విభాగం అధ్యక్షుడు అశోక్ కుమార్ వర్మ వెల్లడించారు. ముఖాలకు ముసుగుతో వచ్చే వారిని గుర్తించే పరిస్థితి లేదని, ఏదైనా దొంగతనం జరిగినప్పుడు సీసీటీవీ ఫుటేజీల సాయంతో గుర్తుపట్టేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుందన్నారు. ముఖాలు కనిపించకుండా దుకాణాల్లోని ప్రవేశించి దొంగతనాలకు పాల్పడుతున్న ఘటనలు దేశవ్యాప్తంగా అనేకం చోటుచేసుకుంటున్నాయి. గతేడాది మార్చిలో ఇదే తరహాలో వచ్చిన కొందరు దుండగులు.. భోజ్‌పుర్‌జిల్లాలోని ఓ దుకాణంలో రూ.25కోట్ల ఆభరణాలను చోరీ చేశారు. నవంబర్‌లోనూ సివాన్ నగరంలో ఇటువంటి దోపిడీ జరిగిన విషయాన్ని స్థానిక వ్యాపారులు గుర్తుచేశారు.

# బీజేపీ- కాంగ్రెస్ మధ్య పొత్తు.. ఆ ఎన్నిక కోసం ప్రత్యేక కూటమి..!

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:**

రాజకీయ ప్రత్యర్థులైన బీజేపీ- కాంగ్రెస్ పార్టీలు జట్టు కట్టాయి. వినడానికి వింతగా ఉన్నా ఇది నిజం. మహారాష్ట్రలోని అంబర్‌నాథ్ ప్రాంతానికి మేయర్ ఎన్నిక కోసం ఈ రెండు పార్టీలు చేతులు కలిపాయి. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే నేతృత్వంలోని శివసేనకు అధికారం దక్కకుండా ఉండేందుకు ఈ అరుదైన కూటమి ఏర్పాటయ్యింది. కూటమిలోని 32 మంది కౌన్సిలర్ల మద్దతుతో బీజేపీకి చెందిన తేజశ్రీ కరంజులే ఇక్కడ మేయర్ పదవిని చేజిక్కించుకున్నారు. వీరిలో 16 మంది భాజపా, 12 మంది కాంగ్రెస్, నలుగురు ఎన్సీపీ (అజిత్ పవార్ వర్గం)కి చెందిన వారు ఉన్నారు. మేయర్ పదవి కోసం కాంగ్రెస్‌తో భాజపా చేతులు కలపడంపై శిందేకు చెందిన శివసేన పార్టీ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఎప్పుడూ కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా మాట్లాడే ఆ పార్టీ.. ఇప్పుడు పొత్తు పెట్టుకోవడాన్ని శివసేన ఎమ్మెల్యే బాలాజీ కినికార్ ప్రశ్నించారు. ఇది తమకు వెన్నుపోటు పొడవడవేనని ఆరోపించారు. అయితే, ఈ విమర్శలను భాజపా ఉపాధ్యక్షుడు గులాబ్రావ్ కరంజుల్ పాటిల్ కొట్టిపారేశారు. అంబర్‌నాథ్‌లో శివసేనతో పొత్తుకు తమ పార్టీ ఎన్నో ప్రయత్నాలు చేసిందన్నారు. కానీ, దానినుంచి సానుకూలమైన స్పందన రాలేదన్నారు. ఈ సందర్భంగా శిందే పార్టీపై అవినీతి ఆరోపణలు చేశారు. కాగా.. కొన్ని వారాల క్రితం ఇక్కడ స్థానిక ఎన్నికలు జరిగాయి.

**ఆ వార్తల్లో నిజం లేదు: కాంగ్రెస్ నేత..**

అంబర్‌నాథ్ మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ-కాంగ్రెస్ పొత్తు పెట్టుకున్నాయన్న వార్తలను హస్తం పార్టీ



నేత సచిన్ సావంత్ తోసిపుచ్చారు. స్థానిక స్థాయిలో శిందే శివసేన పార్టీ అవినీతిపై పోరాడేందుకు పలు పార్టీల నేతలు కలిసివచ్చారన్నారు. ఇందులో స్వతంత్రులు కూడా ఉన్నారని చెప్పారు. భాజపా-కాంగ్రెస్ పొత్తుపెట్టుకున్నాయన్న వార్తలు అవాస్తవమని వెల్లడించారు.

## ఎక్కడో కూర్చొని... ఉచిత సలహాలు ఇస్తుంటారు: జైశంకర్

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:**



పాకిస్థాన్ ఉగ్ర దాడులకు ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టిన సమయంలో పశ్చిమ దేశాలు కపటత్వం ప్రదర్శించడంపై విదేశాంగ మంత్రి జై శంకర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు . తమకు వేల మైళ్ల దూరంలో ఉన్న ఆ దేశాలు ఉద్రిక్తతల సమయంలో ఆందోళన చెందినట్లు చెప్పాయని.. కానీ అవేవీ తమ సొంత ప్రాంతంలో జరుగుతున్న వాటిని పట్టించుకోవడం లేదని విమర్శించారు. ల్బంబర్గ్‌లోని భారత కమ్యూనిటీ సభ్యులతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. సాయం చేయాలనుకునే వారితో కలిసి పని చేసేందుకు భారత్ సిద్ధంగా ఉంటుందని జైశంకర్‌పేర్కొన్నారు. అదే.. పాకిస్థాన్‌లా ప్రవర్తిస్తే మాత్రం వాటికి అలాగే సమాధానం చెబుతామని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ప్రపంచంలోని ఇతర ప్రాంతాల్లో జరిగే పరిణామాలు దేనిని ఏమేరకు ప్రభావితం చేస్తాయో చెప్పడం కష్టమన్నారు. ఆలోచన లేకుండా ఎక్కడో దూరంగా కూర్చొన్నవారు.. ఉచిత సలహాలు ఇస్తున్నారని, అవి కొన్నిసార్లు స్వార్థంగా, నిర్లక్ష్యంగా ఉంటున్నాయన్నారు. ప్రస్తుతం చాలా దేశాలు తమ స్వార్థం కోసం మాత్రమే పని చేస్తున్నాయన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో ఎలా వ్యవహరించాలనే దానిపై పలు దేశాలు భారత్‌కు సలహాలు ఇచ్చాయన్నారు. కానీ అవేవీ పట్టించుకోకుండా దేశ భద్రత కోసం భారత్ ముందుకుసాగిందన్నారు.

# రష్యా నుంచి భారత్‌కు.. రూ.15 లక్షల కోట్ల చమురు దిగుమతి

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:**

ఉక్రెయిన్‌తో యుద్ధం మొదలైన దగ్గరి నుంచి డిస్కౌంట్ ధరకు లభిస్తోన్న రష్యా చమురును భారత్ కొనుగోలు చేస్తోన్న సంగతి తెలిసిందే . అప్పటినుంచి 144 బిలియన్ యూరోల (రూ.15 లక్షల కోట్ల విలువైన) క్రూడ్ ఆయిల్‌ను దిగుమతి చేసుకుంది. దిగుమతి చేసుకున్న మొత్తం శిలాజ ఇంధనాల విలువ 162.5 బిలియన్ యూరోలుగా ఉంది. ఈ మేరకు ఐరోపా సంస్థ సెంటర్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఎనర్జీ అండ్ క్లీన్‌ఎయిర్ వెల్లడించింది. అలాగే ఫిబ్రవరి, 2022 (యుద్ధం మొదలైన ఏడాది) నుంచి ప్రపంచ దేశాలకు చమురు అమ్మడం ద్వారా రష్యా ఒక ట్రిలియన్ యూరోల ఆదాయాన్ని పొందిందని అంచనా వేసింది. రష్యా రాయితీ ధరలకు చమురును విక్రయించడం ప్రారంభించడంతో చైనా తర్వాత మన దేశం అతిపెద్ద దిగుమతిదారుగా మారింది. ఫలితంగా మొత్తం మన చమురు దిగుమతుల్లో రష్యా వాటా 1% నుంచి 40 శాతానికి చేరింది. ఇక చైనా 210.3 బిలియన్ యూరోల చమురును కొనుగోలు చేసిందని సీఆర్ఈఏ వెల్లడించింది. గ్యాస్, బొగ్గు దిగుమతులతో కలిపి ఆ మొత్తం 293.7 బిలియన్ యూరోలుగా ఉందని తెలిపింది.ఈ దిగుమతులపై అమెరికా , దాని మిత్ర దేశాలు గగ్గోలు పెడుతోన్న సంగతి తెలిసిందే. ఈ కొనుగోళ్ల ద్వారా ఉక్రెయిన్‌తో యుద్ధంలో రష్యాకు భారత్ ఆర్థికంగా సహకరిస్తుందని మిత్ర దేశాలు ఆరోపించాయి. పుతిన్ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు ఆయిల్ ఉత్పత్తిదారులైన లుకోయిల్, రాస్‌నెఫ్ట్‌పై అమెరికా ఆంక్షలు విధించిన



సంగతి తెలిసిందే. భారత్‌పై నిందలు మోపిన ఐరోపా యూనియన్ దేశాలు.. ఈ నాలుగేళ్లలో రష్యా శిలాజ ఇంధనాల దిగుమతులపై 218.1 బిలియన్ యూరోలు వెచ్చించడం గమనార్హం.

## బంగ్లాదేశ్‌కు పాకిస్థాన్ యుద్ధ విమానాలు!



విశ్వంభర, నేషనల్ బ్యూరో: బంగ్లాదేశ్‌లో మాజీ ప్రధాని షేక్ హసీనా పాలన ముగిసిన తర్వాత పాకిస్థాన్‌తో అనేక రంగాల్లో సంబంధాలను బలోపేతం చేసుకునేందుకు పొరుగు దేశం ప్రయత్నిస్తోన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో కీలక ఒప్పందాలు చేసుకుంటోంది. తాజాగా పాక్ నుంచి యుద్ధ విమానాలను కొనుగోలు చేసేందుకు బంగ్లా సిద్ధమవుతోంది. ముఖ్యంగా చైనా, పాకిస్థాన్‌లు సంయుక్తంగా అభివృద్ధి చేసిన జేఎఫ్-17 యుద్ధ విమానాలను కొనుగోలు చేసేందుకు బంగ్లాదేశ్ ఆసక్తిగా ఉందని పాక్ సైన్యం మీడియా విభాగం వెల్లడించింది.బంగ్లాదేశ్ ఎయిర్‌ఫోర్స్ చీఫ్ మార్షల్ హసన్ మొహ్మద్ ఖాన్, పాకిస్థాన్ ఎయిర్‌ఫోర్స్ చీఫ్ మార్షల్ జహీర్ అహ్మద్ బాబర్ సిద్ధూలు ఇస్లామాబాద్‌లో ఇటీవల భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జేఎఫ్-17 యుద్ధ విమానాల సేకరణపై విస్తృత స్థాయి చర్చలు జరిగినట్లు పాక్ సైన్యం వెల్లడించింది. అత్యాధునిక యుద్ధ విమానాల పనితీరుతోపాటు ప్రాథమిక స్థాయి నుంచి అధునాతన సాంకేతికతపై వివిధ సైనిక కేంద్రాల్లో సమగ్ర శిక్షణ అందిస్తామని పాకిస్థాన్ బంగ్లాకు హామీ ఇచ్చింది. ఈ క్రమంలో మొహ్మద్ ఖాన్ నేతృత్వంలోని బంగ్లా బృందం ఆయా కేంద్రాల్లోనూ పర్యటించి పరిశీలించింది. సూపర్ ముష్షాక్ శిక్షణా విమానంతోపాటు శిక్షణకు కావాల్సిన మొత్తం వ్యవస్థను వేగంగా అందిస్తామని బంగ్లాకు పాక్ సైన్యం హామీ ఇచ్చిందట.పాకిస్థాన్ నుంచి 1971లో బంగ్లాదేశ్ స్వాతంత్ర్యం పొందిన విషయం తెలిసిందే. అయితే, నాటి యుద్ధంలో పాక్ దళాలకు సాయం చేశారని ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి సంబంధించి షేక్ హసీనా ప్రభుత్వం 2010లో విచారణ చేపట్టింది. దీంతో ఇరుదేశాల సంబంధాలు దెబ్బతిన్నాయి. గతేడాది యూనస్ సారథ్యంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి ఆ రెండు దేశాల సంబంధాలు మళ్లీ చిగురించాయి.

## ప్లీజ్ డొనాల్డ్ అంటూ.. మేక్రాన్ నన్ను ప్రాధేయపడ్డారు: ట్రంప్

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:**

ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మేక్రాన్ ను ఉద్దేశించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హేళనగా మాట్లాడారు. ప్లీజ్ డొనాల్డ్ అంటూ మేక్రాన్ ప్రాధేయపడ్డారని రిపబ్లికన్ చట్టసభ సభ్యుల సమావేశంలో మాట్లాడుతూ వ్యాఖ్యలు చేశారు. గతంలో జరిగిన సమావేశం గురించి ప్రస్తావించారు."ఫ్రాన్స్ ఔషధ ధరలను మూడింతలు పెంచాలని మేక్రాన్‌ను అడిగాను. ఆయన అందుకు తొలుత అంగీకరించలేదు. దాంతో ఆ దేశం నుంచి



దిగుమతి అవుతోన్న వస్తువులపై 25 శాతం టారిఫ్‌లు విధిస్తానని హెచ్చరించాను. దాంతో మన డిమాండ్లను అంగీకరించాల్సి వచ్చింది. అప్పుడు మేక్రాన్ మాట్లాడుతూ.. 'డొనాల్డ్ మన మధ్య ఒప్పందం ఉంది. ఔషధాల ధరలను మీకు కావాల్సినంత పెంచుతాను. కానీ మా ప్రజలకు చెప్పకండి' అని ప్రాధేయపడ్డారు" అంటూ ట్రంప్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 10 డాలర్లు ఉన్న ఒక మందుబిళ్ల ధరను ఫ్రాన్స్ 30 డాలర్లకు పెంచిందన్నారు. ఫ్రాన్స్ ఔషధాల ధరలు తక్కువగా ఉండటంతో అమెరికాలో ఎక్కువ విక్రయమయ్యేవి. దీంతో అమెరికా కంపెనీలకు నష్టం వాటిల్లేది. ట్రంప్ సూచన మేరకు ఫ్రాన్స్ ఆ ధరలు పెంచడంతో అమెరికాలో స్థానిక కంపెనీల ఔషధాలకు డిమాండ్ పెరిగిందని వైద్యరంగ నిపుణులు విశ్లేషించారు. అయితే ట్రంప్ వ్యాఖ్యలపై మేక్రాన్ కానీ, ఫ్రాన్స్ ప్రభుత్వం నుంచి కానీ ఎలాంటి స్పందనారాలేదు. ఇదిలా ఉంటే.. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందుకు భారత్‌పై తాము విధించిన సుంకాల కారణంగా భారత ప్రధాని నరేంద్రమోదీ అంత ఆనందంగా లేరని ట్రంప్ ఇటీవల పేర్కొన్న విషయం తెలిసిందే.

## వీసా ప్రత్యేక సౌకర్యం మాత్రమే.. హక్కు కాదు: యూఎస్ ఎంబసీ

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:**




పలు కారణాలతో విదేశీ విద్యార్థుల వీసాలను రద్దు చేస్తూ.. వారిని దేశం నుంచి బహిష్కరిస్తోన్న అమెరికా తాజాగా మరో హెచ్చరిక చేసింది. అమెరికాలో చదువుతోన్న భారత విద్యార్థులు అక్కడి చట్టాలను ఉల్లంఘిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని వార్నింగ్ ఇచ్చింది. యూఎస్ వీసా అంటే ప్రత్యేక సౌకర్యం మాత్రమేనని హక్కు కాదని స్పష్టం చేసింది. ఈ మేరకు భారత్‌లోని అమెరికా ఎంబసీ ప్రకటన జారీ చేసింది. అమెరికాలో ఉంటూ చట్టాల ఉల్లంఘనకు పాల్పడిన కేసులో విదేశీ విద్యార్థులు అరెస్టు అయితే..వారి వీసాలు రద్దు కావొచ్చని తెలిపింది. అమెరికా నుంచి బహిష్కరించి.. భవిష్యత్తులో యూఎస్ వీసాలు పొందడానికి అనర్హులుగా ప్రకటించే అవకాశం కూడా ఉందని హెచ్చరించింది. కాబట్టి అమెరికాలో ఉండే భారత విద్యార్థులు అక్కడి ప్రభుత్వ చట్టాలను, నియమాలను పాటిస్తూ.. జాగ్రత్తగా ఉండాలని సూచించింది. విదేశీ విద్యార్థుల వీసాలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వరసగా కఠిన ఆంక్షలు విధిస్తోన్న నేపథ్యంలో భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం విద్యార్థులకు ఈ హెచ్చరికలు చేయడం గమనార్హం.

# నీళ్లపై రాజకీయాలు చేయొద్దని తెలంగాణను కోరుతున్నా: సీఎం చంద్రబాబు

**విశ్వంభర, పోలవరం:**
గోదావరి నదిలో పుష్కలంగా నీళ్లు ఉన్నాయి.. పోలవరానికి అభ్యంతరం చెప్పడం సరికాదని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. పోలవరం నిర్మాణ పనులను పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.. "సముద్రంలో కలిసే నీళ్లు ఎవరైనా వాడుకోవచ్చు. నీటి విషయంలో రాజకీయాలు చేయవద్దని తెలంగాణను కోరుతున్నా. రాజకీయ నేతలు పోటీపడి మాట్లాడటం సరికాదు. అక్కడి ప్రజలు కూడా ఆలోచించాలి. తెలుగు జాతి ఒక్కటే.. ఇచ్చిపుచ్చుకునే ధోరణి ఉండాలి. ఇద్దరి మధ్య విరోధాలు పెరిగి ఆనందించే పరిస్థితి రాకూడదు. భావోద్వేగాలతో ఆటలు ఆడటం మంచిది కాదు. ప్రజల కోసం రాజకీయాలు చేస్తే మంచిదే. ఆర్టీఎస్‌లో నీళ్లు రాకుంటే జూరాల నుంచి నీళ్లు తెచ్చి మహబూబ్‌నగర్‌కు ఇచ్చాం. దేవాదుల, కల్వకుర్తి నేనే ప్రారంభించా. దేవాదులను మరింత ముందుకు తీస్కుళ్లండి..ఎవరు వద్దన్నారు? ఈమధ్య కొందరి మాటలు చూస్తే.. రాజకీయాలు నాకే అర్థం కాలేదు. గోదావరి నదికి ఎగువన దేవాదుల ప్రాజెక్టు ఉంది. దేవాదుల నుంచి నీళ్లు వస్తే పోలవరానికి వస్తాయి. కిందకు వచ్చే నీళ్లకు మీరు అభ్యంతరం చెబితే ఏమైనా అర్థం ఉందా? ఆరోజు మంజీరాకు నీళ్లు తీస్కుళ్లారు.. అప్పుడు స్వాగతించాం. గోదావరి నదిలో పుష్కలంగా నీళ్లు ఉన్నాయి.. పూర్తి చేసుకోండి. దేవాదులకు మేం ఎప్పుడూ అభ్యంతరం చెప్పలేదు. నీళ్లు పొదుపు చేస్తే తెలంగాణకు కూడా లబ్ధి కలుగుతుంది. మిగిలిన నీరు సాగర్, శ్రీశైలంలో నిల్వ చేస్తే తెలంగాణ కూడా వాడుకోవచ్చు. కృష్ణా నదిలో నీళ్లు తక్కువ ఉన్నప్పుడు పైన ప్రాజెక్టులు కడితే నష్టం. కృష్ణా డెల్టాను కాపాడి గోదావరిని అనుసంధానం చేసుకుంటే ఇబ్బంది ఉండదు. రాయల సీమ ఎత్తిపోతలపై చేసిన వ్యాఖ్యల్లో అర్థం లేదు. అబద్ధాన్ని వందసార్లు చెబితే నిజం అవుతుందని భావిస్తున్నారు. సముద్రం లోకి వెళ్లే నీటిని అడ్డుకుంటే లాభాలు ఉంటాయి..నష్టాలు ఉంటాయి.



**వైసీపీ వల్లే పోలవరం ఆలస్యం..**
గత వైకాపా ప్రభుత్వం వల్లే ఆంధ్రప్రదేశ్ జీవనాడి పోలవరం ప్రాజెక్టు పూర్తి కావడానికి ఆరేడు ఏళ్లు ఆలస్యమైంది. ఐఐటీ హైదరాబాద్ నిపుణులు చెప్పాకే డయాఫ్రం వాల్ పాడైందని గత ప్రభుత్వంలోని వారికి తెలిసింది. భవిష్యత్తులో వచ్చే విపత్తులను దృష్టిలో ఉంచుకొని కొత్త డయాఫ్రం వాల్ కడుతున్నాం. ఫిబ్రవరి 15కల్లా డయాఫ్రం వాల్ పూర్తి చేస్తాం. రాయలసీమ ఎత్తిపోతలపై ఇష్టానుసారం మాట్లాడుతున్నారు. అనుమతులు లేని ప్రాజెక్టులు ప్రారంభించి రూ.2వేల కోట్లు ఖర్చు పెట్టారు. ఎన్జీటీకి రూ.100 కోట్ల జరిమానా కట్టారు. ముచ్చుమర్రి ఇప్పటికే ఉంది.. అక్కడి నుంచి నీళ్లు తెచ్చుకోవచ్చు. వైకాపా పాలనలో జరిగిన అక్రమాలపై దర్యాప్తు జరుగుతోంది. కేవలం దర్యాప్తుల పేరుతోనే కాలయాపన చేస్తే చాలా కాలం పడుతుంది. వైకాపా కుప్పకూల్చిన వ్యవస్థలను గాడిలో పెడుతున్నాం" అని సీఎం అన్నారు. సమావేశంలో జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# తిరుమల పవిత్రతను దెబ్బతీసే కుట్ర.. కేసు ఛేదించిన తిరుపతి పోలీసులు

**విశ్వంభర, తిరుపతి:**
తిరుమల పవిత్రతను దెబ్బతీయాలని కొందరు చేసిన కుట్రను పోలీసులు ఛేదించారు. "తిరుమలలో మద్యం బాటిళ్లు దర్శనం. పోలీసు అతిథిగృహం సమీపంలో పదుల సంఖ్యలో మద్యం సీసాలు. నిద్రపోతున్న నిఘా. మద్యం మత్తులో గతంలో అనేక మార్లు ఘర్షణ జరిగినా మేల్కోని భద్రత వ్యవస్థ. అలిపిరి టోల్‌గేట్ ద్వారా నిత్యం తిరుమలకు మద్యం" అంటూ కొన్ని ఫొటోలతో ఈనెల 4న సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరిగింది. దీనిపై స్పందించిన తితిదే, పోలీసు, విజిలెన్స్ విభాగాలు అప్రమత్తమై దర్యాప్తు చేపట్టాయి. వివిధ బృందాలుగా ఏర్పడిన పోలీసులు సాంకేతిక ఆధారాలతో పూర్తి స్థాయి దర్యాప్తు చేయగా.. అసలు విషయం వెలుగు చూసింది.తిరుపతికి చెందిన వైసీపీ కార్యకర్త ఆళ్లపాక కోటి మరికొందరితో కలిసి తిరుపతి నుంచి ఖాళీ మద్యం సీసాలను తీసుకొచ్చి కౌస్తుభం అతిథి గృహం కాంపౌండ్ వాల్ బయట చెట్ల పొదల్లో పడేశారు. ఆ తర్వాత ఈనెల 4న తిరుమలకు వచ్చి ముందస్తు ప్లాన్‌లో భాగంగా కోటి, నవీన్‌కు తెలపగా.. నవీన్ వెంటనే మోహన్ కృష్ణకు చెప్పాడు. మోహన్‌కృష్ణ తాను పనిచేస్తున్న సాక్ష పత్రిక ఫొటో గ్రాఫర్లు గిరి, ప్రసాద్, ముకేష్‌లను అక్కడికి పంపి వారి ద్వారా వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు.
దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఎక్సైజ్ అధికారుల సహకారంతో ఖాళీ సీసాలపై ఉన్న ఆధారాల ద్వారా కొనుగోలు చేసిన దుకాణాలను గుర్తించారు. సీసీ టీవీ ఫుటేజీ, వాహనాల రాకపోకలు, ఫాస్టాగ్ పాటు ఇతర సాంకేతిక ఆధారాలు సేకరించి నిందితులను అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు. ఈ కేసులో ఏ1 ఆళ్లపాక కోటి, ఏ2 మోహన్ కృష్ణ అరెస్టు చేసి.. వారి నుంచి రెండు సెల్‌ఫోన్లు, కారు, ల్యాప్‌టాప్ స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. దర్యాప్తులో భాగంగా సెల్‌ఫోన్లను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపినట్టు తెలిపారు. కుట్రలో పాలుపంచుకున్న నవీన్ పరారీలో ఉన్నట్టు చెప్పారు. తితిదే ప్రతిష్ఠను దెబ్బతీయాలనే నిందితులు ఈ దుశ్చర్యకి పాల్పడినట్టు పోలీసులు గుర్తించారు.



**కరుణాకర్‌రెడ్డి కుట్రలు బయటపడ్డాయ్: బీఆర్ నాయుడు..**
తిరుమల పవిత్రతను దెబ్బతీసేందుకు వైకాపా నేత కరుణాకర్‌రెడ్డి కుట్ర పన్నుతున్నారని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు ఆరోపించారు. తిరుమలకు మద్యం సీసాలు తీసుకొచ్చి, ఫొటోలు, వీడియోలు తీసి సోషల్ మీడియాలో పెట్టిన వైకాపా కార్యకర్తల పాపం పండిందన్నారు. భక్తుల మనోభావాలను దెబ్బతీయడానికి ప్రయత్నించిన వైకాపా సోషల్ మీడియా ,సాక్ష మీడియా ప్రతినిధిని అరెస్టు చేసినట్లు చెప్పారు. తితిదేను, ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు పని గట్టుకొని భూమన కరుణాకర్ రెడ్డి తన మనుషుల చేత తితిదేపై నిత్యం అసత్య ప్రచారాలు చేసి, ఇవాళ దొరికిపోయారన్నారు."భూమన కరుణాకర్ రెడ్డికి దేవుడంటే భయం లేదు, భక్తి లేదు. అలాంటి వ్యక్తి పనిగట్టుకొని తన ప్రైవేటు సైన్యాన్ని నియమించి తితిదేపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాడు. వైకాపా సోషల్ మీడియా, కరుణాకర్ రెడ్డి చేస్తున్న కుట్రలు నేటితో బయటపడ్డాయి. మీ మీడియా వ్యక్తిని ప్రోత్సాహంచి దొంగలా దొరికి పోయావు. తిరుమలపై జరుగుతున్న కుట్రలకు భాధ్యుడు కరుణాకర్ రెడ్డి. మొదట ఆయన్నే అరెస్టు చేయాలి" అని బీఆర్ నాయుడు అన్నారు.

# రాజధాని రైతులకు రుణమాఫీ: మంత్రి నారాయణ

**విశ్వంభర, అమరావతి:**
రాజధాని నిర్మాణం కోసం సేకరించిన భూమిని త్వరగా అభివృద్ధి చేస్తామని ఏపీ మంత్రి నారాయణ తెలిపారు. మూడేళ్లలో అంతర్జాతీయ విమానాశ్రయం, క్రీడా ప్రాంగణం పూర్తిచేయాలని సీఎం చెప్పార న్నారు. తుళ్లూరు మండలం వడ్డమానులో రెండో విడత భూ సమీకరణ ప్రక్రియను ప్రారంభించిన సందర్భంగా మంత్రి మాట్లాడారు. రాజధాని ప్రాంత రైతులకు రుణమాఫీ చేయాలని ఎమ్మెల్యే శ్రావణకుమార్ కోరారన్నారు. ఇప్పుడే సీఎం చంద్రబాబుతో మాట్లాడానని.. దానికి ఆయన అంగీకరించారని చెప్పారు. ఈనెల 6వ తేదీ వరకు తీసుకున్న రుణాలను మాఫీ చేస్తామని మంత్రి ప్రకటించారు. రూ.1.50లక్షల వరకు దీన్ని వర్తింపజేస్తామని తెలిపారు. రైతుల కౌలు పెంచేందుకు సీఎం ప్రాథమికంగా అంగీకరించారని మంత్రి చెప్పారు.

**జగన్‌కు ప్రజలు బుద్ధి చెప్పారు: ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్..**
రాజధాని నిర్మాణానికి అడ్డుపడిన జగన్‌కు ఎన్నికల్లో ప్రజలు బుద్ధిచెప్పారని తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ అన్నారు. ఆయన చేసిన అన్యాయంపై రైతులు నిరసన తెలిపారని చెప్పారు. రాజధానిలో రెండో విడత భూసమీకరణ సందర్భంగావడ్డమానులో నిర్వహించిన గ్రామసభలో ఎమ్మెల్యే మాట్లాడారు.ఆర్థికపరమైన అంశాల్లో కేంద్రాన్ని ఒప్పించి సీఎంచంద్రబాబు నిధులుతీసు కొచ్చారన్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి అన్ని విధాలుగా ఆయన కృషి చేస్తున్నారని చెప్పారు. రాజధాని అభివృద్ధిని వైకాపాప్రభుత్వం అడ్డుకుందని..ఇకనైనా అసత్యప్రచారాలు మానుకోవాలనిహితవు పలికారు.



## పెద్ద పెద్ద కంపెనీలకు తక్కువ ధరకు భూములు ఇస్తే తప్పేంటి?: నారా లోకేశ్

**విశ్వంభర, విశాఖపట్నం:**



అమరావతికి చట్టబద్ధత ఉంది కాబట్టే గత ప్రభుత్వం రాజధానిని తరలించలేకపోయిందని ఏపీ మంత్రి నారా లోకేశ్ అన్నారు. విశాఖపట్నంలో మీడియాతో లోకేశ్ మాట్లాడారు. ఇచ్ఛాపురం నుంచి కుప్పం వరకూ పెట్టుబడులు వస్తున్నాయని తెలిపారు. పెట్టుబడుల విషయంలో దేశంలోనే టాప్‌లో ఉన్నామని గుర్తు చేశారు."అమరావతికి మంచి విమానాశ్రయం కావాలి.. అందుకే భూసేకరణ చేస్తున్నాం. ప్రాజెక్టుల పూర్తికి సమయం పడుతుంది. శ్రీకాకుళం నుంచి అనకాపల్లి వరకు వేగంగా అభివృద్ధి జరుగుతోంది. ఎకరం 99 పైసలకే ఇస్తున్నారంటూ కొందరు ఆరోపణలు చేస్తున్నారు. పెద్ద పెద్ద కంపెనీలకు తక్కువ ధరకు భూములు ఇస్తే తప్పేంటి. రాష్ట్రంలో పెట్టుబడులు పెరగాలి.. మన యువతకుఉద్యోగాలు రావాలి. ఆర్థిక రాజధాని విశాఖే. అందుకే ఇక్కడకి పెట్టబడులు వస్తు న్నాయి. విశాఖకు ఐటీ, ఫార్మా, డేటా సెంటర్, స్టీల్ సిటీలు వస్తున్నాయి. అన్ని ప్రాంతాలనూ అభివృద్ధి చేయాలనేదే కూటమి ప్రభుత్వ విధానం. సామాజిక మాధ్యమాల్లో వేధింపులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవు. చట్టాన్ని ఉల్లంఘించిన ఎవరినీ వదిలిపెట్టం" అని లోకేశ్ స్పష్టం చేశారు.

**నీటి వివాదంపై..**
"సముద్రంలో కలిసే వేల టీఎంసీలు కాపాడి రాయలసీమకు తీస్కుళ్తే తప్పేంటి? తెలంగాణ ప్రాజెక్టులకు మేం ఎక్కడా చిల్లు పెట్టలేదు. మిగిలిన నీళ్లను తెలంగాణ వాడుకోవచ్చు.. చెన్నైకు ఇవ్వొచ్చు. గతంలో పట్టిసీమ దండగని జగన్ అన్నారు. దాన్నే ఐదేళ్లు వాడుకున్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిన బాధ్యత మాపై ఉంది" అని మంత్రి లోకేశ్ అన్నారు.

## పీపీపీ మోడల్ ఆసుపత్రులు.. ప్రభుత్వ ఆధ్వర్యంలోనే ఎన్ఎంసీ ఛైర్మన్ అభిజిత్

**విశ్వంభర, విజయవాడ:**
వైద్య కళాశాలల గుర్తింపు ప్రక్రియను సరళతరం చేయనున్నామని జాతీయ వైద్యమండలి ఛైర్మన్ అభిజిత్ సేథ్ తెలిపారు. కౌన్సెలింగ్ ప్రక్రియలో అనవసర ఆలస్యాన్ని నివారించనున్నట్టు చెప్పారు. విజయవాడలోని ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వ విద్యాలయంలో వైస్ ఛాన్సలర్ చంద్రశేఖర్, రిజిస్ట్రార్ రాధికారెడ్డితో కలిసి అభిజిత్ సేథ్ మీడియా సమావేశంలో మాట్లాడారు. పీపీపీ మోడల్‌లో నిర్వహించే ఆసుపత్రులు ప్రభుత్వ ఆధీనంలోనే ఉంటాయని, పీపీపీ విధానం ద్వారా రోగులకు చికిత్స ఉచితంగా లేదా రాయితీపై అందుతుందని స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు, ఎన్ఎంసీ నిబంధనల ప్రకారం 50శాతం సీట్లు రాష్ట్ర మెరిట్ కోటా కింద భర్తీ అవుతాయని చెప్పారు. మిగిలిన 50శాతం సీట్లను ప్రైవేట్ యాజమాన్యం ఉపయోగించుకోవచ్చన్నారు. ప్రస్తుతం పీపీపీ విధానం అమలనేది రాష్ట్ర ప్రభుత్వాల చేతుల్లో ఉందని, గుజరాత్ వంటి రాష్ట్రాల్లో ఈ విధానం ఇప్పటికే విజయవంతంగా కొనసాగుతోందని చెప్పారు. లాభాపేక్ష లేని కంపెనీలకు మాత్రమే గతంలో వైద్య కళాశాలల ఏర్పాటుకు అనుమతి ఉండేదని, ఇటీవల జరిగిన బోర్డు సమావేశంలో ఈ నిబంధనను తొలగించారని అభిజిత్ సేథ్ చెప్పారు. కార్పొరేట్ కంపెనీలు సైతం పీపీపీ ద్వారా వైద్యకళాశాలలు ఏర్పాటు చేయవచ్చన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు కలిసి పని చేయడం వల్ల అందుబాటులో ఉన్న వనరుల వినియోగం జరుగుతుందని అభిజిత్ సేథ్ చెప్పారు.



## ప్రముఖ ప్లాస్టిక్ సర్జన్ డీఎల్ఎన్ ప్రసాద్ కన్నుమూత

**విశ్వంభర, హైదరాబాద్:** ప్రముఖ ప్లాస్టిక్ సర్జన్ డీఎల్ఎన్ ప్రసాద్ (91) కన్నుమూశారు. అనారోగ్య కారణాలతో హైదరాబాద్‌లోని తన నివాసంలో బుధవారం తుదిశ్వాస విడిచారు. దక్షిణ భారతదేశంలో ప్రముఖ ప్లాస్టిక్ సర్జన్‌గా ప్రసాద్ పేరుగాంచారు. ఆయన సతీమణి ఇందిర, కుమార్తె గోగినేని ఉమ గతంలో తెనాలి ఎమ్మెల్యేలుగా పనిచేశారు.



## విద్యారంగ సమస్యలపై ముఖ్యమంత్రి హామీ

**విశ్వంభర, విజయవాడ:**




రాష్ట్రంలో విద్యారంగ సమస్యలు పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చినట్లు డెమోక్రటిక్ పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.శ్రీను, పి.వెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం ముఖ్యమంత్రి కార్యాలయంలో సీఎం చంద్రబాబు పీఆర్‌టీయూ డైరీ, కాలమానిని ఆవిష్కరించారు. సమాజంలో అన్ని వర్గాల విద్యార్థుల జ్ఞాన సముపార్జనకు ఉపాధ్యాయ సంఘాలు పని చేయాలని ముఖ్యమంత్రి సూచించినట్లు వెల్లడించారు. జిల్లా పరిషత్ ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్ సమస్య పరిష్కరించడానికి ఉన్నతాధికారులతో కమిటీని ఏర్పాటు చేయాలని, జిల్లా పరిషత్ పాఠశాలల పర్యవేక్షకులుగా పంచాయతీరాజ్ ఉపాధ్యాయుల్లో సీనియర్ ప్రధానోపాధ్యాయులను మండల విద్యాశాఖాధికారులుగా నియమించాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేసినట్లు వారు తెలిపారు.

## కేంద్ర మంత్రి అమిత్‌షాతో ఏపీ సీఎం చంద్రబాబు భేటీ

**విశ్వంభర, ఢిల్లీ:**



కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో ఏపీ సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలపై సుమారు అరగంట పాటు వారు చర్చించారు. కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు కేటాయింపుల అంశం వీరి మధ్య చర్చకు వచ్చినట్లు సమాచారం. రాష్ట్రంలోని వివిధ ప్రాజెక్టులకు నిధుల కేటాయింపుల విషయం ప్రస్తావనకు వచ్చినట్లు తెలుస్తోంది. చంద్రబాబు రాత్రి ఢిల్లీ నుంచి బయల్దేరి గురువారం తెల్లవారుజామున 1.40కి తిరిగి అమరావతి చేరుకుంటారు.

## ఏపీలో హైవే నిర్మాణం.. రెండు గిన్నిస్ రికార్డులు: సీఎం చంద్రబాబు

**విశ్వంభర, అమరావతి:**



ఆంధ్రప్రదేశ్‌లో జాతీయ రహదారి నిర్మాణం విషయంలో ఎన్‌హెచ్‌ఏఐ రెండు గిన్నిస్ రికార్డులు సాధించిందని సీఎం చంద్రబాబు ప్రకటించారు. బెంగళూరు- కడప- విజయవాడ ఎకనామిక్ కారిడార్ (ఎన్‌హెచ్-544జీ)లో 24 గంటల్లో 10,675 మెట్రిక్ టన్నుల బిట్యూమనస్ కాంక్రీట్ నిరంతరాయంగా వేసినట్లు చెప్పారు. అదేవిధంగా 24 గంటల్లోనే 28.95 లేన్ కిలోమీటర్ల రహదారి ఏర్పాటైందన్నారు. ఈ ఘనత.. దేశ మౌలిక సదుపాయాల అభివృద్ధిపై భారత ప్రభుత్వ దృక్పథనికి నిదర్శనమని తెలిపారు.

## అమరావతిలో రెండో విడత భూ సమీకరణ ప్రారంభం

**విశ్వంభర, అమరావతి:**



రాజధాని అమరావతిలో రెండో విడత భూ సమీకరణ ప్రారంభమైంది. తుళ్లూరు మండలం వడ్డమానులో స్థానిక ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్‌తో కలిసి మంత్రి నారాయణ ఈ ప్రక్రియను ప్రారంభించారు. రైతుల నుంచి అంగీకార పత్రాలను అధికారులు స్వీకరిస్తున్నారు. అమరావతి మండలం ఎండ్రాయిలో సాయంత్రం గ్రామసభ నిర్వహించనున్నారు.తుళ్లూరు, అమరావతి మండలాల్లోని ఏడు గ్రామాల రైతుల నుంచి ప్రభుత్వం 16,666.57 ఎకరాలు సమీకరించనుంది. తుళ్లూరు మండలంలోని వడ్డమాను, హరిశ్చంద్రపురం, పెదపరిమి, అమరావతి మండలంలోని వైకుంఠపురం, పెదమద్దూరు, ఎండ్రాయి, కర్లపూడి గ్రామాల్లో ప్రభుత్వం ఇప్పుడు భూసమీకరణ చేస్తోంది. అంతర్జాతీయ విమానాశ్రయం, క్రీడానగరం, స్మార్ట్ పరిశ్రమలు, రైల్వేట్రాక్, ఇన్నర్ రింగ్‌రోడ్డు కోసం ఈ భూములు తీసుకుంటోంది.రైతులకు స్థలాలు కేటాయించే లేఔట్ల అభివృద్ధికి అథరిటీ ఈసారి కీలక నిర్ణయం తీసుకుంది. లేఔట్లలో మొదట రెండు వరుసల రహదారులు, విద్యుత్ లైన్లు వేసి వీలైనంత త్వరగా రైతులకు స్థలాలు అప్పగించనుంది.

## బలపం పట్టిస్తారని స్కూలుకు వెళితే చీపురు పట్టించారు

**విశ్వంభర, శ్రీసత్యసాయి జిల్లా:**
చదువు చెప్పాలని బడికి పంపిస్తే కొంమంది టీచర్లు విద్యార్థులతో పనులు చేయిస్తున్నారు. స్కూల్‌లో ఆయాలు చేయాల్సిన ఊడవటం, శుభ్రం చేయడం లాంటి పనులు విద్యార్థులతో చేయిస్తున్నారు. ఇలాంటి ఘటనలు అనేకం వెలుగులోకి వస్తూ టీచర్లపై చర్యలు తీసుకున్నా పరిస్థితి మాత్రం మారడంలేదు. తాజాగా అలాంటి ఘటనే ఏపీలోని శ్రీ సత్యసాయి జిల్లాలో చోటు చేసుకుంది. నంబులపూలకుంట మండలంలోని రంగనపల్లి ప్రథమిక పాఠశాలలో విద్యార్థుల చేత ఉపాధ్యాయులు చీపురు పట్టించారు. పాఠశాలలో స్వీపర్ లేకపోవడంతో విద్యార్థులనే స్వీపర్లుగా మార్చి ఊడవటం, నీళ్ల క్యాన్లు మోయడం లాంటి పనులు చేయించారు. దీనికి సంబంధించి ఓ వ్యక్తి వీడియో తీయగా ప్రస్తుతం వైరల్ అవుతోంది. దీంతో చదివిపిస్తారని బడికి పంపిస్తే పనులు చేయిస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే టీచర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## 'మన శంకరవరప్రసాద్ గారు' సందడి షురూ..



మెగాస్టార్ చిరంజీవి తాజా చిత్రం 'మన శంకరవరప్రసాద్ గారు' సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ సినిమా జనవరి 12న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. హిట్ దర్శకుడు అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో చిరంజీవి సరసన నయనతార కథానాయికగా నటించారు. సినిమా విడుదలకు కొన్ని రోజులే ఉండటంతో ఇప్పటికే ఆన్‌లైన్ టికెట్ బుకింగ్స్ స్టార్ట్ అయ్యాయి. చాలా చోట్ల టికెట్లు వేగంగా అమ్ముడవుతున్నాయి.

ఈ క్రమంలో, కోనసీమ జిల్లా అమలాపురంలోని వెంకటరమణ థియేటర్‌లో జరిగిన ఒక ప్రత్యేక ఈవెంట్ సోషల్ మీడియాలో హాట్ టాపిక్ అవుతోంది. చిరంజీవి యువత అభిమాన సంఘం ఆధ్వర్యంలో ప్రీమియర్ షో మొదటి టికెట్ కోసం వేలం నిర్వహించారు. ఈ వేలంలో మెగా అభిమాని, జిల్లా బీజేపీ మాజీ ప్రధాన కార్యదర్శి వెంకట సుబ్బారావు పాల్గొని, ప్రీమియర్ షో మొదటి టికెట్‌ను ఏకంగా 1.11 లక్షల రూపాయలకు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా వచ్చిన మొత్తాన్ని చిరంజీవి చారిటబుల్ ట్రస్టుకు అందజేస్తామని అభిమాన సంఘం నాయకులు తెలిపారు. తనకు తొలి టికెట్ దక్కడంపై సుబ్బారావు సంతోషం వ్యక్తం చేశారు.

ఇక సినిమా విషయానికి వస్తే, చిరంజీవి - అనిల్ రావిపూడి కాంబినేషన్ కావడంతో ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. సినిమా ప్రోమోలు, పాటలు, ట్రైలర్ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతున్నాయి. సినిమాపై హైప్ రోజురోజుకూ పెరిగిపోతోంది. సినిమాకి సెన్సార్ నుంచి యూ/ఏ సర్టిఫికెట్ దక్కింది. మొత్తం నిడివి 2 గంటల 42 నిమిషాలు. ఈ చిత్రంలో విక్టరీ వెంకటేశ్ ఒక గెస్ట్ రోల్‌లో కనిపించనున్నారు.

సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మాణంలో తెరకెక్కిన ఈ సినిమాకి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించారు. ఈ రోజు సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్ జరగనుండటంతో ఇప్పటికే అభిమానులు, ప్రేక్షకులు ఎంతో ఉత్సాహంగా ఉన్నారు.

## 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' ట్రైలర్ విడుదల



టాలీవుడ్ మాస్ మహారాజ్ రవితేజ హీరోగా తెరకెక్కిన లేటెస్ట్ మూవీ 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' ట్రైలర్ రిలీజ్ అయింది. ఈ మూవీ సంక్రాంతి కానుకగా జనవరి 13 న గ్రాండ్ గా విడుదలకు సిద్ధమైంది. ట్రైలర్ ఫుల్ ఫ్యామిలీ ఎమోషన్స్, రవితేజ మార్క్ ఎంటర్ టైన్ మెంట్, డైలాగ్స్ తో సరదాగా సాగిపోయింది. ఇప్పటికే మూవీపై పాజిటివ్ బజ్ ఏర్పడిన విషయం తెలిసిందే.

మాస్ మహారాజ రవితేజ హీరోగా నటించిన 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' మూవీ నుంచి ట్రైలర్ రిలీజ్ అయింది. టాలీవుడ్ దర్శకుడు కిషోర్ తిరుమల దర్శకత్వం వహించిన ఈ మూవీ సంక్రాంతి కానుకగా జనవరి 13 న విడుదలకు సిద్ధం అయింది. ట్రైలర్ చాలా సరదాగా రవన్న మార్క్ ఎంటర్ టైన్ మెంట్ తో సాగి పోయింది. ఈ సంక్రాంతికి రవితేజ కమ్ బ్యాక్ గ్యారంటీ అని ట్రైలర్ చూస్తే తెలుస్తోంది. భార్య , ప్రేయసి మధ్య నలిగిపోయే వ్యక్తిగా రవితేజ క్యారెక్టర్ ను డిజైన్ చేసినట్లు తెలుస్తోంది.

ఈ మధ్య బ్యాక్ టూ బ్యాక్ గన్ లు, కత్తులు, ఫైట్స్ తెగచేసేశాను. అందుకే మా ఫ్యామిలీ డాక్టర్ చిన్న గ్యాప్ ఇవ్వమని చెప్పాడు అంటూ రవితేజ చెప్పిన డైలాగ్ ఆసక్తికరంగా ఉంది. రవితేజ మాస్ పంచ్‌లు, వెన్నెల కిషోర్, సత్య కామెడీ టైమింగ్ అదిరిపోయాయి. దీంతో ఈసారి హిట్ కొట్టడం పక్కా అంటూ ఫ్యాన్స్ కామెంట్లు పెడుతున్నారు. ఇక ఈ మూవీలో రవితేజ సరసన డింపుల్ హయాతి, అషికా రంగనాథ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. అయితే ఈ సంక్రాంతికి కూడా చాలా పెద్ద సినిమాలు రిలీజ్ కు రెడీ అయ్యాయి. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ 'రాజాసాబ్', మెగాస్టార్ చిరంజీవి 'మన శంకరవరప్రసాద్ గారు'.. అలాగే యంగ్ హీరో నవీన్ పొలిశెట్టి 'అనగనగా ఒక రాజు', శర్వానంద్ 'నారీనారీ నడుమ మురారీ' చిత్రాలు కూడా పండక్కే రిలీజ్ అవుతున్నాయి. మరి వీటిలో సంక్రాంతి విన్నర్ ఏ మూవీ అవుతుందో చూడాలి..



## ఆరు నిమిషాలకు ఆరు కోట్లు డిమాండ్ చేస్తున్న తమన్నా..

భారతీయ సినీ పరిశ్రమలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి తమన్నా భాటియా. కేవలం సినిమాలతోనే కాకుండా, తన డ్యాన్స్ పెర్ఫార్మెన్స్‌లతో బాక్సాఫీస్‌ను షేక్ చేస్తున్న ఈ 'మిల్కీ బ్యూటీ' పారితోషికం ఇప్పుడు టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారింది. కేవలం 6 నిమిషాలకు రూ. 6 కోట్లు వసూలు చేసిందట. తమన్నా డాన్స్ పెర్ఫార్మెన్స్ వైరల్ అవుతోంది. నీలం రంగు దుస్తుల్లో ఆమె చాలా ఆకర్షణీయంగా కనిపించింది. ఆమె డాన్స్ వీడియోలు కూడా వైరల్ అవుతున్నాయి. అయితే, ఈ ఒక్క ప్రదర్శనకు ఆమె ఎంత ఫీజు తీసుకుందో తెలుసా? ఇప్పుడు తమన్నా, ఆ డాన్స్ పెర్ఫార్మెన్స్ కోసం తీసుకున్న అమౌంట్ కూడా వైరల్ అవుతోంది. 'సియాసత్' నివేదిక ప్రకారం, తమన్నా 6 నిమిషాల ప్రదర్శనకు 6 కోట్ల రూపాయల రెమ్యూనరేషన్ తీసుకుంది. డాన్స్ నంబర్లకు అత్యధిక ఫీజు తీసుకునే నటీమణులలో తమన్నా ఒకరు. తమన్నా నటించిన 'జైలర్'లోని 'కావాలా' సాంగ్, 'స్త్రీ 2'లోని 'ఆజ్ కి రాత్', 'రెడ్ 2'లోని 'నషా' పాటలు బాగా హిట్ అయ్యాయని చెప్పాలి. ఈ పాటలకు మిలియన్ల వ్యూస్ వచ్చాయి. 'రెడ్ 2' సినిమాకు ఆమె 5 కోట్ల రూపాయలు ఫీజుగా తీసుకుంది. 'జైలర్' సినిమాకు 3 కోట్ల రూపాయలు తీసుకుంది. తమన్నా కెరీర్ విషయానికి వస్తే... 2005లో 'చాంద్ సా రోషన్ చెహ్రా' సినిమాతో ఆమె అరంగేట్రం చేసింది. ఆ తర్వాత ఆమె అనేక తమిళ చిత్రాల్లో నటించింది. ఆమె హిందీ సినిమాల విషయానికి వస్తే... 'వీరమ్', 'ఎంటర్‌టైన్‌మెంట్', 'తూత్ తూత్ తూతియా', 'బాహుబలి', 'ఖమోషి', 'బబ్లీ బౌన్సర్', 'లస్ట్ స్టోరీస్ 2', 'వేద', 'సికిందర్ కా ముకద్దర్' వంటి చిత్రాల్లో నటించింది. ఇప్పుడు ఆమె చేతిలో అనేక సినిమాలు ఉన్నాయి. ఆమె 'ఓ రోమియో', 'రెంగర్', రోహిత్ శెట్టి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రంలో కనిపించనుంది. సినిమాల షూటింగ్ జరుగుతోంది. 'ఓ రోమియో' షూటింగ్ పూర్తయింది.



## పెళ్లి చేసుకోవాలనుంది - శ్రద్ధా కపూర్

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ శ్రద్ధ కపూర్ గురించి ప్రత్యేకంగా పరిచయాలు అవసరం లేదు.. తెలుగులో ఈమె ప్రభాస్ నటించిన సాహో సినిమాతో ప్రేక్షకులను పలకరించింది.. భారీ బడ్జెట్ తో తెరకెక్కిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద దారుణంగా బోల్తా కొట్టింది. బాలీవుడ్ లో ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ హిట్ చిత్రాలలో నటిస్తూ బిజీగా ఉన్న ఈ అమ్మడు ఇప్పటికీ పెళ్లి చేసుకోలేదు. ఈమెతో పాటి ఇండస్ట్రీ లోకి అడుగుపెట్టిన సీనియర్ హీరోయిన్ల అందరూ పెళ్లి చేసుకొని ప్రస్తుతం ఫ్యామిలీ లైఫ్ ని లీడ్ చేస్తూ సినిమాలు చేస్తూ వస్తున్నారు.. శ్రద్ధ కపూర్ వయసు 38 సంవత్సరాలు. కొన్ని రోజులుగా ఈమె ఓ రచయితతో ప్రేమాయణం నడుపుతుందని వార్తలు వినిపిస్తున్నాయి. తాజాగా ఈ బ్యూటీ పెళ్లి గురించి స్పందించింది.

ఇటీవల ఒక జ్యువెలరీ బ్రాండ్ ప్రమోషన్‌లో భాగంగా శ్రద్ధా ఒక వీడియోను షేర్ చేసింది. అందులో సింగిల్‌గా ఉండకూడదంటే గిఫ్ట్ బాక్సులు కొనాలి అంటూ ఫన్నీగా క్యాప్షన్ ఇచ్చింది. ఇది చూసిన ఒక నెటిజన్ ఆత్రుత ఆపుకోలేక, షాదీ కబ్ కరోగే శ్రద్ధా కపూర్? (శ్రద్ధా.. పెళ్లి ఎప్పుడు చేసుకుంటావు?) అని ప్రశ్నించాడు. దీనికి శ్రద్ధా తనదైన శైలిలో మైనే కరోంగి.. వివాహ్ కరోంగి (నేనే చేసుకుంటాను.. నువ్వు కాదు) అంటూ సెటైరికల్‌గా, ఫన్నీగా రిప్లై ఇచ్చింది. ఈ చిన్న కామెంట్ క్షణాల్లోనే వేల సంఖ్యలో లైకులు, షేర్లతో ట్రెండ్ అయ్యింది. గత కొంతకాలంగా ఈమె ప్రముఖ రచయిత రాహుల్ మోడీతో డేటింగ్‌లో ఉన్నట్లు బాలీవుడ్ కోడై కూస్తోంది. గత ఏడాది ముంబైలో వీరిద్దరూ డిన్నర్ డేట్‌కు వెళ్లడం, ఆ తర్వాత వెకేషన్ ఫోటోలు బయటకు రావడంతో ఈ వార్తలకు బలం చేకూరింది. అయితే పెళ్లి విషయంపై ఇప్పటి వరకు ఈ జంట అధికారికంగా స్పందించలేదు. తాజా కామెంట్ తో త్వరలోనే శ్రద్ధా నుంచి తీపి కబురు అందుతుందని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు.

ఇక వర్క్ ఫ్రంట్ విషయానికి వస్తే.. శ్రద్ధా కపూర్ కెరీర్ ఇప్పుడు పీక్ స్టేజ్‌లో ఉంది. గతేడాది విడుదలైన 'స్త్రీ 2' బాక్సాఫీస్ వద్ద రికార్డులను తిరగరాసి, బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలిచింది. ఈ సినిమా తెచ్చిన క్రేజ్‌తో ఆమె చేతిలో మరిన్ని భారీ ప్రాజెక్టులు ఉన్నాయి. రాబోయే రోజుల్లో 'తుంబాడ్' ప్రీక్వెల్ 'సహాద్వం గీదా, సూపర్ న్యాచురల్ డ్రామా 'నాగిన్'లో నటించనున్నట్లు సమాచారం. మొత్తానికి అటు సినిమాలు, ఇటు పర్సనల్ లైఫ్ వార్తలతో శ్రద్ధా కపూర్ ప్రస్తుతం బాలీవుడ్ టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలిచింది. తన పెళ్లి వార్తలకు ఈమె ఎప్పుడు ఫుల్‌స్టాప్ పెడుతుందో చూడాలి.




## సంక్రాంతికి సమంత సడన్ సర్‌ప్రైజ్

పెళ్లి తర్వాత సమంత ఓ లేడీ ఓరియంటెడ్ యాక్షన్ మూవీతో తెరమీదికి వచ్చారు. సుదీర్ఘ విరామం అనంతరం టాలీవుడ్ లో రీఎంట్రీ ఇచ్చారు. ఆమె నటిస్తోన్న తాజా సినిమా.. మా ఇంటి బంగారం. ఆమె ఫస్ట్ లుక్ వెలువడింది. ఈ సినిమా పోస్టర్‌ను యూనిట్ విడుదల చేసింది. టీజర్ ట్రైలర్ రిలీజ్ తేదీని ప్రకటించింది. ఈ నెల 9వ తేదీన ఉదయం 10 గంటలకు టీజర్ ట్రైలర్ విడుదల కానుంది. ఎప్పుడు విడుదల అవుతుందా అనే ఆసక్తిని పెంచింది.

తాజా స్టిల్ లో మాస్ లుక్స్ లో అదరగొట్టారు సమంత. ఓ బస్సులో చీరకట్టులో రగ్డ్ అండ్ సీరియస్ లుక్స్ నిల్చున్న స్టిల్ ఇది. ఈ పోస్టర్.. సినిమాపై మరింత హైప్ ను క్రియేట్ చేసింది. ఈ సినిమాకు నందిని రెడ్డి దర్శకత్వం వహిస్తోన్నారు. 'ఓ బేబీ' వంటి హిట్ తర్వాత సమంత మళ్లీ దర్శకురాలు నందిని రెడ్డితో కలిసి పని చేస్తున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి ఓ క్రేజీ అప్‌డేట్‌ని పంచుకుంది సమంత. సంక్రాంతి సందర్భంగా ఈ సినిమా టీజర్‌ని విడుదల చేయబోతున్నట్లు ప్రకటించి.. ఫ్యాన్స్‌కి సర్‌ప్రైజ్ చేసింది. ఈ మేరకు ఓ కొత్త పోస్టర్‌ని కూడా విడుదల చేశారు. 'మీరు చూస్తా ఉండండి.. మా ఇంటి బంగారం మీ అందరితో కలిసిపోతుంది' అంటూ ఆ పోస్టర్‌కి క్యాప్షన్ రాసుకొచ్చారు. జనవరి 9న ఈ సినిమా టీజర్ విడుదల చేయనున్నట్లు సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. ఈ చిత్రానికి సమంత భర్త రాజ్ నిడుమోరు కథ అందించగా..సంతోష్ నారాయణన్ సంగీతం అందిస్తున్నారు. బాలీవుడ్ నటుడు గుల్షన్ దేవయ్య కీలకపాత్ర పోషిస్తున్నాడు. 1980 నేపథ్యంలో సాగే క్రైమ్ థ్రిల్లర్‌గా ఈ చిత్రం తెరకెక్కుఉతున్నట్లు సమాచారం.

కాంతారా ఛాప్టర్ 1 ఫేమ్ గుల్షన్ దేవయ్య, కన్నడ స్టార్ హీరో దిగంత్ ఈ సినిమాలో కీలక పాత్రలు పోషిస్తున్నారు. సంతోష్ నారాయణన్ సంగీతాన్ని అందిస్తోన్నారు. త్రలాల మూవీంగ్ పిక్చర్స్ బ్యానర్ కింద రాజ్ నిడిమోరు, సమంత, హిమాంక్ దువ్వూరు సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తోన్నారు. రాజ్ నిడిమోరు, వసంత్ మారిగంటి కథను సమకూర్చారు.

టైటిల్.. చూడ్డానికి ఫ్యామిలీ టైప్ లో కనిపిస్తోంది గానీ యాక్షన్ థ్రిల్లర్ గా తెరకెక్కుతోంది. ది ఫ్యామిలీ మ్యాన్ 2, సిటాడెల్ సక్సెస్ కావడంతో ఇదే జానర్ ను సమంత కంటిన్యూ చేస్తోన్నట్టే కనిపిస్తోంది. మా ఇంటి బంగారం'లో బాడీ డబుల్స్ సహాయం లేకుండానే స్టంట్స్ చేయనున్నారు సమంత. సమంత చివరిసారిగా 2025లో కామెడీ హారర్ మూవీ 'శుభం'లో అతిథి పాత్రలో కనిపించారు. ఇప్పుడు ఫుల్ లెంగ్త్ లేడీ ఓరియంటెడ్ సినిమాలో మెరుపులు మెరిపించనున్నారు.

## పవన్ కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్ కొత్త ప్రయోగం




పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ తన అభిమానులను మరోసారి సర్‌ప్రైజ్ చేశారు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా తన 'పవన్ కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్' బ్యానర్ నుంచి ఓ స్పెషల్ వీడియోను విడుదల చేశారు. జపనీస్ మార్షల్ ఆర్ట్స్ థీమ్‌తో ఉన్న ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతూ, అభిమానుల్లో తీవ్ర ఉత్కంఠను రేపుతోంది.

ఈ వీడియోలో ఎర్రటి సూర్యుడు, జపనీస్ అక్షరాలు, పవర్‌ఫుల్ బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ ఆకట్టుకుంటున్నాయి. వీడియో చివర్లో 'PK' అనే అక్షరాలున్న టీషర్ట్ ధరించి, చేతిలో కటానా కత్తి పట్టుకున్న వ్యక్తి కనిపించడంతో అది పవన్ కల్యాణేనని అందరూ భావించారు. ఆ తర్వాత పవన్ గాలిలోకి ఎగిరి కిక్ ఇస్తున్న షాట్ చూపించడంతో ఫ్యాన్స్ ఉత్సాహం రెట్టింపైంది. దీంతో పవన్ ఒక భారీ మార్షల్ ఆర్ట్స్ ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుడుతున్నారా? లేక కేవలం తన బ్యానర్‌ను రీలాంచ్ చేసేందుకే ఈ ప్రచార చిత్రమా? అనే చర్చ మొదలైంది.

తన కెరీర్ ఆరంభంలో కరాటేలో బ్లాక్ బెల్ట్ సాధించిన పవన్, 'తమ్ముడు', 'బద్రి', 'జానీ' వంటి చిత్రాల్లో మార్షల్ ఆర్ట్స్ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. మళ్లీ ఇన్నాళ్లకు అదే జానర్‌పై దృష్టి సారించడం ఆసక్తిని కలిగిస్తోంది. ప్రస్తుతం ఏపీ డిప్యూటీ సీఎంగా రాజకీయ బాధ్యతలు నిర్వర్తిస్తున్నప్పటికీ, పవన్ సినిమాలను నిర్లక్ష్యం చేయడం లేదు. 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రాన్ని ఈ ఏడాది వేసవికి సిద్ధం చేస్తుండగా, సురేందర్ రెడ్డి దర్శకత్వంలో మరో సినిమాకు కూడా పచ్చజెండా ఊపారు. ఈ నేపథ్యంలో ఈ కొత్త ప్రాజెక్ట్ సినిమానా? వెబ్ సిరీసా? లేక మరేదైనా? అనే దానిపై త్వరలోనే స్పష్టత వస్తుందని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

రిపోర్టర్లు కావలెను
"విశ్వంభర"
తెలుగు దిన పత్రిక
ప్రముఖ తెలుగు దినపత్రికకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లాలు, మండలాల వారిగా
రిపోర్టర్లు, కెమెరామెన్స్, న్యూస్ పేపర్ డిజైనర్స్, సబ్-ఎడిటర్లు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్
పని చేయుటకు అనుభవం, ఆసక్తి గలవారు కావలెను.
సంప్రదించవలసిన చిరునామా
ఫ్లాట్ నెం. 204, 2వ అంతస్తు, బాదం కాంప్లెక్స్, మెట్రో పిల్లర్ నెం. 1560 ఎదురుగా, చైతన్యపురి x రోడ్స్, దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్ - 500 060. తెలంగాణ.
సెల్: 9441222429, 8885402108

రిపోర్టర్లు కావలెను
V3 NEWS
ప్రముఖ టీవీ ఛానల్‌కు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లాలు, మండలాల వారిగా
రిపోర్టర్లు, కెమెరామెన్స్, వీడియో ఎడిటర్స్, గ్రాఫిక్ డిజైనర్, సబ్-ఎడిటర్లు, యాంకర్స్, PCR ఆపరేటర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్
పని చేయుటకు అనుభవం, ఆసక్తి గలవారు కావలెను.
సంప్రదించవలసిన చిరునామా
ఫ్లాట్ నెం. 204, 2వ అంతస్తు, బాదం కాంప్లెక్స్, మెట్రో పిల్లర్ నెం. 1560 ఎదురుగా, చైతన్యపురి x రోడ్స్, దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్ - 500 060. తెలంగాణ.
సెల్: 9441222429, 8885402108

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. RNI No : TGTEL/25/A1676, Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com